FOR ADS.......
ఆకాంక్ష
CONTACT :
8333818121

తొలి ఆకాంక్ష
తెలుగు సంచలన దిన పత్రిక TGTEL/25/A1964

విలేకరులు కావలెను
ప్రజా సమస్యల పరిష్కార మార్గాలనే లక్ష్యంగా ఉన్నత ఆశయంతో ముందుకు పోతున్న తొలి ఆకాంక్ష దినపత్రికలో
భువనగిరి, జయశంకర్ భూపాలపల్లి, పెద్దపల్లి, జగిత్యాల, జనగాం, మహబూబ్ నగర్, నల్గొండ, ఖమ్మం, ఆదిలాబాద్, కామారెడ్డి, యాదాద్రి మేడ్చల్ మల్కాజిగిరి, వరంగల్, జోగులాంబ గద్వాల్ , సూర్యాపేట, జిల్లా కేంద్రాలకు స్టాఫ్ రిపోర్టర్స్‌తో పాటు ...
అన్ని జిల్లాలోని నియోజక వర్గ కేంద్రాలకు విలేకరులు కావలెను ..
సంప్రదించండి...
8333818121
ఎడిటర్ పెనగొండ సతీష్
ఆకాంక్ష akankshanews.com

ప్రచురణ : తెలంగాణ సంపుటి : 01 సంచిక :189 ఎడిటర్ : పెనగొండ సతీష్ పేజీలు : 08, వెల. 5రూ/ ఆదివారం- 01 - మార్చి - 2026

# విమానయాన సంస్థలకు కేంద్రం కీలక ఆదేశాలు



- ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దాడుల నేపథ్యంలో కేంద్రం అప్రమత్తం
- అంతర్జాతీయ విమాన సర్వీసులకు ప్రత్యామ్నాయ మార్గాల సూచన
- దేశంలోని ప్రధాన విమానాశ్రయాల్లో హై అలర్ట్
- విదేశాంగ శాఖతో సమన్వయం చేసుకుంటున్న పౌర విమానయాన శాఖ
- విమాన షెడ్యూల్ మార్పులపై ప్రయాణికులకు సమాచారం ఇవ్వాలని ఆదేశాలు

అమరావతి : ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ శనివారం భారీ సైనిక చర్యను ప్రారంభించిన నేపథ్యంలో పౌర విమానయాన మంత్రిత్వ శాఖ అప్రమత్తమైంది. పశ్చిమ ఆసియాలో (మిడిల్ ఈస్ట్) నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల దృష్ట్యా, అంతర్జాతీయ సర్వీసులు నడిపే అన్ని భారతీయ విమానయాన సంస్థలకు కేంద్రం కీలక ఆదేశాలు జారీ చేసింది. ప్రయాణికుల భద్రతే అత్యంత ప్రాధాన్యమని స్పష్టం చేస్తూ, మిగతా..2లో

# మద్యం కేసుతో భారాస రాజకీయంగా నష్టపోయింది



## కోర్టు తీర్పుతో కవితకు న్యాయం జరిగింది కేటీఆర్

హైదరాబాద్: దిల్లీ మద్యం కేసుతో అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో రాజకీయంగా నష్టపోయింది మాత్రం భారాస పార్టీయేనని ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తెలిపారు. కవితకు కోర్టులో ఈ రోజు న్యాయం జరిగిందని పేర్కొన్నారు. దిల్లీ మద్యం కేసుపై కోర్టు తీర్పు నేపథ్యంలో.. శుక్రవారం 'ఎక్స్'లో కేటీఆర్ స్పందించారు. "మద్యం కుంభకోణం.. అనే సాకుతో దిల్లీలో కేజ్రీవాల్ నేతృత్వంలోని ఆప్ ప్రభుత్వాన్ని కూల్చారు. ఆ కేసు కారణంగా అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో రాజకీయంగా నష్టపోయింది మాత్రం భారాసనే. ఇదేవిధంగా మా నాయకులపై నమోదైన ప్రతి కేసు అబద్ధమని, రాజకీయ ప్రేరేపితమని, కల్పితమని త్వరలోనే తేలిపోతుంది. మిగతా..2లో

# రేవంత్ రెడ్డి, పార్టీ అధిష్ఠానం మీద విశ్వాసం ఉంది



2

- ★ తెలంగాణలో ఖాళీ అవుతున్న రెండు రాజ్యసభ స్థానాలు
- ★ తన పనితీరు చూసి రేవంత్ రెడ్డి తప్పకుండా అవకాశం ఇవ్వాలన్న వీహెచ్
- ★ పార్టీలో పనిచేసే వారికి పదవులు దక్కుతాయని రేవంత్ రెడ్డి అన్నారన్న వీహెచ్
- ★ మొదటి నుంచి పార్టీ కోసం పని చేస్తున్నానని వెల్లడి

హైదరాబాద్: తనకు రాజ్యసభ అవకాశం కల్పించే విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, పార్టీ అధిష్ఠానం మీద పూర్తి విశ్వాసం ఉందని తెలంగాణ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు వి హనుమంతరావు అన్నారు.

## శారదాపీఠం భూములపై
# సీఎం రేవంత్ కీలక నిర్ణయం

హైదరాబాద్: తెలంగాణలోని శారదాపీఠం భూముల అంశానికి సంబంధించి సీఎం రేవంత్‌రెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నారు. భూములను శారదా పీఠానికే కొనసాగించాలని ఆదేశించారు. అదే సమయంలో జలమండలికి భూ కేటాయింపులు రద్దు చేశారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో వివిధ శాఖల ఉన్నతాధికారుల సీఎం రేవంత్ సమావేశం అయ్యారు. 99 రోజుల కార్యచరణ ప్రణాళికపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. పూర్తిస్థాయి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ముఖ్యంగా శారదాపీఠం భూముల అంశంపై సీఎం ఆరా తీశారు. ఈ క్రమంలోనే నిర్మాణాల తాజా స్థితిని తెలియజేయనందుకు అధికారులపై రేవంత్ ఫైర్ అయినట్లు సమాచారం. కాగా, 2019లో తెలంగాణలో విశాఖ శ్రీశారదా పీఠానికి అప్పటి కేసీఆర్ ప్రభుత్వం హైదరాబాద్ పరిధిలో సుమారు రెండున్నర ఎకరాల భూమిని కేటాయించింది. విలువైన ప్రభుత్వ భూమిని కేవలం రూపాయికే కట్టబెట్టడంపై ఆ సమయంలో చర్చలు నడిచాయి. ఈ భూమి కేటాయింపు పీఠం యొక్క ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాల నిమిత్తం జరిగిందని, ఇది ఆ పీఠం విజ్ఞప్తి మేరకే జరిగినట్లు తెలుస్తోంది.



### బీఆర్ఎస్ ధ్వజం

శారదా పీఠం భూములు అంశానికి సంబంధించి రేవంత్ సర్కార్‌పై బీఆర్ఎస్ ధ్వజమెత్తింది. తెలంగాణలో ఇళ్లు కూల్చడం అయిపోయిందని, ఇక దేవాలయాలు కూల్చడానికి కాంగ్రెస్ నేతలు సిద్ధమయ్యారంటూ హరీష్ రావు విమర్శించారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండటం ఇష్టం లేదా అంటూ ప్రశ్నించారు.

## నిర్మాణ రంగం అంటే కేవలం కాంట్రాక్టు కాదు...
# రాష్ట్ర, దేశ నిర్మాణం

- మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్న మంత్రి
- రోడ్లు, భవనాల నిర్మాణంలో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం కల్పిస్తున్నట్లు వెల్లడి
- విజన్ 2047 లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్న మంత్రి



2లో

## విశ్వగురువుపై అమెరికా అంచనాకు వచ్చేసింది'- పాక్‌కు ట్రంప్ మద్దతుపై కాంగ్రెస్ విమర్శలు



2

- ★ ఏకపక్ష ట్రేడ్ డీల్‌కు మోదీ సర్కారు తల ఊపింది
- ★ భారత్ ఆర్థిక దౌత్యం ఫెయిలైన పర్యవసానమిది భారత్‌కు ట్రంప్ వరుస షాక్‌లు ఇస్తున్నారు
- ★ కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్

## రైతులను నాశనం చేస్తున్న భారత్ ,
# అమెరికా ఒప్పందం

- ❖ వ్యవసాయ రంగంపై భిన్నాభిప్రాయాల కారణంగా నాలుగు నెలలు నిలిచిన ఒప్పందం
- ❖ 15 నిమిషాల్లో ఎలా పూర్తయింది- కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రశ్న



2లో

ఢిల్లి : భారత్, అమెరికా మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందం దేశ రైతులను నాశనం చేస్తుందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. ఏటా భారత్ రూ. 9 లక్షల కోట్ల విలువైన అమెరికా ఉత్పత్తులను కొనుగోలు చేస్తుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు ప్రధాని నరేంద్ర మోదీ హామీ ఇచ్చారని గాంధీ అన్నారు. ఈ మేరకు పంజాబ్ లో బర్నాలాలో జరిగిన మజ్దూర్ కిసాన్ మహా ర్యాలీలో పాల్గొన్న రాహుల్, పలు వ్యాఖ్యలు చేశారు.

అకస్మాత్తుగా ఎలా కుదిరింది: రాహుల్

వ్యవసాయ రంగంపై భిన్నాభిప్రాయాల కారణంగా ఒప్పందం నాలుగు నెలలుగా నిలిచిపోయిందని

## కాకినాడ జిల్లా బాణసంచా పేలుడుపై
# ప్రధాని మోదీ దిగ్భ్రాంతి...

### బాధితుల కుటుంబాలకు అండగా ఉంటామని వెల్లడి

- ❖ కాకినాడ ఘటన దురదృష్టకరమన్న ప్రధాని మోదీ
- ❖ గాయపడిన వారికి రూ.50 వేల చొప్పున సాయం ప్రకటన
- ❖ బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి



హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడ జిల్లాలో చోటుచేసుకున్న ఘోర ప్రమాదంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఓ బాణసంచా తయారీ కర్మాగారంలో ప్రమాదవశాత్తు జరిగిన పేలుడు ఘటనలో ప్రాణనష్టం సంభవించడం పట్ల ఆయన విచారం వ్యక్తం చేశారు. ఈ ఘటన తనను ఎంతగానో కలచివేసిందని పేర్కొన్నారు. ఈ మేరకు ప్రధాని మోదీ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. "కాకినాడ జిల్లాలోని మిగతా..2లో

## వేట్లపాలెంలో విస్ఫోటనం
# తీవ్ర దిగ్భ్రాంతికరం



2

- ★ మృతుల కుటుంబాలకు సానుభూతి తెలిపిన పవన్ కల్యాణ్
- ★ బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందన్న ఉప ముఖ్యమంత్రి
- ★ పేలుళ్లకు కారణాలపై విచారణ జరుపుతున్నట్లు వెల్లడి

## రేవంత్ రెడ్డి నిర్ణయంపై
# హరీశ్ రావు ప్రశంసలు



- శారదాపీఠంకు కేటాయించిన భూములు పీఠానికే చెందేలా సీఎం ఆదేశాలు
- ముఖ్యమంత్రి ఆదేశాలు శుభపరిణామమన్న ముఖ్యమంత్రి
- రేవంత్ రెడ్డికి అమ్మారు ఇప్పటికైనా సరైన బుద్ధి ప్రసాదించారన్న హరీశ్ రావు

హైదరాబాద్: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకున్న ఒక నిర్ణయంపై బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు హర్షం వ్యక్తం చేశారు. కోకాపేటలోని శారదాపీఠంకు కేటాయించిన భూములను తిరిగి పీఠానికే కొనసాగించాలని ఆదేశాలు ఇవ్వడంపై హరీశ్ రావు స్పందించారు. ముఖ్యమంత్రి ఆదేశాలు శుభపరిణామమని అన్నారు. ఈ మేరకు 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. కోకాపేటలో శారదా పీఠం భూములను జలమండలికి కేటాయించిన నిర్ణయాన్ని రద్దు చేయడం రాజ శ్యామలాదేవి అమ్మవారి కృపతో జరిగిన ధర్మ విజయమని, ఇది భక్తుల విజయమని పేర్కొన్నారు. ఆ అమ్మవారు ఇప్పటికైనా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సరైన బుద్ధి ప్రసాదించారని అన్నారు. అదే సమయంలో, ఎలాంటి స్పష్టమైన ప్రజాప్రయోజన ప్రతిపాదిక లేకుండా పర్యావరణ నియమ నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ ఖజానాకు తూట్లు పొడుస్తూ నామినేషన్ పద్ధతిలో మీ అల్లుడి అనుయాయులకి హెచ్ఎండీఏ ద్వారా కేటాయించిన 17 ఎకరాల భూమి సంగతి ఏమిటని హరీశ్ రావు ముఖ్యమంత్రిని నిలదీశారు. ఆ భూమిలో కొనసాగుతున్న క్రషర్ యూనిట్‌ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజాప్రయోజనాలకు వ్యతిరేకంగా తీసుకునే రేవంత్ రెడ్డి ప్రభుత్వం చర్యలపై బీఆర్ఎస్ పోరాటం కొనసాగిస్తుందని హెచ్చరించారు.

## ఆంధ్ర యూనివర్సిటీకి పూర్వవైభవం
# తీసుకువస్తాం



- ★ ఆంధ్ర యూనివర్సిటీ శతాబ్ది ఉత్సవాలపై మంత్రి లోకేష్ సమీక్ష
- ★ ఏయూని ప్రపంచస్థాయిలో సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌గా మార్చడమే లక్ష్యం
- ★ మార్చి 26 నుంచి ఏప్రిల్ 26 వరకు పూర్వ విద్యార్థులతో వేడుకలు
- ★ యూనివర్సిటీ వందేళ్ల విజన్‌కు యాక్షన్ ప్లాన్ రూపొందించాలని ఆదేశం

మొదటి పేజి తరువాయి

## వేట్లపాలెంలో విస్ఫోటనం తీవ్ర దిగ్భ్రాంతికరం

అమరావతి : కాకినాడ జిల్లాలో బాణసంచా పరిశ్రమలో పేలుడు జరిగి 21 మంది మరణించిన ఘటనపై ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వేట్లపాలెం వద్ద జరిగిన ఈ పేలుడు ఘటనలో పలువురు మృతి చెందారని తెలిసి ఆవేదనకు గురయ్యానని, మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నానని ఆయన పేర్కొన్నారు. బాధిత కుటుంబాలకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని అన్నారు. ఈ దుర్ఘటన గురించి తెలియగానే జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి ఘటన వివరాలు తెలుసుకున్నట్లు పవన్ కల్యాణ్ వెల్లడించారు. కలెక్టర్, ఎస్పీ ఘటన స్థలంలో ఉండి పరిస్థితిని, సహాయక చర్యలను పర్యవేక్షిస్తూ, క్షతగాత్రులను మెరుగైన వైద్యం కోసం కాకినాడకు తరలించే ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. బాణాసంచా తయారీ పరిశ్రమ వద్ద ఇంకా పేలుళ్లు చోటుచేసుకుంటున్నట్టు అధికారులు తెలియజేశారని, పేలుళ్లకు కారణాలపై విచారణ ప్రారంభించినట్లు తెలిపారు. బాణాసంచా పరిశ్రమలపై అధికారులు ఎప్పటికప్పుడు నిఘా ఉంచాలని, భద్రత చర్యలను తనిఖీ చేయాలని జిల్లా అధికారులకు ఆదేశించినట్లు పవన్ కల్యాణ్ తెలిపారు. పరిసర గ్రామాలకు పొగ అలుముకున్న క్రమంలో ఆయా గ్రామాల ప్రజలకి ధైర్యం చెప్పి, వైద్య సిబ్బంది అందుబాటులో ఉండేలా ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. సహాయక చర్యల పర్యవేక్షణ కోసం, బాధిత కుటుంబాలకు ధైర్యం చెప్పడానికి మంత్రి కందుల దుర్గేశ్, ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్‌లను ఘటనాస్థలానికి పంపించినట్లు తెలిపారు.

## కాకినాడ జిల్లా బాణసంచా పేలుడుపై ప్రధాని మోదీ దిగ్భ్రాంతి...

బాణసంచా కర్మాగారంలో ప్రమాదవశాత్తు జరిగిన పేలుడులో ప్రాణనష్టం సంభవించడం చాలా బాధాకరం. ఈ క్లిష్ట సమయంలో బాధిత ప్రజలు మరియు వారి కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను" అని ప్రధాని పేర్కొన్నారు. అలాగే ఈ ప్రమాదంలో గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని దేవుడిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. బాధిత కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వం తరఫున ఆర్థిక సాయాన్ని కూడా ప్రధాని ప్రకటించారు. ఈ ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు ప్రధానమంత్రి జాతీయ సహాయ నిధి నుంచి రూ.2 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా అందించనున్నట్లు వెల్లడించారు. అలాగే ప్రమాదంలో గాయపడిన వారికి రూ.50 వేల చొప్పున ఆర్థిక సాయం అందించనున్నట్లు ప్రధాని తెలిపారు.

## నిర్మాణ రంగం అంటే కేవలం కాంట్రాక్టు కాదు... రాష్ట్ర, దేశ నిర్మాణం

హైదరాబాద్: నిర్మాణ రంగం అంటే కేవలం కాంట్రాక్టు కాదని, అది రాష్ట్ర, దేశ నిర్మాణమని తెలంగాణ రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన నేషనల్ మేనేజింగ్ కమిటీ అండ్ జనరల్ కౌన్సిల్ మీటింగ్-2025-26 కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రాష్ట్రంలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తుందని అన్నారు. రోడ్లు, భవనాల నిర్మాణంలో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం కల్పిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో వేగవంతమైన అభివృద్ధి లక్ష్యంగా విజన్ 2047 లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని అన్నారు. అభివృద్ధికి నిర్మాణ రంగం కీలకమని అన్నారు. ప్రభుత్వంతో కలిసి పనిచేస్తూ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని బిల్డర్లకు మంత్రి సూచించారు. ప్రభుత్వాలు ప్రణాళికలు వేస్తాయి, బడ్జెట్ కేటాయిస్తాయి, ప్రాజెక్టులను ప్రకటిస్తాయని కానీ ఆ ప్రణాళికలకు ప్రాణం పోసేది మాత్రం బిల్డర్లేనని అన్నారు. బిల్డర్లు వేసే రోడ్లు ప్రజల ప్రయాణాన్ని సులభం చేస్తాయని, వంతెనలు దూరాన్ని తగ్గిస్తాయని అన్నారు. బిల్డర్లు కట్టే భవనాలు సేవలకు నిలయాలు అవుతాయని అన్నారు. అందుకే నిర్మాణ రంగం అంటే తన వరకు కేవలం కాంట్రాక్టు కాదని, దేశ, రాష్ట్ర నిర్మాణమని వ్యాఖ్యానించారు. అభివృద్ధికి పునాది మౌలిక వసతులేనని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. రోడ్లు బాగుంటేనే పెట్టుబడులు వస్తాయని, కనెక్టివిటీ బాగుంటేనే పరిశ్రమలు వస్తాయని వ్యాఖ్యానించారు. ప్రస్తుతం సుమారు లక్ష కోట్ల రూపాయల విలువైన పనులు రాష్ట్రంలో కొనసాగుతున్నాయని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ రకాల పనులు జరుగుతున్నాయని అన్నారు. ప్రత్యేకంగా రీజినల్ రింగ్ రోడ్డు తెలంగాణ భవిష్యత్తును మార్చే ప్రాజెక్టు అన్నారు. ఈ ప్రాజెక్టు హైదరాబాద్ చుట్టూ ట్రాఫిక్ భారాన్ని తగ్గించడమే కాదని, చుట్టుపక్కల జిల్లాల్లో అభివృద్ధికి మార్గాలు వేస్తుందని అన్నారు. ఇది ఆర్థిక కారిడార్లకు దారి తీస్తుందని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు.

## రేవంత్ రెడ్డి, పార్టీ అధిష్ఠానం మీద విశ్వాసం ఉంది

తెలంగాణలో రెండు రాజ్యసభ స్థానాలు ఖాళీ కానుండగా, వాటి కోసం పలువురు రేసులో ఉన్నారు. ఈ నేపథ్యంలో వీహెచ్ కూడా తనకు అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, పార్టీలో తన పనితీరును చూసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తప్పకుండా అవకాశం ఇవ్వాలని కోరారు. పార్టీలో పని చేసిన వారికే పదవులు దక్కుతాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల వికారాబాద్‌లో జరిగిన డీసీసీ శిక్షణ తరగతుల్లో చెప్పారని గుర్తుచేశారు. ఈరోజు వరకు పార్టీ కోసం పనిచేస్తూనే ఉన్నానని, అందుకే రాజ్యసభ అవకాశం ఇవ్వాలని కోరుతున్నానని అన్నారు. పార్టీ కోసం తన పోరాట సామర్థ్యాలను చూసి అవకాశం ఇస్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పదేళ్ల కాలంలో అందరికంటే ఎక్కువగా తనమీద కేసులు నమోదయ్యాయని అన్నారు. అయినప్పటికీ తాను భయపడటం లేదని తెలిపారు. కాంగ్రెస్ పార్టీకి ఒక సిపాయిగా, గాంధీ కుటుంబానికి విధేయుడిగా పనిచేస్తున్నానని అన్నారు. తనకు రాజ్యసభ అవకాశంపై పలువురు కార్యకర్తలు ఫోన్లు చేస్తున్నారని తెలిపారు. తనకు ఫోన్లు చేసే వారికి ఒక విషయం చెప్పదలుచుకున్నానని, మన పని మనం చేసుకుంటూ వెళదామని అన్నారు. మిగిలినది అధిష్ఠానానికి వదిలివేద్దామని వ్యాఖ్యానించారు. జీవితంలో ఎవరికీ అన్యాయం చేయని తనకు న్యాయం జరుగుతుందని అన్నారు. తనకు రెండుసార్లు అన్యాయం జరిగినా పార్టీ జెండా మోస్తూనే ఉన్నానని తెలిపారు. తనకు అవకాశం ఇవ్వాలని మల్లికార్జున ఖర్గేను కలిసినట్లు తెలిపారు. అవకాశం ఇవ్వాలని సోనియా గాంధీకి కూడా లేఖ రాసినట్లు తెలిపారు. గడిచిన పదేళ్లలో తనకు ఎలాంటి పదవి లేదని అన్నారు. ఈసారి ఈ బీసీ బిడ్డకు అవకాశం ఇవ్వాలని కోరారు. తనకు జాతీయ రాజకీయాల్లో చాలా పరిచయాలు ఉన్నాయని తెలిపారు. తాను ఢిల్లీలో ఉంటే మిగతా పార్టీలు, రాష్ట్రాలతో సమన్వయం చేసుకుని రాహుల్ గాంధీని ప్రధానిని చేయడానికి ప్రయత్నం చేస్తానని అన్నారు.

## విమానయాన సంస్థలకు కేంద్రం కీలక ఆదేశాలు

ఆయా దేశాల ఎయిర్ స్పేస్ అడ్వైజరీలు, నోటీస్ టు ఎయిర్‌మెన్ హెచ్చరికలను నిరంతరం గమనించాలని సూచించింది. మిడిల్ ఈస్ట్ గగనతలంలో ఆంక్షలు అమల్లోకి రావడంతో, అవసరమైన చోట విమానాలను దారి మళ్లించాలని (రీ-రూటింగ్), గ్లోబల్ సేఫ్టీ ప్రోటోకాల్స్ పాటించాలని ఎయిర్‌లైన్స్‌ను ఆదేశించింది. ఈ మేరకు పౌర విమానయాన శాఖ కార్యదర్శి సమీర్ కుమార్ సిన్హా. ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా , డీజీసీఏ ఎయిర్‌లైన్ ఆపరేటర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అత్యవసర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు దేశంలోని ప్రధాన అంతర్జాతీయ విమానాశ్రయాలను అలర్ట్ చేశారు. విమానాల దారి మళ్లింపు, అత్యవసర ల్యాండింగ్‌లు జరిగితే ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా గ్రౌండ్ హ్యాండ్లింగ్, ఇమ్మిగ్రేషన్, ఇతర సౌకర్యాలను సిద్ధంగా ఉంచాలని ఎయిర్‌పోర్ట్ ఆపరేటర్లకు సూచించారు. విదేశాల్లో ఉన్న భారతీయుల కోసం విదేశాంగ శాఖతో నిరంతరం సమన్వయం చేసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు.మరోవైపు, విమాన రాకపోకల్లో జాప్యం లేదా మార్పులు ఉంటే వెంటనే ప్రయాణికులకు తెలియజేయాలని విమానయాన సంస్థలను ఆదేశించారు. ప్రయాణికులు కూడా తమ ప్రయాణానికి ముందు ఎయిర్‌లైన్స్‌తో సంప్రదించి, తాజా సమాచారం తెలుసుకోవాలని సూచించారు.

## మద్యం కేసుతో భారాస రాజకీయంగా నష్టపోయింది



కాంగ్రెస్, భాజపాలు చేసే బాధ్యతారహితమైన ఆరోపణలను మనం చూశాం. సత్యం గెలిచే వరకూ... ఈ అసత్యాలే ప్రచారంలో ఉన్నాయి. అసత్య, కుట్రపూరిత కేసులను, ఆరోపణలను వివిధ మాధ్యమాల ద్వారా మరింత పెద్దవి చేసి.. ప్రజలను తప్పుదోవ పట్టించడానికి, మా ప్రతిష్ఠను దెబ్బతీయడానికి ప్రయత్నిస్తున్నారు. దురదృష్టవశాత్తూ సాక్ష్యాల కంటే ఆరోపణలకే ప్రాధాన్యమిస్తూ.. న్యాయ ప్రక్రియ కంటే మీడియా కథనాలే మిన్న అనే ధోరణి ఈ నవభారతంలో అలవాటుగా మారిపోయింది. కానీ, చివరికి న్యాయమే గెలుస్తుంది" అని కేటీఆర్ పేర్కొన్నారు. దిల్లీ మద్యం కేసులో కడిగిన ముత్యంలా తీర్పు ఉంటుందని భారాస అధినేత కేసీఆర్ ఆనాడే చెప్పారని ఆ పార్టీ సీనియర్ నేత, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. రాజకీయ ప్రయోజనాల కోసం, ప్రత్యర్థులను అణచివేయడమే లక్ష్యంగా కేంద్రంలోని భాజపా ప్రభుత్వం అల్లిన కుట్రలు ఒక్కొక్కటిగా వీగిపోతుండటం హర్షించదగ్గ విషయమని ఆయన పేర్కొన్నారు. అరవింద్ కేజ్రీవాల్, మనీశ్ సిసోదియా, కల్వకుంట్ల కవిత వంటి నాయకులపై మోపిన అక్రమ కేసులు.. కేవలం రాజకీయ కక్షతో కూడుకున్నవని కోర్టు తీర్పుల ద్వారా స్పష్టమవుతోందని తెలిపారు.

## బాణసంచా తయారీ కేంద్రంలో భారీ పేలుడు - ఘటనాస్థలాన్ని పరిశీలించిన సీఎం చంద్రబాబు

మొదటి పేజి తరువాయి

తీవ్ర దిగ్భ్రాంతికి గురైన ఉపముఖ్యమంత్రి : కాకినాడ జిల్లా వేట్లపాలెం గ్రామంలోని బాణాసంచా పరిశ్రమలో చోటు చేసుకున్న భారీ విస్ఫోటనంలో పలువురు మృతి చెందారని తెలిసి తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యామని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి కందుల దుర్గేష్, మంత్రి లోకేశ్ ఆవేదన వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆ కుటుంబాలకి ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. కలెక్టర్, ఎస్పీ ఘటన స్థలంలో ఉండి పరిస్థితిని, సహాయక చర్యలను పర్యవేక్షిస్తూ క్షతగాత్రులను మెరుగైన వైద్యం కోసం కాకినాడకు తరలించే ఏర్పాట్లు చేశారన్నారు. బాణాసంచా తయారీ పరిశ్రమ నుంచి ఇంకా పేలుళ్లు వస్తున్నాయని అధికారులు తెలిపారు. బాణాసంచా పరిశ్రమలపై అధికారులు ఎప్పటికప్పుడు నిఘా ఉంచి భద్రత చర్యలను తనిఖీ చేయాలని జిల్లా అధికారులకు పవన్ ఆదేశించారు. రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ లను ఘటన స్థలానికి వెళ్లి సహాయక చర్యలు పర్యవేక్షణ చేపట్టి బాధిత కుటుంబాలకు ధైర్యం చెప్పాలని దిశానిర్దేశం చేయలని పవన్ సూచించారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు మంత్రి కందుల దుర్గేష్ నిడదవోలు నియోజకవర్గం పెరవలి నుండి హుటాహుటిన కాకినాడ వేట్లపాలెం బయల్దేరి వెళ్లారు. మృతుల కుటుంబాలకు లోకేశ్ భరోసా : కాకినాడ జిల్లా సామర్లకోట మండలం వేట్లపాలెంలో బాణసంచా తయారీ కేంద్రంలో పేలుడు సమాచారం తెలిసి తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యానని విద్య, ఐటి శాఖల మంత్రి నారా లోకేశ్ తెలిపారు. పలువురు మృత్యువాత పడటం మాటలకు అందని విషాదం అన్నారు. మృతులకు నివాళులు అర్పించారు. మృతుల కుటుంబాలను కూటమి ప్రభుత్వం ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందిస్తామని తెలిపారు. కాకినాడ జిల్లా సామర్లకోట మండలం వేట్లపాలెంలో పేలుడు ఘటనలో కార్మికులు మృతి పట్ల హోం మంత్రి అనిత తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. విజయనగరం జిల్లా చీపురుపల్లి నుంచి హుటాహుటిన వేట్లపాలెంలో పేలుడు ఘటన స్థలానికి హోం మంత్రి బయలుదేరారు. కాకినాడ జిల్లా కలెక్టర్, ఎస్పీతో ఎప్పటికప్పుడు ఫోన్లో మాట్లాడి వివరాలను హోంమంత్రి ఆరా తీస్తున్నారు. ఘటనపై మంత్రులు తీవ్ర దిగ్భ్రాంతి : కాకినాడ జిల్లా వెట్లపాలెంలో బాణా సంచా పేలుడు ఘటనపై మంత్రులు అచ్చెన్నాయుడు, సుభాష్, సత్యకుమార్, నారాయణలు దిగ్భ్రాంతి వ్యక్తం చేసారు. తక్షణ వైద్య సహాయక చర్యలు చేపట్టాలని వైద్య శాఖ సెక్రటరీ, డిఎంఈ, డిఎంహెచ్ఓ లకు సత్య కుమార్ ఆదేశించారు. సూపర్ స్పెషాలిటీ వైద్యులు, ఇతర సిబ్బందిని సంఘటన స్థలానికి వెంటనే పంపాలని తెలిపారు. అంబులెన్సులు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఘటన జరిగిన వెంటనే సహాయక చర్యలు వేగవంతం చేయాలని, అగ్నిమాపక సిబ్బంది , రెస్క్యూ బృందాలు అప్రమత్తంగా పనిచేయాలని సుభాష్ సూచించారు. మంటల్లో చిక్కుకున్న కార్మికులను సురక్షితంగా బయటకు తీసుకురావడానికి అన్ని చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ ప్రమాదానికి గల కారణాలపై సమగ్ర విచారణ జరిపించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా భద్రతా ప్రమాణాలను మరింత కఠినంగా అమలు చేయాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వం బాధిత కుటుంబాలకు అన్ని విధాలుగా అండగా ఉంటుందని, అవసరమైన సహాయాన్ని వెంటనే అందిస్తామని కార్మిక శాఖ మంత్రి హామీ ఇచ్చారు. ఈ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన కార్మికుల కుటుంబాలకు మంత్రులు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## ఆంధ్ర యూనివర్సిటీకి పూర్వవైభవం తీసుకువస్తాం

మొదటి పేజి తరువాయి

అమరావతి : చారిత్రక నేపథ్యం కలిగిన ఆంధ్ర యూనివర్సిటీకి (ఏయూ) పూర్వవైభవం తీసుకువచ్చే దిశగా కృషి చేస్తున్నామని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. ఏయూ శతాబ్ది ఉత్సవాలను చరిత్రలో నిలిచిపోయేలా, కనీవినీ ఎరుగని రీతిలో అత్యంత ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. విశాఖపట్నంలో ఆంధ్ర యూనివర్సిటీ శతాబ్ది ఉత్సవాల నిర్వహణపై వర్సిటీ వైస్ ఛాన్స్ లర్ (వీసీ) ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్, ఇతర ఉన్నతాధికారులతో మంత్రి లోకేశ్ విస్తృత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఆంధ్ర యూనివర్సిటీకి దశాబ్దాల ఘన చరిత్ర ఉందని గుర్తుచేశారు. ఈ యూనివర్సిటీని ప్రపంచంలోనే మేటి విద్యాసంస్థగా, 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'గా తీర్చిదిద్దేందుకు ఈ శతాబ్ది ఉత్సవాలు ఒక వేదికగా నిలవాలని ఆకాంక్షించారు. మార్చి 26 నుంచి ఏప్రిల్ 26వ తేదీ వరకు నెల రోజుల పాటు జరగనున్న ఈ ఉత్సవాల్లో పూర్వ విద్యార్థులను (అల్యూమిని) విస్తృతంగా భాగస్వాములను చేయాలని సూచించారు. వారి అనుభవాలు, విజయాలు ప్రస్తుత తరానికి



స్ఫూర్తినిచ్చేలా కార్యక్రమాలు రూపొందించాలన్నారు. శతాబ్ది ఉత్సవాల్లో ఏయూ ఘన చరిత్ర ప్రతిబింబించేలా అన్ని చర్యలు తీసుకోవాలని, దీనికోసం నియమించిన వివిధ కమిటీల మధ్య సమన్వయం ఉండాలని మంత్రి స్పష్టం చేశారు. మీడియా పబ్లిసిటీకి అధిక ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు, ప్రస్తుత విద్యార్థులతో కళలు, సంగీతం, సాహిత్యం వంటి సాంస్కృతిక కార్యక్రమాలను వినూత్నంగా రూపొందించాలని చెప్పారు. ఈ ప్రక్రియలో విద్యార్థుల అభిప్రాయాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలన్నారు. కేవలం యూనివర్సిటీకే పరిమితం కాకుండా, ఉత్తరాంధ్ర ప్రజలను, విద్యార్థులను కూడా ఈ వేడుకల్లో భాగస్వాములను చేయాలని లోకేష్ దిశానిర్దేశం చేశారు. ప్రముఖులతో వివిధ అంశాలపై ప్రత్యేక సదస్సులు నిర్వహించడంతో పాటు, యూనివర్సిటీ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని రాబోయే వందేళ్ల విజన్‌కు తగిన 'యాక్షన్ ప్లాన్'ను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. సమీక్షలో భాగంగా వీసీ ప్రొఫెసర్ రాజశేఖర్ మాట్లాడుతూ, శతాబ్ది ఉత్సవాల సందర్భంగా వర్సిటీలో చేపట్టబోయే అభివృద్ధి పనులు, ఏప్రిల్ 26న జరిగే శతాబ్ది స్థాపన దినోత్సవ అజెండాను మంత్రికి వివరించారు. అనుబంధ కళాశాలలను కూడా ఉత్సవాల్లో కలుపుకుని వెళతామని తెలిపారు. ఈ సమావేశంలో పాల్గొన్న స్థానిక ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ, యూనివర్సిటీతో అనుబంధం ఉన్న ప్రతి ఒక్కరినీ ఉత్సవాల్లో భాగం చేయాలని, దీనిద్వారా విశ్వవిద్యాలయానికి మంచి గుర్తింపు (విజిబిలిటీ) తీసుకురావాలని సూచించారు. శతాబ్ది ఉత్సవాల నిర్వహణ ఒక అద్భుత అవకాశమని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని అభిప్రాయపడ్డారు. ఈ సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, గంటా శ్రీనివాసరావు, పీజీవీఆర్ నాయుడు (గణబాబు), విష్ణుకుమార్ రాజు, వెలగపూడి రామకృష్ణబాబు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావుతో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## రైతులను నాశనం చేస్తున్న భారత్ , అమెరికా ఒప్పందం

మొదటి పేజి తరువాయి

ఆరోపించారు రాహుల్ గాంధీ. "పెద్ద ప్రశ్న తలెత్తుతుంది, ప్రధానమంత్రి నాలుగు నెలలుగా చేయని పని, ఆయన 15 నిమిషాల్లో ఎందుకు చేశారు?" అని ఆయన అన్నారు. వాణిజ్య ఒప్పందం అకస్మాత్తుగా ఎలా కుదిరిందని పశ్నించారు. ప్రతి సంవత్సరం భారత్ రూ. 9 లక్షల కోట్ల విలువైన యూఎస్ ఉత్పత్తులను కొనుగోలు చేస్తుందని మోదీ ట్రంప్‌నకు హామీ ఇచ్చారని ఆరోపించారు.

### ఆ పుస్తకం కోసం మాట్లాడాలని అనుకున్నా!

మాజీ ఆర్మీ చీఫ్ మనోజ్ నరవణే పుస్తకంపై మాట్లాడాలని అనుకున్నానని, కానీ ఇటీవల లోక్‌సభలో మాట్లాడటానికి తనకు అనుమతి ఇవ్వలేదని రాహుల్ గాంధీ తెలిపారు. సరిహద్దు సమీపంలో చైనా దళాల కదలికల సమయంలో రాజకీయ నాయకత్వం నుంచి స్పందన లేకపోవడాన్ని ఆ పుస్తకం వివరించిందని ఆయన పేర్కొన్నారు. అయితే ఇప్పటికే పలుమార్లు రాహుల్ గాంధీ, భారత్-అమెరికా ఒప్పందంపై మాట్లాడారు. ఇటీవల అమెరికాతో మధ్యంతర వాణిజ్య ఒప్పందంతో కేంద్ర ప్రభుత్వం రైతులకు ద్రోహం చేస్తోందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. దీర్ఘకాలంలో భారత వ్యవసాయ రంగంపై పట్టు సాధించడానికి మరొక దేశాన్ని అనుమతిస్తున్నారా అని ప్రశ్నించారు.

### ఆధారపడేలా చేయదా

డ్రైడ్ డిస్టిలరీస్ గ్రెయిన్స్‌ను దిగుమతి చేసుకోవడం అంటే జన్యుమార్పిడి చేసిన అమెరికా మొక్కజొన్నను పాడి ఉత్పత్తిదారులకు అందించడమేనని రాహుల్ ఎక్స్ లో రాసుకొచ్చారు. ఇది దేశ పాల ఉత్పత్తులను అమెరికా వ్యవసాయ పరిశ్రమపై ఆధారపడేలా చేయదా అని ప్రశ్నించారు. సోయా నూనె దిగుమతికి అనుమతిస్తే, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, రాజస్థాన్ సహా దేశవ్యాప్తంగా ఉన్న సోయా రైతులపై ప్రభావం ఉండదా అని నిలదీశారు. అదనపు ఉత్పత్తులు అంటే పప్పుధాన్యాలు సహా ఇతర పంటలను దిగుమతులకు భారత మార్కెట్‌ను తెరవాలనే ఒత్తిడిని సూచిస్తోందని రాహుల్ తెలిపారు. వాణిజ్యేతర అడ్డంకులను తొలగిస్తామంటే భవిష్యత్తులో జన్యుమార్పిడి పంటలపై భారత్ తన వైఖరిని మార్చుకుంటుందా అని ప్రశ్నించారు. ఈ అంశంపై ప్రభుత్వం రైతులకు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

### ఎగుమతిదారుల ప్రయోజనాలను కాపాడేలా!

ఆ తర్వాత అమెరికాతో మోదీ సర్కార్ చేసుకున్న ఒప్పందం కారణంగా దేశంలో వస్త్ర పరిశ్రమ, పత్తి రైతులు తీవ్రంగా నష్టపోతారని ఆరోపించారు. అమెరికా నుంచి పత్తిని దిగుమతి చేసుకుంటేనే, భారత వస్త్ర పరిశ్రమకు సుంకాల మినహాయింపు ఉంటుందనే విషయాన్ని ఎందుకు దాచారని ఆయన ప్రశ్నించారు. బంగ్లాదేశ్ కూడా భారత్ నుంచి పత్తి దిగుమతులను నిలిపివేసే



సంకేతాలు ఇస్తోందని, తద్వారా రైతులకు నష్టం జరుగుతుందని రాహుల్ గాంధీ ఆరోపించారు. దూరదృష్టి గల ప్రభుత్వం అయితే పత్తి రైతులు, టెక్స్‌టైల్ ఎగుమతిదారుల ప్రయోజనాలను కాపాడేలా ఒప్పందం చేసుకునేదని రాహుల్ అన్నారు. ఒకవేళ మోదీ ప్రభుత్వం జాతీయ ప్రయోజనాల కోసం ఆలోచించి ఉంటే పత్తి రైతులు, వస్త్ర ఎగుమతిదారుల శ్రేయస్సును రక్షించే విధంగా చర్చలు జరిపి ఉండేదని రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. మోదీ, ఆయన ప్రభుత్వం కలిసి రెండు రంగాలకు తీవ్ర నష్టం కలిగించే విధంగా ఒప్పందం కుదుర్చుకున్నారని ఆరోపించారు. ఈ ఒప్పందం కారణంగా పత్తి, వస్త్ర పరిశ్రమ రంగాలపై ఆధారపడి ఉన్న కోట్లాది మంది భారతీయుల కుటుంబాలను నిరుద్యోగం, ఆర్థిక సంక్షోభం అనే గొయ్యిలోకి నెట్టివేశారని రాహుల్ గాంధీ విమర్శించారు.

## విశ్వగురువుపై అమెరికా అంచనాకు వచ్చేసింది'- పాక్‌కు ట్రంప్ మద్దతుపై కాంగ్రెస్ విమర్శలు

మొదటి పేజి తరువాయి

ఢిల్లీ : అఫ్గానిస్థాన్‌తో యుద్ధం చేస్తున్న పాకిస్థాన్‌కు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పూర్తి మద్దతును ప్రకటించడం అనేది ప్రధాని మోదీ కౌగిలింతల దౌత్యానికి (హగ్లోమసీ) భారీ ఎదురుదెబ్బ అని కాంగ్రెస్ పార్టీ విమర్శించింది. స్వయం ప్రకటిత విశ్వగురువుపై అమెరికా పూర్తి అంచనాకు వచ్చిందంటూ పరోక్షంగా ప్రధాని మోదీపై విమర్శలు చేసింది. ఈమేరకు కాంగ్రెస్ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కమ్యూనికేషన్స్ ఇంఛార్జి జైరాం రమేశ్ ఎక్స్ వేదికగా ఒక ట్వీట్ చేశారు. ఒక వ్యక్తి (పాక్ ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్) చేసిన వ్యాఖ్యల వల్లే 2025 ఏప్రిల్ 22న జమ్మూకశ్మీరులోని పహల్గాంలో ఉగ్రదాడి జరిగిందని, ఇప్పుడు మళ్లీ అదే వ్యక్తిని ఆకాశానికి ఎత్తుతూ ప్రెసిడెంట్ ట్రంప్ వ్యాఖ్యలు చేయడం ఆందోళనకరమని ఆయన తెలిపారు. పాక్‌కు ఈవిధంగా అమెరికా మద్దతు లభిస్తుండటం అనేది, భారత సర్కారు హగ్లోమసీ విఫలమైందని నిరూపిస్తోందని జైరాం రమేశ్ ఎద్దేవా చేశారు.

### డొనాల్డ్ ట్రంప్ వరుస షాక్‌లు ఇస్తున్నారు

"భారతదేశ వ్యూహాత్మక దౌత్యానికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వరుస షాక్‌లు ఇస్తున్నారు. ఆయన పదేపదే పాకిస్థాన్‌కు మద్దతును ప్రకటిస్తున్నారు. పాక్‌కు వంతపాడుతూ వ్యాఖ్యలను చేస్తున్నారు. భారత్, పాకిస్థాన్‌లను ఒకేగాటన కట్టి మాట్లాడేందుకు ట్రంప్ యత్నిస్తున్నారు. భారత ప్రధాని మోదీ తన పరిచయాలు, ప్రభావంతో అవార్డులను పొందొచ్చు కానీ, వాస్తవమేంటో అందరికీ తెలిసిపోయింది. స్వయం ప్రకటిత విశ్వగురువుపై ప్రపంచం అసలు అంచనాకు వచ్చేసింది. ప్రత్యేకించి అమెరికా, ఈవిషయంలో ఫుల్ క్లారిటీకి వచ్చింది" అని జైరాం రమేశ్ కామెంట్స్ చేశారు.

### ఏకపక్ష ట్రేడ్ డీల్‌కు మోదీ సర్కారు తల ఊపింది

"అమెరికాతో భారత ప్రభుత్వం ఆర్థిక దౌత్యం కూడా తీవ్రంగా విఫలమైంది. అందుకే ఏకపక్షంగా అమెరికా డిసైడ్ చేసిన వాణిజ్య ఒప్పందానికి మోదీ సర్కారు తల ఊపాల్సి వచ్చింది. ఇందులో అమెరికాకు భారత్ పెద్దపెద్ద హామీలను ఇచ్చింది. ప్రత్యేకించి అమెరికా వ్యవసాయ ఉత్పత్తులను దిగుమతి చేసుకుంటామని మోదీ సర్కారు మాట ఇచ్చింది. ఇక ఇదే సమయంలో భారత్ నుంచి వస్తు,సేవలను దిగుమతి చేసుకునే విషయంలో అమెరికా అరకొర హామీలనే ఇచ్చింది. ఈ ట్రేడ్ డీల్ ఖరారైన మరుసటి రోజే, భారత్ నుంచి అమెరికాకు వెళ్లిన సోలార్ మాడ్యూల్స్‌పై అమెరికా ఏకంగా 125.87 శాతం దిగుమతి సుంకాన్ని విధించింది" అని జైరాం రమేశ్ ఆరోపించారు.

### పాక్‌పై ట్రంప్ తాజా ప్రశంసలివీ

గురువారం (ఫిబ్రవరి 26) రాత్రి నుంచి పాకిస్థాన్, అఫ్గానిస్థాన్ మధ్య జరుగుతున్న భీకర సైనిక ఘర్షణపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పందించారు. ఈ యుద్ధాన్ని ఆపేందుకు మీరు ప్రయత్నిస్తారా అని విలేకరులు అడిగిన ప్రశ్నకు బదులిస్తూ, ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. తప్పకుండా ఈ యుద్ధాన్ని ఆపేందుకు ట్రై చేస్తానన్నారు. కానీ తాను పాకిస్థాన్ పక్షాన నిలుస్తానని స్పష్టం చేశారు. పాకిస్థాన్‌కు గొప్ప ప్రధానమంత్రి, గొప్ప ఆర్మీ చీఫ్ ఉన్నారని ట్రంప్ కొనియాడారు. వాళ్లిద్దరినీ తాను నిజంగా గౌరవిస్తానని తేల్చి చెప్పారు. పాక్‌లో షెహబాజ్ షరీఫ్, ఆసిమ్ మునీర్ చాలా బాగా పనిచేస్తున్నారని కితాబిచ్చారు.

### పాకిస్థాన్ vs అఫ్గానిస్థాన్ వార్

ఫిబ్రవరి 22న అఫ్గానిస్థాన్‌లోని నాన్ గర్హర్, పక్‌టీకా ప్రావిన్స్‌లపై పాక్ వైమానిక దాడులు చేసింది. దీంతో ప్రతీకారం తీర్చుకుంటామని అప్పట్లో అఫ్గానిస్థాన్ సైన్యం ప్రకటించింది. చెప్పినట్టుగానే, ఫిబ్రవరి 26న (గురువారం) రాత్రి తాలిబన్ దళాలు ప్రతీకారం తీర్చుకున్నాయి. 19 పాక్ ఆర్మీ పోస్టులను దహనం చేసి, 55 మంది పాక్ సైనికులను హతమార్చామని తాలిబన్లు ప్రకటించారు. ఈ ఎటాక్‌కు తక్షణ స్పందనగా గురువారం అర్ధరాత్రి అఫ్గానిస్థాన్‌లోని కాబూల్, కాందహార్, పక్టియాలలోని తాలిబన్ సైనిక స్థావరాలపై బాంబు దాడులు చేసింది. ఈ దాడుల్లో 133 మంది తాలిబన్లు హతం కాగా, 200 మందికి గాయాలయ్యాయని పాక్ వెల్లడించింది.

## ఇరాన్ పై దాడులు- పశ్చిమాసియా గగనతలం మూసివేత- అన్ని విమాన సర్వీసులు రద్దు

ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దాడుల నేపథ్యంలో పశ్చిమాసియా రణరంగాన్ని తలపిస్తోంది. భద్రతా కారణాల దృష్ట్యా పలు దేశాలు తమ గగనతలాన్ని మూసేశాయి. ఫలితంగా మిడిల్ ఈస్ట్ గుండా వెళ్లే అన్ని విమాన సర్వీసులు రద్దయ్యాయి. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దాడుల నేపథ్యంలో పశ్చిమాసియా అట్టుడుకుతోంది. ఇరాన్ పై అమెరికా, ఇజ్రాయెల్ దళాలు మిస్సైళ్లతో విరుచుకపడుతున్నాయి. మరోవైపు అమెరికా సైనిక స్థావరాలపై ఇరాన్ రాకెట్ల వర్షం కురిస్తోంది. ఈ పరిణామాల నేపథ్యంలో ప్రాంతంలో విమాన సర్వీసులు పూర్తిగా స్తంభించిపోయాయి. భద్రతా కారణాల దృష్ట్యా భారత్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, దుబాయ్, టర్కీ సహా పలు దేశాలు తమ గగనతలాన్ని మూసివేస్తున్నట్లు ప్రకటించాయి. దీంతో ప్రపంచంలోనే అత్యంత రద్దీగా ఉండే దుబాయ్, దోహా వంటి అంతర్జాతీయ విమాన విమానాశ్రయాల్లోనే భారీ సంఖ్యలో ప్రయాణికులు చిక్కుకుపోయారు.

భారతీయ విమానయాన సంస్థలపై ప్రభావం

ఇరాన్-అమెరికా, ఇజ్రాయెల్ పరస్పర దాడుల ప్రభావం భారతీయ విమానయాన సంస్థలపై పడింది. మధ్యప్రాచ్య దేశాలకు నడిచే అన్ని సర్వీసులను శనివారం అర్ధరాత్రి వరకు తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ఇండిగో ప్రకటించింది. "ఇరాన్, మధ్యప్రాచ్య గగనతలంలో విధిస్తున్న ఆంక్షల నేపథ్యంలో అటువేపు వెళ్లే, వచ్చే అన్ని విమానాలను రద్దు చేస్తున్నాం" అని ఇండిగో ట్వీట్ చేసింది. దీంతో దుబాయ్, జెడ్డా, దోహా, అబుదాబి, దమ్మామ్, బహ్రెయిన్, షార్జా, కువైట్, రస్ అల్-ఖైమా నగరాలకు సర్వీసులు నిలిచిపోయాయి. ప్రయాణికులు, సిబ్బంది భద్రతకే తాము అత్యంత ప్రాధాన్యత ఇస్తామని, పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని ఇండిగో స్పష్టం చేసింది. మరోవైపు, గల్ఫ్ ప్రాంతంలో నెలకొన్న ఉద్రిక్తతల దృష్ట్యా ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ పశ్చిమాసియా వెళ్లే అన్ని అంతర్జాతీయ విమానాలను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. అనంతరం ఎయిర్ ఇండియా కూడా ఈ విషయాన్ని స్పష్టం చేసింది. మధ్యప్రాచ్యంలోని అన్ని గమ్యస్థానాలకు విమాన సర్వీసులను నిలిపివేస్తున్నట్లు వెల్లడించింది. ప్రయాణికులకు అవసరమైన అన్ని సహాయ సహకారాలను అందిస్తామని సంస్థ హామీ ఇచ్చింది. దిల్లీ నుంచి ఇజ్రాయెల్ (టెల్ అవీవ్) వెళ్లాల్సిన ఎయిర్ ఇండియా విమానం గాలిలో ఉండగానే భద్రతా కారణాల దృష్ట్యా వెనక్కి మళ్లింది. దీన్ని ముంబైలో సురక్షితంగా పైలెట్లు ల్యాడ్ చేశారు. బోయింగ్ 777 విమానం గాలిలో సుమారు ఐదు గంటల పాటు ప్రయాణించింది. సౌదీ అరేబియా గగనతలంలో ఉన్న సమయంలో, ఇజ్రాయెల్ ఎయిర్‌స్పేస్ మూతపడటంతో పైలట్లు విమానాన్ని వెనక్కి మళ్లించారు. దీనివల్ల ప్రయాణికులకు కలిగిన అసౌకర్యానికి ఎయిర్ ఇండియా విచారం వ్యక్తం చేసింది. గగనతలాల మూసివేత కారణంగా అనేక అంతర్జాతీయ విమానయాన సంస్థలు, విమానాలపై తీవ్ర ప్రభావం పడుతోందని ఫ్లైట్ ట్రాకింగ్ వెబ్‌సైట్ కూడా వెల్లడించింది.

విదేశీ సర్వీసులు

ఖతార్ ఎయిర్‌వేస్ తమ గగనతలం మూసివేత వల్ల దోహాకు రావాల్సిన, అక్కడి నుంచి వెళ్లాల్సిన అన్ని విమానాలను తాత్కాలికంగా రద్దు చేసింది. దుబాయ్ కేంద్రంగా నడిచే పలు సర్వీసులు నిలిచిపోయాయని, ప్రయాణికులు తమ విమాన స్థితిని ఆన్‌లైన్‌లో తనిఖీ చేసుకోవాలని ఎమిరేట్స్ సూచించింది. లెబనాన్, సిరియా, ఇరాక్, ఇరాన్,జోర్డాన్ దేశాలకు సోమవారం వరకు విమానాలను నిలిపివేసినట్లు టర్కిష్ ఎయిర్‌లైన్స్ ప్రకటించింది. లండన్ నుంచి దుబాయ్‌కి వెళ్లే విమానాలను వర్జిన్ అట్లాంటిక్ ఎయిర్‌లైన్స్ రద్దు చేసింది. ఇరాక్ మీదుగా వెళ్లే మార్గాన్ని మళ్లించడం వల్ల భారత్, మాల్దీవులు, రియాద్, దుబాయ్ వెళ్లే విమాన ప్రయాణ సమయం మరింత పెరుగుతుందని తెలిపింది. అత్యవసర పరిస్థితుల్లో దారి మళ్లించడానికి వీలుగా విమానాల్లో అదనపు ఇంధనాన్ని నింపుతున్నట్లు పేర్కొంది.డచ్ విమానయాన సంస్థ కేఎల్ఎం ఆదివారం నుంచి టెల్ అవీవ్‌కు విమానాలను నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది.

# సంపాదకీయం

## భారత్ పరిణత ప్రజాస్వామ్యమేనా?

న్యూఢిల్లీలో ఇండియా ఏఐ ఇంపాక్ట్ సదస్సులో, పెచ్చరిల్లుతున్న నిరుద్యోగం, అమెరికాభారత్ వాణిజ్య ఒప్పందాన్ని నిరసిస్తూ యువజన కాంగ్రెస్ కార్యకర్తల అర్ధనగ్న ప్రదర్శనకు తీవ్ర ప్రతిస్పందనలు వెల్లువెత్తాయి. ఆగ్రహం, పరిహాసం, నీతి పాఠాలు... ఆ ఘటన చోటుచేసుకున్న కొద్ది నిమిషాలలోనే సామాజిక మధ్యమాలలో ఈ అసంకల్పిత ప్రతిస్పందనలు వ్యక్తమయ్యాయి. ప్రైమ్ టైమ్ టీవీ షోలలో ఆ నిరసన ప్రదర్శన ఉదంతానికి సంబంధించిన వీడియోను మళ్లీ మళ్లీ చూపారు. యాంకర్ల వ్యాఖ్యలు: కాంగ్రెస్ కార్యకర్తల అర్ధనగ్న ప్రదర్శన 'దారితప్పిన నిరసన', 'నివ్వెరపరిచింది', 'కలవరపరుస్తోంది' ఇంకా, 'దేశ ప్రతిష్ఠను మంటగలిపింది' అని కూడా గట్టిగా అన్నారు.నిజానిజాలను తరచి చూద్దాం. యువజన కాంగ్రెస్ కార్యకర్తల నిరసనపై విమర్శనాత్మక ప్రతిస్పందనలు పూర్తిగా న్యాయబద్ధమైనవే. ఒక అంతర్జాతీయ సదస్సు సందర్భంగా అటువంటి నిరసన ప్రదర్శన ఒక పేలవమైన రాజకీయ వ్యక్తీకరణ అని నేను భావిస్తున్నాను. ఇంకా సంతకాలు చేయని భారత్అమెరికా వాణిజ్య ఒప్పందంతో ఆ అంతర్జాతీయ ఏఐ సదస్సుకు ఎలాంటి సంబంధం లేదు. అయినా కాంగ్రెస్ కారకర్తలు తమ నిరసనకు అంతర్జాతీయ సదస్సు జరుగుతున్న ప్రదేశాన్ని ఎంపిక చేసుకున్నారు. మీరు ఆ నిర్ణయంతో ఏకీభవించవచ్చు లేదా ఏకీభవించకపోవచ్చు. ప్రజాస్వామిక చర్చ కచ్చితంగా అటువంటి అభిప్రాయభేదాలపైనే ఆరంభమౌతుంది. ప్రతి నిరసన వివేకవంతమయింది కాదు. ప్రతి నినాదం ప్రతి ఒక్కరినీ ఒప్పించలేదు. యువజన కాంగ్రెస్ కార్యకర్తల అర్ధనగ్న ప్రదర్శన వలే ప్రతి నిరసన కూడా మీడియా దృష్టిని తమపై కేంద్రీకరింప చేసుకునే లక్ష్యంతోనే నిర్వహించడం కద్దు. మీరు ఒక నిరసన ప్రదర్శనను ఏవగించుకోవచ్చు. అయితే శాంతియుతంగా నిరసన తెలిపే హక్కుకు చట్టబద్ధత లేకుండా చేయడం అంగీకరించాల్సిన విషయం కాదు. శాంతియుతంగా నిరసన తెలిపిన యువజన కాంగ్రెస్ కార్యకర్తలను ఢిల్లీ పోలీసులు అరెస్ట్ చేశారు. ఆ కాంగ్రెస్ విభాగం అధ్యక్షుడిని బెయిల్ మంజూరుకు ఆమోదయోగ్యంకాని న్యాయ నిబంధనల కింద అరెస్ట్ చేశారు. 'జాతికి వ్యతిరేకంగా 'కుట్ర' చేశారని కూడా యువజన కాంగ్రెస్ కార్యకర్తలపై అభియోగాలు మోపారు. ఇది నిరసన ప్రదర్శనలపై తీవ్ర ప్రభావాన్ని చూపనున్నది. ఆసక్తికరమైన విషయమేమిటంటే ఢిల్లీ పోలీసులు గుజరాత్ పోలీసులు పరిపూర్ణత నిచ్చిన నిబంధనలనే అనుసరించి యూత్ కాంగ్రెస్ కార్యకర్తలను అరెస్ట్ చేశారు. ఎటువంటి బహిరంగ సమావేశాలనైనా అడ్డుకునేందుకై గుజరాత్ పోలీసులు తరచూ నిరంతరాయంగా సెక్షన్ 144ను అమలుపరిచేవారు. పోలీసులు ఆ సెక్షన్‌ను అలా అమలుపరచడం న్యాయ సమ్మతం కాదని, పౌరుల హక్కులపై రాజ్యాంగ విరుద్ధంగా ఆంక్షలు విధించడమేనని గుజరాత్ హైకోర్టు గత ఏడాది ఒక తీర్పులో స్పష్టం చేసింది. ఒక విధంగా మోదీషాల ఆధ్వర్యంలో రూపుదిద్దుకున్న గుజరాత్ రాజ్యాధికార నమూనా జాతీయ స్థాయికి చేరుకున్నది. ఇప్పుడు దీనిని వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు (బీజేపీయేతర పార్టీల ప్రభుత్వాలు కూడా) అమలుపరుస్తున్నాయి. తమ రాజకీయ ప్రత్యర్థులకు ఇబ్బందులు సృష్టించేందుకు స్థానిక పోలీసులను నిస్సిగ్గుగా ఉపయోగించుకోవడం సాధారణమైపోయింది. భిన్నాభిప్రాయాల వ్యక్తీకరణను సహించలేకనే ఇటువంటి అప్రజాస్వామిక చర్యలకు పాల్పడుతున్నారు. ఇది ప్రమాదకరమైన ధోరణి. ప్రజా జీవితంలో ప్రజాస్వామిక అవకాశాలు సన్నగిల్లిపోతున్నాయి. పార్లమెంటులో ప్రతిపక్ష నాయకుడు వివాదాస్పద అంశాలపై మాట్లాడకుండా పాలకపక్ష సభ్యులు అడ్డుకుంటున్నారు. ప్రజాస్వామిక చర్చకు ఇదెలా దోహదం చేస్తుంది? పార్లమెంటులో చట్టాలపై ఎలాంటి చర్చ లేకుండానే వాటిని ఆమోదింప జేసుకోవడంలో పాలకపక్షం ఆరితేరిపోయింది. అధికారంలో ఉన్నవారికి ఇబ్బంది కలిగించే ప్రశ్నలు సంధించేందుకు ప్రధాన స్రవంతి మీడియా సంకోచిస్తోంది. విశ్వవిద్యాలయాలలో ప్రత్యామ్నాయ అభిప్రాయాలను వ్యక్తం చేసేవారిని 'జాతివ్యతిరేకులు'గా ముద్ర వేస్తున్నారు. పౌర సమాజం కూడా అధికారంలో ఉన్నవారిని సవాల్ చేసేందుకు సాహసించలేకపోతోంది. తాము నిర్వహిస్తోన్న ఓ కార్యక్రమంలో ప్రసంగించేందుకు నటుడు నసీరుద్దీన్ షాను ముంబై విశ్వవిద్యాలయం ఆహ్వానించింది. తీరా ప్రసంగించాల్సిన రోజు సమీపిస్తుండగా ఎటువంటి వివరణ ఇవ్వకుండానే ఆ ఆహ్వానాన్ని రద్దు చేసింది. మోదీ సర్కార్‌ను విమర్శిస్తుండడమే నసీరుద్దీన్ షా చేసిన అపరాధం! యూట్యూబర్లు, స్టాండప్ కమెడియన్లు తదితరులు కూడా అధికారంలో ఉన్నవారికి భయపడుతున్నారు. సర్వత్రా భయం రాజ్యమేలుతోంది. ఇబ్బందికరమైన వాస్తవాలనే కాకుండా తప్పుడు విషయాలనూ అతిగా మాట్లాడేందుకు అనుమతించి రక్షణ కల్పించే వ్యవస్థే ప్రజాస్వామ్యం. మనం ఆమోదించే నిరసన ప్రదర్శనల పట్ల ఎలా వ్యవహరిస్తున్నామన్నది కాకుండా మనకు ఆగ్రహం కలిగించే అసంబద్ధ నిరసనలకు ఎలా ప్రతిస్పందిస్తున్నామన్నదే ప్రజాస్వామిక పరిణతికి గీటురాయి. అయితే పాలకుల ప్రవృత్తి ఇందుకు విరుద్ధంగా ఉంటున్నది. బెయిల్‌కు అవకాశంలేని ఆరోపణలనేవి తీవ్ర నేరాలకు పాల్పడినవారిపై మోపడానికి మాత్రమే ఉద్దేశించినవి. అంతేగానీ శాంతియుతంగా భిన్నాభిప్రాయాలను వ్యక్తం చేస్తున్న వారిని కట్టడి చేసేందుకు వారిపై అటువంటి ఆరోపణలు మోపకూడదు. అటువంటి చర్య అరెస్టయినవారినే కాకుండా ఇంకా చాలా మందిని ప్రభావితం చేస్తుంది. అందులోని సంకేతం సూక్ష్మమైనదేకానీ శక్తిమంతమైనది: నిరసన తెలిపితే భారీ మూల్యం చెల్లించడం అనివార్యమవుతుంది. భిన్నాభిప్రాయాల వ్యక్తీకరణను అరాచకంగా భావించకూడదు. అలా భావించడం ప్రజాస్వామ్యానికి మేలు చేయదు. ప్రజాస్వామ్య వ్యవస్థలు ప్రజా సార్వభౌమాధికారం, జవాబుదారీతనం ప్రాతిపదికన నిర్మితమవుతాయి.

# సరైన కార్యాచరణతోనే శాస్త్రసాంకేతిక ప్రగతి!



సర్ సీవీ రామన్ 1928లో రామన్ ఎఫెక్ట్‌ను కనుగొని భారతదేశానికి భౌతిక శాస్త్రంలో తొలి నోబెల్ బహుమతి సాధించారు. నాటి నుంచి ఇండియా ఏటా ఫిబ్రవరి 28న జాతీయ సైన్స్ దినోత్సవాన్ని నిర్వహిస్తోంది. నేడు శాస్త్ర సాంకేతిక ఆవిష్కరణల్లో మేటిగా నిలుస్తోంది. పటిష్ఠ కార్యాచరణకు నిధులూ, నిపుణ మానవ వనరులూ తోడైతే వైజ్ఞానిక రంగంలో మన దేశం మరింతగా దూసుకుపోగలుగుతుంది. విజ్ఞానశాస్త్రం స్థిరంగా, సూటిగా పురోగమించే స్థితి నుంచి అనూహ్యంగా సామర్థ్యాలను పెంచుకుంటూ, కొత్త ఆవిష్కరణలను వేగంగా అమలులోకి తెచ్చే దశకు చేరుకున్న తరుణంలో ఈ ఏడాది సైన్స్ దినోత్సవాన్ని జరుపుకొంటున్నాం. ఒకప్పుడు ప్రయోగశాలలకే పరిమితమైన సాంకేతికతలు నేడు సమాజాలను, ఆర్థిక వ్యవస్థలను, ప్రాదేశిక రాజకీయాలను మార్చేస్తున్నాయి. శాస్త్ర సాంకేతిక రంగాల్లో పరిశోధన-అభివృద్ధికి పెట్టుబడులు పెంచుతూ, వ్యూహపరంగా స్వావలంబన సాధించేందుకు భారత్ కృషి చేస్తోంది. కానీ, రాబోయే దశాబ్దంలో సమూల సంస్కరణలు చేపడితేనే ఆ కృషి ఆశించిన ఫలితాలను ఇస్తుంది.

### అద్భుత ఆవిష్కరణలు

నేడు సైన్స్ నెమ్మదిగా వృద్ధి చెందే స్థితి నుంచి అమాంతం ఉన్నత శిఖరానికి లంఘించే స్థాయికి చేరుకుంది. 1969లో అపోలో 11 వ్యోమనౌకను చంద్రుడిపై దింపడానికి తోడ్పడిన కంప్యూటర్లకన్నా నేడు సామాన్యులు సైతం వాడుతున్న స్మార్ట్‌ఫోనే ఎక్కువ ప్రాసెసింగ్ శక్తి కలిగి ఉండటం దీనికి నిదర్శనం. 2023-25 నాటికి కృత్రిమ మేధ(ఏఐ) కోడింగ్, కళాసృజన, ప్రాథమిక వైజ్ఞానిక ఆవిష్కరణలు చేయగల స్థితికి ఎదిగింది. బయోటెక్నాలజీ రంగంలోనూ అద్భుత ఆవిష్కరణలు జరుగుతున్నాయి. మానవ జన్యు పటాన్ని సీక్వెన్సింగ్ చేసే ఖర్చు బాగా తగ్గడంతో ప్రెసిషన్ (సునిశిత) వైద్యం, క్రిస్పర్ జన్యు ఎడిటింగ్, ఎంఆర్ఎన్ఏ వేదికలు విస్తృతంగా వినియోగంలోకి వచ్చాయి. అవి కొవిడ్ కాలంలో కొత్త వ్యాక్సిన్లను రికార్డు సమయంలో అందించాయి. కొత్త మందుల ఆవిష్కరణ, మెటీరియల్ సైన్స్, క్రిప్టోగ్రఫీలో క్వాంటం కంప్యూటర్లు సంచలనాలకు బాటలు వేస్తున్నాయి. పునర్వినియోగార్హ రాకెట్లు అంతరిక్ష ప్రయోగాల ఖర్చును గణనీయంగా తగ్గించాయి. ఫలితంగా అంతర్జాతీయ బ్రాడ్‌బ్యాండ్ సేవలు, రియల్ టైమ్ భూ పరిశీలనకు ఉపకరించే ఉపగ్రహాల సముదాయాన్ని తక్కువ ఖర్చులో రోదసిలోకి ప్రయోగించడం సులువైంది. ఇప్పుడు కనిపిస్తున్న శాస్త్ర సాంకేతిక విజ్ఞానాల చక్రీయ వృద్ధికి మూడు కారణాలున్నాయి. అవి- భారీగా ఉత్పన్నమవుతున్న డేటా, చవగ్గా లభ్యమవుతున్న కంప్యూటింగ్ శక్తి, అల్గారిథమ్‌లలో నవీకరణలు. ఈ మూడింటికీ పరస్పర సంబంధం ఉండటంవల్ల వేగవంతమైన టూల్స్, సరికొత్త అప్లికేషన్ డొమైన్‌లు అందుబాటులోకి వచ్చాయి. రక్షణ రంగం ఏఐ సాయంతో గుంపుగా దాడిచేసే డ్రోన్ల దండు(స్వార్మ్) వైపు మారుతోంది. హైపర్‌సానిక్ ఆయుధాలకూ, ఎలక్ట్రానిక్ సమరానికీ మళ్లుతోంది. వ్యక్తికి తగ్గ చికిత్స చేసే రోజులు వస్తున్నాయి. వాతావరణ మాడలింగ్ ఏఐ, రియల్ టైమ్ ఉపగ్రహ డేటాతో ప్రకృతి వైపరీత్యాలను ముందే పసిగట్టి హెచ్చరించగలుగుతున్నారు. కర్బన ఉద్గారాలను పరిహరించే పునరుత్పాదక ఇంధన వనరుల వినియోగం పెరుగుతోంది. నేటి సంచలన ఆవిష్కరణలు వేగంగా రేపటి రోజువారీ వాడుక సాధనాలుగా మారుతున్నాయి. రక్షణ, ఏరోస్పేస్ రంగాల్లో ఈ తరహా అనూహ్య వృద్ధి సంభవిస్తోంది. హైపర్ సానిక్ గ్లైడ్ వాహనాలు, లేజర్ ఆయుధాలు, స్వయంచాలిత ఆయుధాలు, క్వాంటం కమ్యూనికేషన్లు శత్రువును భారత్ వైపు తేరిపార చూడలేని స్థితిని సృష్టిస్తున్నాయి. రక్షణ రంగానికి, పరిశోధన-అభివృద్ధికి ఎక్కువ నిధులు ప్రత్యేకించడం వల్లే ఈ విజయాలు సాధ్యపడుతున్నాయి. పౌర-సైనిక ప్రయోజనాలకు ఉపయోగపడే సాంకేతికతల వృద్ధికి భారత్ ప్రాధాన్యమిస్తోంది. ఈసారి బడ్జెట్‌లో రక్షణ శాఖకు కేటాయింపులు భారీగా దక్కాయి. వీటిలో రక్షణ పరిశోధన-అభివృద్ధి సంస్థ(డీఆర్‌డీవో) వాటా కూడా పెరిగింది. నేటి రక్షణ ఆర్అండ్‌డీ బడ్జెట్‌లో 25శాతాన్ని పరిశ్రమలు, స్టార్టప్‌లు, విద్యాసంస్థలకు కేటాయించారు. నవ కల్పనలు ప్రభుత్వ ప్రయోగశాలలకే పరిమితం కానక్కర్లేదనీ, వాటి పరిధిని విస్తరించాలనీ ప్రభుత్వం భావించడం వల్లే కేటాయింపులు పెంచుతున్నారు. ప్రభుత్వ పెట్టుబడులు సత్ఫలితాలను ఇస్తున్నాయి. ఆయుధ ఎగుమతులు పెరుగుతున్నాయి. రక్షణ రంగంలో ప్రైవేటు భాగస్వామ్యం క్రమంగా విస్తరిస్తోంది.

### కేటాయింపులు పెరగాలి

భారత్ తన పరిశోధన అభివృద్ధి, శాస్త్రసాంకేతిక రంగాలను వచ్చే దశాబ్దంలో మరింత ఉద్ధృతంగా అభివృద్ధి చేయాలి. పరిశోధన, అభివృద్ధిపై చేసే వ్యయాన్ని 2035 కల్లా జీడీపీలో రెండు శాతానికి పెంచాలి. అందులో 60శాతం వాటాను ప్రైవేటు రంగానికి కేటాయించాలి. సెమీకండక్టర్లు, క్వాంటం కంప్యూటర్లు, సింథటిక్ బయాలజీలలో ఆర్అండ్‌డీకి పన్ను ప్రోత్సాహకాలు పెంచాలి. ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థల ఆధ్వర్యంలో 20-30 ప్రాంతీయ నవీకరణ క్లస్టర్లను ఏర్పరచి, వాటిని రక్షణ ప్రయోగశాలలతో అనుసంధానించాలి. ఆవిష్కరణలు ఎలాంటి యాజమాన్య వివాదాలు లేకుండా ప్రయోగశాల నుంచి మార్కెట్‌కు వేగంగా చేరేలా మేధాహక్కుల చట్టాన్ని సరళీకరించాలి. మరోవైపు, నిపుణ మానవ వనరుల అభివృద్ధికి నిధులు పెంచాలి. మహిళలకు ప్రత్యేక ఫెలోషిప్‌లు, మెంటార్‌షిప్ ప్రోగ్రామ్‌లు, ల్యాబ్‌లలో మహిళా అనుకూల మౌలిక సదుపాయాలను కల్పించడం అత్యవసరం. స్టెమ్ విద్యను విస్తరించి అత్యాధునిక శాస్త్రసాంకేతిక రంగాల్లో ఏటా పీహెచ్‌డీల సంఖ్యను పెంచాలి. విదేశాల్లోని భారత సంతతి పరిశోధకులు, విదేశీ పరిశోధకులను ఆకర్షించాలి. యువతకు అధునాతన టెక్నాలజీలలో శిక్షణ ఇవ్వాలి. క్వాంటం కంప్యూటింగ్, స్వదేశీ సెమీకండక్టర్ తయారీ, గ్రీన్ హైడ్రోజన్, మలితరం ఉపగ్రహాలు, రాకెట్లు, హైపర్ సానిక్‌లపై జాతీయ మిషన్‌లను ప్రారంభించాలి. అంతర్జాతీయ భాగస్వామ్యాలను ఉపయోగించుకోవాలి. బలమైన మౌలిక సదుపాయాలు, డేటా పర్యావరణ వ్యవస్థలను నిర్మించాలి. ప్రతి స్థాయిలో శాస్త్రీయ దృక్పథాన్నీ నైతికతనూ పాదుపరచాలి. సైన్స్, సాంకేతికతలపై తప్పుడు సమాచారాన్ని తిప్పికొట్టాలి. రానున్న దశాబ్దంలో శాస్త్రసాంకేతిక ప్రగతి పరుగులు పెట్టనుంది. దాన్ని మనం అందుకుంటామా, వెనకబడిపోతామా అన్నది మనమే తేల్చుకోవాలి.

# వీరోచిత త్యాగానికి ప్రతిబింబం.. ఇక్కీస్




ఏ కాలంలో అయినా సైనిక జీవితం సాహ సోపేతమైంది. ప్రాణాలను తృణప్రాయంగా భావించి యుద్ధ రంగంలో దుమికే యువ సైనికులపై ఎవరు సినిమాలు తీసినా అది వీరోచితంగానే కాదు. రోమాంచితంగా కూడా ఉంటుంది. ఇంకా శిక్షణ కూడా పూర్తిచేయని 21 ఏళ్ల నవ యువకుడు 1971 నాటి భారత్, పాక్ యుద్ధంలో తప్పని సరై భాగం కావలసి వస్తే.. దేశం కోసం సర్వస్వం అర్పించాల్సిన అవసరం వచ్చినప్పుడు చిరునవ్వుతో ఆత్మత్యాగానికి పాల్పడే క్షణాలు ఆ సైనికుడి జీవితంలో చిరు నవ్వును, గర్వాన్ని మాత్రమే ప్రదర్శించి ముగిసిపోతే.. ఆ అనుభూతిని వెండితెరపై తాజాగా చూపించిన చిత్రం 'ఇక్కిస్'.

### కథా పరిచయం..

భారత సైన్యంలో బ్రిగేడియర్ ఎం.ఎల్ ఖేత్రపాల్ (ధర్మేంద్ర) రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి. పాకిస్తాన్‌లో ఉన్న మిత్రులతో జ్ఞాపకాలు పంచుకోవడానికి లాహోర్ వెళతాడు. వివిధ ప్రాంతాలను సందర్శిస్తూ యుద్ధంలో తన కుమారుడు అరుణ్ ఖేత్రపాల్ నేలకొరిగిన ప్రదే శానికి వెళతాడు. 1971లో భారత్, పాక్ యుద్ధంలో 21 సంవత్సరాల సెకండ్ లెఫ్టినెంట్ అరుణ్ (అగస్త్య నంద) చేసిన సాహసం ఏంటి? యుద్ధ భూమిలో అడుగు పెట్టాక తనకు ఎదురైన సవాళ్లు ఏంటి? అనేదే ఈ చిత్ర కథ.

### దేశభక్తి అంటే పెద్ద డైలాగులు కాదు..

ఈ సినిమా దేశభక్తి పేరుతో భయంకరమైన శబ్దాలు చేస్తూ, చేంతాడంత పొడవు డైలాగులు దంచుతూ యువతలో ఆవేశాన్ని రంగరించి పోసే సినిమా కాదు. దర్శకుడు శ్రీరామ్ రాఘవన్ వాస్తవ సంఘటనలకే ప్రాముఖ్యమిచ్చి భావోద్వేగాలతో కూడిన డ్రామాను ఉత్కంఠతో చూపే ప్రయత్నం చేశారు.. 21వ జన్మదినం జరుపుకుంటున్న రోజే యుద్ధానికి వెళ్లమని అరుణ్‌ను అధికారులు ఆదేశిస్తే, భారత్‌లోకి చొరబడుతున్న యుద్ధ ట్యాంకులను అడ్డుకునేందుకు ఆర్మీ అధికారులు చేసే సాహసాలు సినిమాను మరో స్థాయికి తీసుకెళ తాయి. తోటి సైనికుల మరణిస్తే భావోద్వేగాలకు లొంగిపోక పోవడం, యుద్ధంలో పట్టుబడిన పాక్ సైనికులను బందీలు చేయ్యాలి తప్ప చంపగకూడదంటూ భారత ఆర్మీ చూపే నిబద్ధత వీక్షకులను అలరింపజేస్తుంది.

### భోంచేసి తర్వాత వెళ్లు బిడ్డా..

ఈ చిత్రం దేశభక్తి వీరత్వానికి మించి యుద్ధం కలిగించే శాశ్వత వ్యక్తిగత కుటుంబ గాయాన్ని సున్నితంగా అన్వేషిస్తుంది. ఛాతీని విరిచి కొట్టుకునే దేశభక్తి, హైపర్-యాక్షన్ డ్రామా యుగంలో, యూనిఫాం నుండి సైనికుల జీవితాల్లోకి మనల్ని తీసుకెళ్తున్న విధానం అద్భుతం. ముఖ్యంగా అకాడమీలో వారి రోజులు, ఒకరితో ఒకరు పంచుకునే స్నేహం, వారి ఆశయం, వారి మానవీయ స్పర్శను చూపడమే కాదు.. ఒక సైనికుడి కుటుంబ హృదయం ఉక్కుతో ఎలా తయారైందో కూడా ఇది వర్ణిస్తుంది. అరుణ్ తాను యుద్ధానికి వెళ్తున్నానని తన తల్లికి చెప్పడానికి ఇంటికి వచ్చినప్పుడు, ఆమె చెప్పేదంతా 'ఖానా ఖా కే జానా' అని మాత్రమే.

### ఏ దేశం వారైనా ప్రజల బాధలు ఒక్కటే!

ఈ చిత్రం, ఎలాంటి సంకోచం లేకుండా, యుద్ధం ఎప్పటికీ మంచి చేయదని చెబుతుంది. బహుశా బజరంగీ భాయిజాన్ తర్వాత, మంచి ఉద్దేశాలతో కూడిన పాకిస్తానీ పాత్రలను తెరపై చూడగలుగుతాం. పాకిస్తాన్ మాజీ అధికారి భారతీయ బ్రిగేడియర్‌ని తమ దేశంలోకి ఆహ్వానిస్తే యుద్ధంలో కాలు పోగొట్టుకున్న అతడి కుమారుడు ఇండియా వాడిని ఎందుకు రప్పించావు అని నిలదీస్తాడు. అప్పుడు దర్మేంద్ర 'నువ్వు యుద్ధంలో కాలు మాత్రమే పోగొట్టుకున్నావు. నేను కొడుకునే పోగొట్టుకున్నాను' అంటాడు. పాక్ అధికారి కుమారుడు అప్పుడు కానీ మారడు. యుద్ధం ఇరుదేశాల పాలకులకు మాత్రమే ప్రయోజనం కలిగిస్తుంది కానీ ఆ దేశాల ప్రజలే బాధితులవుతారని ఆ దృశ్యం స్పష్టంగా చూపిస్తుంది. ప్రస్తుత రాజకీయ వాతావరణంలో దర్శకుడి దృక్పథాన్ని నిశ్శబ్దంగా ఆరాధించేలా చేస్తుందీ చిత్రం. ఆ దృశ్యం ధర్మేంద్ర స్వరంలో బిగ్గరగా ప్రతిధ్వనిస్తుంది.. యుద్ధం వల్ల కలిగే గాయాలు ఎప్పుడూ మానవు, ఎందుకంటే ఎవరో ఒకరు వాటిని తిరిగి తెరుస్తూనే ఉంటారు. పంట, వంశం రెండూ నాశనం అవుతాయి. ఇది ఎప్పుడు ఆగిపోతుందో మనకు తెలియదు, బహుశా మనం దానిని ఆపాలని నిర్ణయించుకున్నప్పుడు మాత్రమే.

### యుద్ధోన్మాదం మహా తప్పిదం!

సైన్యానికి, బహుశా ధర్మేంద్రకు వందనం అర్పిస్తూ ఉర్దూ కవి కైఫీ అజ్మీ రాసిన 'కర్ చలే హమ్ ఫిదా' పాటతో ఇక్కిస్ ప్రారంభమవుతుంది. హకీకత్ (1964)లో ఈ పాట ప్రసిద్ధి చెందింది. ఈ క్షణాలు భారతీయ సినిమాకు సంబంధించి హీ-మ్యాన్ వదిలి పెట్టిన శూన్యతను నిశ్శబ్దంగా నొక్కి చెబుతున్నాయి. యుద్ధంలో తన చిన్న కొడుకును కోల్పోయిన తండ్రిగా అతను నటించాడు, కానీ తన దుఃఖాన్ని యుద్ధ ఉన్మాదం వైపు మళ్లించడానికి బదులుగా, మాజీ సైనిక అధికారిగా అతని పాత్ర యువ ప్రాణాలను బలి గొంటున్న రాజకీయ పరిస్థితులను తృణీకరిస్తుంది. ఇది చాలా మానవీయంగా అనిపించే భావోద్వేగం, బహుశా ఈ చిత్రం చాటే బలమైన నైతిక వైఖరి ఇదే.

# దేశభక్తి మేళవించిన స్పై థ్రిల్లర్ ధురంధర్




భారతీయ చలనచిత్ర పరిశ్రమలో గూఢచారి కథలకు ఎప్పు డూ ఒక ప్రత్యేకమైన క్రేజ్ ఉంటుంది. దేశభక్తి, సాహసోపేతమైన పోరాటాలు, ఉత్కంఠ రేకెత్తించే మలుపులు ప్రేక్షకులను థియే టర్లకు రప్పిస్తాయి.. ఈ కోవలోనే దర్శకుడు ఆదిత్య ధర్ తెరకెక్కించిన 'ధురంధర్' ఒక అద్భుతమైన దృశ్యకావ్యంగా నిలిచింది. ' సినిమాతో తన సత్తా చాటిన ఆదిత్య ధర్, వాస్తవ సంఘట నల నుంచి స్ఫూర్తి పొంది, కల్పిత అంశాలను జోడించి వెబ్ సిరిస్‌లా ఉత్కంఠ రేకెత్తించేలా ఈ చిత్రం రూపొందించారు..

### కథా నేపథ్యం..

సినిమా 1999లో జరిగిన ఇండియన్ ఎయిర్‌లైన్స్ ఫ్లైట్ 814 హైజాక్ సంఘటనతో మొదలవుతుంది. ఈ సంఘటన దేశ భద్రతా వ్యవస్థలో ఎలాంటి మార్పులకు దారి తీసిందో దర్శకుడు చాలా స్పష్టంగా చూపించారు.. ఆ తర్వాత 2001లో జరిగిన పార్లమెంట్ దాడి కథను మరో మలుపు తిప్పుతుంది. దేశంపై నిరంతరం జరుగుతున్న ఉగ్రదాడులకు మూలమైన శక్తులను అంతం చేయడానికి ఐబీ చీఫ్ అజయ్ సన్యాల్ 'ఆప రేషన్ ధురంధర్' అనే సిక్రెట్ మిషన్‌ను ప్రతిపాదిస్తారు. ఈ మిషన్ ప్రధాన ఉద్దేశం పాకిస్తాన్ లోపలికి వెళ్లి, అక్కడి ఉగ్రవాద నెట్‌వర్క్‌ను ఛిన్నాభిన్నం చేయడం. దీని కోసం 'హంజా అలీ మజారీ'ను ఎంపిక చేస్తారు.. హంజా పాకిస్తాన్ ఎలా వెళతాడు.. బెలూచ్ ప్రాంతంలో నేరస్థుడు రెహమాన్ డకైత్ ల్యారీ గ్యాంగ్‌లో సభ్యుడిగా ఎలా చేరి ఒక కీలకమైన వ్యక్తిగా హంజా ఎలా ఎదిగాడో దర్శకుడు ఆసక్తికరంగా మలిచారు..

### కథా గమనం - స్క్రీన్ ప్లే

ఇక 26/11 ముంబై దాడులకు వాడిన ఆయుధాలు రెహమాన్ డకైత్ సరఫరా చేసినవే అని హంజా తెలుసుకున్నప్పుడు, కథలో తీవ్రత పరాకాష్టకు చేరుతుంది. దేశద్రోహులు ఎక్కడో లేరు మన దేశంలోనే ఉన్నారని చెప్పిన విధానం ఆకట్టుకుంటుంది. అలాగే నకిలీ కరెన్సీ ముద్రణ ప్లేట్స్, కరెన్సీ పేపర్స్ అంశం చాలా అసక్తికరంగాను, సమస్య మూలాన్ని తెలియ జేస్తుంది. సినిమా నిడివి సుమారు మూడున్నర గంటలు ఉండటం, చాప్టర్స్‌గా విభజించడం వెబ్ సిరిస్‌లా అనిపించినా, కథలోని వేగం ఆ లోటును భర్తీ చేస్తుంది. స్క్రీన్ ప్లే విషయంలో స్పై జానర్‌లో కథ ఎలా ఉండాలో చూపించారు.. హంజా, యేలీనాల మధ్య వచ్చే ప్రేమకథ కథా గమనాన్ని కాస్త నెమ్మది చేసినా, అది హంజా పాత్రలోని మానవీయ కోణాన్ని ఆవిష్క రిస్తుంది. క్లైమాక్స్‌లో వచ్చే ట్విస్ట్ సినిమాను మరో స్థాయికి తీసుకెళ్లి, సీక్వెల్ కోసం భారీ అంచనాలను పెంచుతుంది.

### ఓటీటీ విడుదల - వివాదాలు..

థియేటర్లలో విజయవంతంగా ఆడిన తర్వాత ధురంధర్ నెట్‌ఫ్లిక్స్‌లో విడుదలైంది. అయితే ఓటీటీ వెర్షన్ విషయంలో కొన్ని వివాదాలు రేగాయి.. థియేటర్లలో 3 గంటల 34 నిమిషాలు ఉన్న సినిమా, ఓటీటీలో 9 నిమిషాలు తగ్గించారు. దర్శకుడి ప్రమేయం లేకుండానే స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్ ఈ కట్స్ చేసిందని కొన్ని వార్తలు రాగా, మేకర్స్ దాన్ని ఖండించారు. సెన్సార్ బోర్డు నిబంధనలు, ఐబీ మినిస్ట్రీ కొత్త రూల్స్ ప్రకారం కొన్ని పదాలను మ్యూట్ చేయడం, హింసాత్మక దృశ్యాలను తగ్గించడం జరిగింది.

### సీక్వెల్ అంచనాలు..

సినిమా చివరలో వచ్చే అబ్ బిగడ్నే కా వక్త్ ఆ గయా హై అనే డైలాగ్ సీక్వెల్ పై అంచనాలను శిఖరానికి చేర్చింది. 'ధురంధర్ ది రివెంజ్' పేరుతో రానున్న ఈ రెండో భాగం 2026 మార్చి 19న విడుదల కానుంది. రెండో భాగం మొదటి భాగం కంటే మరింత వైల్డ్‌గా, మరింత ఉత్కంఠగా ఉండబోతోందని చిత్ర బృందం ఇప్పటికే హింట్ ఇచ్చింది. మాతృభూమి రక్షణలో ప్రాణత్యాగం చేసే గూఢచారుల వీరగాథకు, ఉత్కంఠభరితమైన స్పై డ్రామాలను కోరుకునే ప్రేక్షకులకు ఇది ఒక అద్భుతమైన అనుభవం. ఈ కథా క్రమంలో తదుపరి పోరాటం ఎలా ఉండబో తోందన్న ఉత్సుకత అందరిలోనూ నెలకొంది.

# కొలెస్ట్రాల్‌తో బాధపడుతున్నారా - ఈ చిట్కాలు పాటిస్తే మేలంటున్న నిపుణులు!

## వంటింటి పదార్థాలతో "కొలెస్ట్రాల్" నియంత్రణ గుండె ఆరోగ్యంలో కీలక పాత్ర పోషిస్తాయట



రక్తనాళాల్లో పూడికల్ని పోగేసి, చివరికి గుండెపోటు, స్ట్రోక్ ను తెచ్చిపెట్టే కొలెస్ట్రాల్ అంటే అందరికీ భయమే. రక్తంలో కొలెస్ట్రాల్ స్థాయిలు పెరగడానికి మన ఆహారపు అలవాట్లుతో పాటు జీవనశైలి, ఒత్తిడి, వ్యాయామం లేకపోవడం వంటివి కూడా కొలెస్ట్రాల్ పెరగడానికి దారితీస్తాయంటున్నారు నిపుణులు. ఈ క్రమంలో కొలెస్ట్రాల్ నియంత్రణలో ఉండటానికి కొన్ని చిట్కాలు సూచిస్తున్నారు. మరి, అవేంటో ఇప్పుడు తెలుసుకుందాం!

ధనియాలు :

ధనియాలను వంటల్లోనే కాకుండా వైద్యంలో కూడా విస్తృతంగా ఉపయోగిస్తారు. ధనియాల నీరు లేదా వాటి సారం, శరీరంలోని చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించి, మంచి కొలెస్ట్రాల్‌ను పెంచడంలో సహాయపడుతుందని కొన్ని అధ్యయనాల్లో వెల్లడైంది. ధనియాలలో యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్లు పుష్కలంగా ఉంటాయంటున్నారు నిపుణులు. ఇవి శరీరంలోని కొవ్వును కరిగించడానికి, గుండెను రక్షించడానికి తోడ్పడతాయని చెబుతున్నారు. వీటిని వంటల్లో లేదా కూరల్లో వాడుకోవడమే కాకుండా, ఉదయాన్నే ధనియాల నీటిని తాగడం వల్ల మంచి ఫలితం ఉంటుందని తెలియజేస్తున్నారు. ఈ సులభమైన ఇంటి చిట్కా కొలెస్ట్రాల్ స్థాయిలను అదుపులో ఉంచడానికి సహాయపడుతుందని పేర్కొంటున్నారు.

అవిసె గింజలు :

గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరిచే పోషకాలు అవిసె గింజలలో పుష్కలంగా ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. ఇందులోని ఒమేగా-3 ఫ్యాటీ ఆమ్లాలు.. ముఖ్యంగా ఆల్ఫా-లినోలెనిక్ ఆమ్లం రక్తంలోని చెడు కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించి, మంచి కొలెస్ట్రాల్ ను పెంచుతాయని అంటున్నారు. అందువల్ల వీటిని తరచూ ఆహారంలో భాగం చేసుకోవడం ద్వారా గుండె గుండె జబ్బుల ప్రమాదం తగ్గుతుందని వెల్లడిస్తున్నారు. కరిగే పీచు పదార్థం పేగులలో కొలెస్ట్రాల్ శోషణను తగ్గిస్తుందంటున్నారు నిపుణులు. అలాగే ‾ూూ వాపును తగ్గించి రక్తనాళాల పనితీరును మెరుగుపరుస్తుందని చెబుతున్నారు. పొడి చేసిన అవిసె గింజలు లేదా అవిసె నూనె వాడటం వల్ల చెడు కొలెస్ట్రాల్ తగ్గుతుందని పలు పరిశోధనల్లో తేలింది. ఈ క్రమంలో రోజువారీ ఆహారంలో స్మూతీలు, తృణధాన్యాలు లేదా బేక్ చేసిన పదార్థాలలో అవిసె గింజలను చేర్చుకోవాలని సూచిస్తున్నారు.

ద్రాక్ష గింజల సారం :

ద్రాక్ష గింజల సారంలో 'పాలీఫెనాల్స్' అనే యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. ఇవి రక్తనాళాలను సంరక్షించడమే కాకుండా గుండెకు చేదోడుగా నిలుస్తాయంటున్నారు. ద్రాక్ష గింజల సారం మొత్తం కొలెస్ట్రాల్‌ను, ాణూ ను తగ్గించగలదని అధ్యయనం పేర్కొంది. ఆపిల్స్, ద్రాక్ష, స్ట్రాబెర్రీలు, సిట్రస్ పండ్లు పండ్లలో పెక్టిన్ పుష్కలంగా ఉంటుంది, ఇది ాణూ తగ్గించే ఒక రకమైన కరిగే ఫైబర్ అని అధ్యయనం పేర్కొంది. అంతేకాకుండా, ఇది రక్తనాళాలను మరింత దృఢంగా మారుస్తుందంటున్నారు నిపుణులు. ఇందులోని యాంటీ ఆక్సిడెంట్ శక్తి కొలెస్ట్రాల్ ఆక్సీకరణను తగ్గించడంలో సహాయపడుతుందని చెబుతున్నారు. దీనివల్ల ధమనులు దెబ్బతినకుండా ఉంటాయని పేర్కొంటున్నారు. ద్రాక్ష గింజల సారానికి సంబంధించిన సప్లిమెంట్లను తీసుకునే వారిలో కొలెస్ట్రాల్ స్థాయిలు తగ్గడమే కాకుండా, గుండె ఆరోగ్య సూచికలు మెరుగుపడినట్లు అధ్యయనాలు చెబుతున్నాయి.

గ్రీన్ టీ :

గ్రీన్ టీలో 'కాటెచిన్స్' అనే యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. ఇవి ాణూను, మొత్తం కొలెస్ట్రాల్ స్థాయులను తగ్గిస్తాయంటున్నారు. క్రమం తప్పకుండా గ్రీన్ టీ తీసుకోవడం వల్ల మంచి కొలెస్ట్రాల్ స్థాయిలు మెరుగుపడతాయని, గుండె జబ్బుల ప్రమాదం తగ్గుతుందని అధ్యయనాలు చెబుతున్నాయి. ఈ క్రమంలో ఆరోగ్యకరమైన జీవనశైలిలో భాగంగా, ప్రతిరోజూ చక్కెర కలపని కొన్ని కప్పుల గ్రీన్ టీ తాగడం వల్ల కొలెస్ట్రాల్ నియంత్రణలో ఉంటుందట.

దాల్చిన చెక్క :

దాల్చిన చెక్క అనేది ప్రపంచ వ్యాప్తంగా ప్రజలు ఉపయోగించే ఒక సుగంధ ద్రవ్యం. దీని సువాసనతోపాటు, దాల్చిన చెక్క కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో సహాయపడుతుందని కొన్ని అధ్యయనాల్లో వెల్లడైంది. ఇది మొత్తం కొలెస్ట్రాల్, ాణూ, ట్రైగ్లిజరైడ్లను తగ్గించడంలో తోడ్పడుతుందంటున్నారు నిపుణులు. ఇతర ఆహార పదార్థాలతో కలిపి తీసుకున్నప్పుడు, దాల్చిన చెక్క ఎణూ స్థాయిలను మెరుగుపరచడానికి కూడా సహాయపడుతుందంటున్నారు నిపుణులు. దీనికి కారణం దాల్చిన చెక్కలో ఉండే పాలీఫెనాల్స్ కారణమట. ఇవి యాంటీ ఆక్సిడెంట్లుగా పనిచేసి గుండె జబ్బులకు దారితీసే వాపు, కణాల నష్టాన్ని అరికట్టడంలో సహాయపడతాయని చెబుతున్నారు. అయితే, ఏదైనా ఆరోగ్య మార్పుల కోసం దాల్చిన చెక్కను ఆహారంలో చేర్చుకునే ముందు డాక్టర్ ని సంప్రదించడం మంచిదంటున్నారు.

పసుపు :

పసుపు ప్రతిరోజూ పసుపు లేదా కర్కుమిన్ తీసుకోవడం వల్ల మొత్తం కొలెస్ట్రాల్, తగ్గుతాయని అధ్యయనం పేర్కొంది. పసుపును రోజువారీ ఆహారంలో చేర్చుకోవచ్చు లేదా పాలు, టీ వంటి వాటిలో కలిపి తీసుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు. అయితే, పసుపు సప్లిమెంట్లను మాత్రం కేవలం డాక్టర్ల పర్యవేక్షణలోనే తీసుకోవాలని సూచిస్తున్నారు.

పచ్చి వెల్లుల్లి :

ప్రతిరోజూ వెల్లుల్లి తీసుకోవడం వల్ల మొత్తం కొలెస్ట్రాల్, తగ్గుతుందని అధ్యయనం పేర్కొంది. ఈ తగ్గుదల గుండె సమస్యలు, స్ట్రోక్ ప్రమాదాన్ని గణనీయంగా తగ్గిస్తుందని తెలిపింది. ఈ క్రమంలో కొలెస్ట్రాల్‌ను సమతుల్యంగా ఉంచుకోవడానికి వెల్లుల్లిని ఆహారంగా తీసుకోవడం లేదా సప్లిమెంట్ల రూపంలో వాడటం ఒక సులభమైన మార్గమంటున్నారు నిపుణులు. వెల్లుల్లిని తాలింపుల్లో లేదా పచ్చడి రూపంలో వంటలకు సులభంగా జోడించవచ్చని చెబుతున్నారు. ఒకవేళ మీరు దీనిని పచ్చిగా తినగలిగితే, ఒక వెల్లుల్లి రెబ్బను నలిపి, దానిని తినడానికి ముందు రెండు నిమిషాల పాటు పక్కన పెట్టాలని సూచిస్తున్నారు. ఇక్కడ మీకు అందించిన ఆరోగ్య సమాచారం, సూచనలు అన్నీ మీ అవగాహన కోసం మాత్రమే. శాస్త్ర పరిశోధనలు, అధ్యయనాలు, వైద్య, ఆరోగ్య నిపుణుల సూచనల ప్రకారమే మేము ఈ సమాచారాన్ని అందిస్తున్నాం. వీటిని పాటించే ముందు కచ్చితంగా మీ వ్యక్తిగత వైద్యుల సలహాలు తీసుకోవడమే మంచిది.

# చరిత్ర సృష్టించిన జమ్ముకశ్మీర్- తొలిసారి రంజీ ట్రోఫీ కైవసం

## కర్ణాటకతో ఫైనల్ మ్యాచ్ డ్రా- తొలిసారి రంజీ ట్రోఫీ విజేతగా జమ్ముకశ్మీర్ చరిత్ర- మ్యాచ్ కు హాజరైన సీఎం అబ్దుల్లా!




జమ్ము కశ్మీర్ చరిత్ర సృష్టించింది. తొలిసారి రంజీ ట్రోఫీ ఛాంపియన్ గా అవతరించింది. హుబ్బళ్లి వేదికగా కర్ణాటకతో జరిగిన ఫైనల్ మ్యాచ్ డ్రాగా ముగిసింది. అయితే తొలి ఇన్నింగ్స్ లో భారీ ఆధిక్యం దక్కడంతో జమ్ము కశ్మీర్ విజేతగా ఎంపికైంది. దీంతో కశ్మీర్ క్రికెట్ చరిత్రలో తొలిసారి రంజీ ట్రోఫీని ముద్దాడింది. కాగా, ఈ ప్రతిష్ఠాత్మక ఫైనల్ ను చూసేందుకు కశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా కూడా స్టేడియానికి వచ్చారు. తమ రాష్ట్ర ఆటగాళ్లను దగ్గరుండి ప్రోత్సహించారు.

మ్యాచ్ డ్రా

ఓవర్‌నైట్ స్కోర్ 186-4 వద్ద కశ్మీర్ రెండో ఇన్నింగ్స్ ను ఐదో రోజూ కొనసాగించింది. అయితే 342-4 (113 ఓవర్లు) స్కోరు వద్ద కశ్మీర్ రెండో ఇన్నింగ్స్‌ను డిక్లేర్డ్ చేసింది. ఆ సమయానికి ఇంకో ఒక్క సెషన్ ఆట మాత్రమే మిగిలింది. అయితే ఒక్క సెషన్ లో ఫలితం వచ్చే ఛాన్స్ లేనందున మ్యాచ్ ను డ్రా గా ముగించేందుకు ఇరు జట్ల కెప్టెన్లు అంగీకరించారు. అలా తొలి ఇన్నింగ్స్‌లో భారీ ఆధిక్యం సాధించిన జమ్ముకశ్మీర్ టైటిల్‌ను దక్కించుకుంది. దీంతో 67 ఏళ్ల కశ్మీర్ నిరీక్షణకు ఫుల్ స్టాప్ పడింది.

మ్యాచ్ సాగిందిలా

టాస్ నెగ్గి తొలుత బ్యాటింగ్ చేసిన జమ్ముకశ్మీర్ తొలి ఇన్నింగ్స్‌లో 584 పరుగుల భారీ స్కోర్ నమోదు చేసింది. శుభమ్ పుందిర్ (121 పరుగులు), యవీర్ హసన్ (88 పరుగులు), సాహిల్ లోత్రా (72 పరుగులు), కన్హయ్య (70 పరుగులు), అబ్దుల్ సమద్ (61 పరుగులు) రాణించారు. ప్రసిద్ధ్ కృష్ణ 5 వికెట్లతో అదరగొట్టాడు. శ్రేయస్ గోపాల్, విద్యాధర్, విజయ్ కుమార్, శిఖర్ తలో 1 వికెట్ దక్కించుకున్నారు.

అనంతరం బ్యాటింగ్ చేసిన కర్ణాటక మొదటి ఇన్నింగ్స్ లో 293 పరుగులకే కుప్పకూలింది. మయంగ్ అగర్వాల్ (160 పరుగుల) ఒక్కడే రాణించాడు. కేఎల్ రాహుల్ (13 పరుగులు) సహా మిగిలిన బ్యాటర్లు విఫలం అయ్యారు. అకిబ్ నబీ బౌలింగ్ కు కర్ణాటక బ్యాటింగ్ ఆర్డర్ కుప్పకూలింది. కశ్మీర్ బౌలర్లలో అకిబ్ 5 వికెట్ల ప్రదర్శన చేయగా సునీల్ కుమార్, యుధ్వీర్ చెరో 2, సాహిల్ లోత్రా 1 వికెట్ దక్కించుకున్నారు. దీంతో తొలి ఇన్నింగ్స్ లోనే కశ్మీర్ కు 291 భారీ ఆధిక్యం దక్కింది. ఇక జమ్ముకశ్మీర్ రెండో ఇన్నింగ్స్‌లో ఐదో రోజు డిక్లేర్డ్ చేసే సమయానికి 113 ఓవర్లకు 342 - 4 పరుగులు చేసింది.

అదరగొట్టిన అకిబ్

ఈ టోర్నీలో జమ్ము కశ్మీర్ ఇక్కడిదాకా రావడానికి, అలాగే ఎనిమిదిసార్లు ఛాంపియన్ అయిన కర్ణాటకను ఫైనల్ లో ఓడించడంలో కీలక పాత్ర పోషించాడు ఆ జట్టు బౌలర్ అకిబ్ నబీ. 29ఏళ్ల ఈ పేసర్ టోర్నీలో ఆద్యంతం రాణించాడు. మొత్తం 10 మ్యాచ్ ల్లో అసాధారణ రీతిలో ప్రదర్శన చేసి 60 వికెట్లు నేలకూల్చాడు. ఇందులో ఏడుసార్లు 5 వికెట్ల ప్రదర్శన చేశాడు. అలా కశ్మీర్ తొలిసారి రంజీ ఛాంపియన్ గా నిలవడంలో కీలక పాత్ర పోషించిన అకిబ్ నబీకు 'ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్' అవార్డు దక్కింది.

సంక్షిప్త స్కోర్లు

జమ్ముకశ్మీర్ - 584-10 (శుభమ్ పుందిర్ 121 పరుగులు) & 342/4 (కమ్రాన్ ఇక్బాల్ 160 పరుగులు, సాహిల్ లోత్రా 101 పరుగులు) కర్ణాటక - 293 ఆలౌట్ (మయంక్ అగర్వాల్ 160 పరుగులు) (తొలి ఇన్నింగ్స్) కర్ణాటక తుది జట్టు - కేఎల్ రాహుల్, మయాంక్ అగర్వాల్, దేవదత్ పడిక్కల్ (కెప్టెన్), కరుణ్ నాయర్, స్మరన్ రవిచంద్రన్, శ్రేయాస్ గోపాల్, కృతిక్ కృష్ణ (వికెట్ కీపర్), విద్యాధర్ పాటిల్, విజయ్ కుమార్ వైశాఖ్, శిఖర్ శెట్టి, ప్రసిద్ కృష్ణ జమ్ము కశ్మీర్ తుది జట్టు - కమ్రాన్ ఇక్బాల్, యావర్ హసన్, శుభమ్ పుండిర్, పరాస్ డోగ్రా (కెప్టెన్), అబ్దుల్ సమద్, కన్హయ్య వాధావన్ (వికెట్ కీపర్), అబిద్ ముస్తాక్, ఔకిబ్ నబీ దార్, యుధ్వీర్ సింగ్ చరక్, సాహిల్ లోత్రా, సునీల్ కుమార్

# ఆంథ్రోపిక్ కు ట్రంప్ షాక్- ఆ కంపెనీ ఏఐ వినియోగాన్ని ఆపాలంటూ ప్రభుత్వ శాఖలకు ఆదేశం

## పెంటగాన్ డిమాండ్లకు అంగీకరించలేదని ఆంథ్రోపిక్‌తో డీల్ క్యాన్సిల్ చేసిన ట్రంప్




ప్రఖ్యాత ఏఐ టెక్నాలజీ కంపెనీ ఆంథ్రోపిక్‌కు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ షాకిచ్చారు. ఆంథ్రోపిక్‌కు చెందిన ఏఐ సాంకేతికతను వినియోగించడాన్ని ఆపాలని అన్ని అమెరికా ప్రభుత్వ విభాగాలను ఆయన ఆదేశించారు. దీంతోపాటు ఆ కంపెనీపై పలు కీలక జరిమానాలనూ విధించారు. "మాకు ఆంథ్రోపిక్ అక్కర్లేదు. ఆ కంపెనీతో మాకు పని లేదు. మేం మళ్లీ వాళ్లతో కలిసి వ్యాపారం చేసేది లేదు" అని ట్రూత్ సోషల్ వేదికగా ట్రంప్ వెల్లడించారు. ఏకంగా అమెరికా రక్షణ విభాగం (పెంటగాన్)పైనే బల ప్రయోగం చేసేందుకు ఆంథ్రోపిక్ యత్నించిందని ఆయన ఆరోపించారు. ఇప్పటివరకు అమెరికా సైన్యానికి సంబంధించిన ఆన్‌లైన్ వేదికల్లో ఎంబెడ్ చేసిన ఆంథ్రోపిక్ ఏఐ టెక్నాలజీని తొలగించేందుకు పెంటగాన్‌కు 6 నెలల గడువు ఇచ్చానని ట్రంప్ తెలిపారు. వామపక్ష అతివాదం, జాతి వివక్షా భావం కలిగిన కంపెనీకి అమెరికా సైనిక వ్యూహాలు, యుద్ధ రహస్యాలు ఎలా ఉండాలనే దానిపై మాట్లాడే అవకాశాన్ని ఇచ్చేది లేదని స్పష్టం చేశారు. ఈమేరకు ఒక పోస్ట్‌ను పూర్తిగా ఇంగ్లీష్ క్యాపిటల్ లెటర్స్‌తో ట్రూత్ సోషల్‌లో ట్రంప్ పెట్టడం గమనార్హం.

### సప్లై చైన్ రిస్క్ కేటగిరీలో ఆంథ్రోపిక్‌ను చేరుస్తాం: అమెరికా రక్షణమంత్రి

"మేం అమెరికా సైన్యం కోసం చట్టబద్ధంగానే ఆంథ్రోపిక్ క్లాడ్ ఏఐ టూల్స్‌ను వాడుతాం. ఆ టూల్స్‌పై మాకు పూర్తిస్థాయి యాక్సెస్‌ను ఇవ్వాలని అడుగుతున్నాం. కానీ ఆంథ్రోపిక్ ససేమిరా అంటోంది. ఏకంగా అమెరికా రక్షణశాఖకే ఆంథ్రోపిక్ కంపెనీ సహకరించడం లేదు. ఇలాంటప్పుడు సప్లై చైన్ రిస్క్ కేటగిరీలో దాన్ని చేర్చాల్సి ఉంటుంది" అని అమెరికా రక్షణమంత్రి పీట్ హెగ్సెథ్ తాజా హెచ్చరిక చేశారు.

అమెరికా రక్షణ శాఖను కోర్టులో సవాలు చేస్తాం : ఆంథ్రోపిక్

"మా కంపెనీపై సప్లై చైన్ రిస్క్ ఆరోపణలు చేసినందుకు అమెరికా రక్షణ శాఖను కోర్టులో సవాలు చేస్తాం. సప్లై చైన్ రిస్క్ కేటగిరీ అనేది అమెరికాతో విరోధం కలిగిన దేశాల కోసం రూపొందించినది. ఆ కేటగిరీలోకి ఒక అమెరికన్ కంపెనీని ఎలా చేరుస్తారు ? చట్టబద్ధంగా అలా చేయడం కుదరదు కదా ? అమెరికా ప్రభుత్వంతో ఒప్పందాలను కుదుర్చుకునే అమెరికా కంపెనీలు ఇలాంటి పర్యవసానాలను ఎదుర్కోవాల్సి వస్తుండటం ఆందోళనకరం. అమెరికన్లపై నిఘా కోసం, అటానమస్ ఆయుధాల వినియోగం కోసం మా ఏఐ ఛాట్‌బోట్ క్లాడ్ టెక్నాలజీని వినియోగించము అనే స్పష్టమైన హామీని అమెరికా రక్షణ శాఖ (పెంటగాన్) ఇవ్వడం లేదు. అందుకే వాళ్లకు మేం ఏఐ టూల్స్‌పై పూర్తి యాక్సెస్‌ను ఇవ్వడం లేదు" అని తాజాగా ఓ ప్రకటనలో ఆంథ్రోపిక్ వెల్లడించింది.

ఆంథ్రోపిక్ స్థానంలో ఓపెన్ ఏఐ వినియోగం : ఆల్ట్‌మన్

ఆంథ్రోపిక్ ఏఐ వినియోగాన్ని ఆపేసిన వెంటనే, తమ ఏఐ టూల్స్‌ను వాడటాన్ని అమెరికా రక్షణ శాఖ మొదలుపెట్టిందని ఓపెన్ ఏఐ సీఈఓ శామ్ ఆల్ట్‌మన్ ప్రకటించారు. దీనిపై శుక్రవారం రాత్రే అమెరికా రక్షణ శాఖ, ఓపెన్ ఏఐ మధ్య ఒప్పందం కుదిరిందని తెలిపారు. ఇక తమ ఏఐ మోడల్స్‌ను అమెరికా రక్షణ శాఖకు చెందిన క్లాసిఫైడ్ నెట్‌వర్క్‌లలో మోహరిస్తారని చెప్పారు. ఏఐ భద్రతకు కట్టుబడి ఉంటామని అమెరికా ప్రభుత్వం నుంచి తమకు హామీ లభించిందని ఆల్ట్‌మన్ వెల్లడించారు. అమెరికన్లపై నిఘా కోసం, మనుషులపై బలప్రయోగం కోసం, అటానమస్‌గా పనిచేసే ప్రాణాంతక ఆయుధాల కోసం ఏఐను వినియోగించకూడదు అనేవి ఏఐ భద్రత పరిధిలోకి వస్తాయన్నారు. వీటికి లోబడి పనిచేస్తామని అమెరికా రక్షణశాఖ తమకు హామీ ఇచ్చిందన్నారు. ఈవివరాలను ఒప్పందంలో కూడా చేరుస్తామని ఆల్ట్‌మన్ స్పష్టం చేశారు.

ఆంథ్రోపిక్‌ను దూషించిన ఎలాన్ మస్క్- అందుకోసమేనా

మొత్తం మీద ఈ వ్యవహారం అమెరికాలోని సిలికాన్ వ్యాలీలో కలకలం సృష్టించింది. ఆంథ్రోపిక్ కంపెనీ ప్రధాన పోటీదారులైన ఓపెన్ ఏఐ, గూగుల్ కూడా ఆంథ్రోపిక్ సీఈఓ డేరియో అమోడీకి మద్దతు ప్రకటించాయి. మరోవైపు ఎలాన్ మస్క్ మాత్రం ఆంథ్రోపిక్‌ను దూషిస్తూ ట్వీట్ చేశారు. పశ్చిమ దేశాల నాగరికత అంటే ఆంథ్రోపిక్‌కు ద్వేషమని ఆయన వ్యాఖ్యానించారు. ఆంథ్రోపిక్ కంపెనీ అమెరికా ప్రభుత్వ కాంట్రాక్టులను కోల్పోతుండటం, ఎలాన్ మస్క్‌కు చెందిన ఛాట్‌బోట్ గ్రోక్‌కు కలిసొచ్చే ఛాన్స్ ఉందని పరిశీలకులు అంచనా వేస్తున్నారు. త్వరలోనే గ్రోక్ ఏఐకు అమెరికా క్లాసిఫైడ్ మిలిటరీ నెట్‌వర్క్లలోకి యాక్సెస్ ఇస్తారని తెలుస్తోంది. తమ ఏఐ టెక్నాలజీని, టూల్స్‌ను అమెరికా సైన్యానికి అందించే కాంట్రాక్టులను కుదుర్చుకునే ప్రక్రియలో ఉన్న గూగుల్, ఓపెన్ ఏఐ కంపెనీలకు ఇదొక హెచ్చరికలా ఉంటుందని ట్రంప్ ప్రభుత్వం భావిస్తోంది.

ఆంథ్రోపిక్ ూా అమెరికా రక్షణశాఖ : అసలేమైంది

ఆంథ్రోపిక్ కంపెనీ 2023 మార్చి 14 నుంచి 2026 ఫిబ్రవరి 17 వరకు పలు క్లాడ్ ఏఐ మోడల్స్‌ను విడుదల చేసింది. 2024 జూన్ నుంచి వీటిని అమెరికా సైన్యం, రక్షణ శాఖ, సైబర్, శాటిలైట్ నిఘా విభాగాలు వినియోగిస్తున్నాయి.

### ఉత్కంఠ పోరులో ఇంగ్లాండ్ విజయం

# కివీస్ ఓటమితో పాకిస్థాన్ ఖుష్!

## ఇంగ్లాండ్ పై న్యూజిలాండ్ విజయం కివీస్ ఓటమితో పాకిస్థాన్ అశలు సజీవం - ఆసక్తికరంగా గ్రూప్ 2 సెమీస్ రేస్

సూపర్ 8లో ఇంగ్లాండ్ హ్యాట్రిక్ నమోదు చేసింది. తాజాగా న్యూజిలాండ్ తో జరిగిన మ్యాచ్ లో 4 వికెట్ల తేడాతో నెగ్గింది. దీంతో గ్రూప్ 2లో సెమీస్ రేసు ఇంకా ఆసక్తికరంగా మారింది. కివీస్ నిర్దేశించిన 160 పరుగుల టార్గెట్ ను ఇంగ్లాండ్ 6 వికెట్లు కోల్పోయి 19.3 ఓవర్లో ఛేదించింది. టామ్ బంటన్ (33 పరుగులు) రాణించాడు. విల్ జాక్స్ (32 పరుగులు), రెహాన్ అహ్మద్ (19 పరుగులు, 7 బంతుల్లో) చివర్లో మెరుపులు మెరిపించడంతో ఉత్కంఠ పోరులో ఇంగ్లిష్ జట్టు విజయం సాధించింది. కివీస్ బౌలర్లలో రచిన్ 3, మ్యాట్ హెన్రీ, లాకీ ఫెర్గ్యూసన్, గ్లెన్ ఫిలిప్స్ తలో 1 వికెట్ దక్కించుకున్నారు. జా ఓటమితో కివీస్ సెమీఫైనల్ అవకాశాలు అత్యంత సంక్లిష్టం అయ్యాయి. సూపర్ 8లో ఒక్కో విజయం, ఓటమి (మరో మ్యాచ్ రద్దు)తో న్యూజిలాండ్ మూడు పాయింట్లతో రెండో స్థానంలో ఉంది. మరోవైపు ఈ మ్యాచ్ ఫలితంతో పాకిస్థాన్ సంతోషంగా ఒది. కివీస్ ఓడడంతో పాక్ సెమీస్ రేస్ లో ఉంది. రేపు శ్రీలంకతో జరగనున్న మ్యాచ్ లో పాక్ భారీ తేడాతో నెగ్గితే సెమీస్ కు అర్హత సాధిస్తుంది. ప్రస్తుతం కివీస్ రన్ రేట్ +1.390 (3 పాయింట్లు)తో ఉండగా, పాకిస్థాన్ -0.461 (1 పాయింట్) మూడో ప్లేస్ లో ఉంది. అంతకుముందు బ్యాటింగ్ చేసిన కివీస్ 20 ఓవర్లలో 159 పరుగులు చేసింది. గ్లెన్ ఫిలిప్స్ (39 పరుగులు), టిమ్ (35 పరుగులు) రాణించారు. ఇంగ్లాండ్ బౌలర్లలో ఆదిల్ రషీద్, విల్ జాక్స్, రెహాన్ అహ్మద్ తలో 2, యామ్ డాసన్ 1 వికెట్ దక్కించుకున్నారు.

జాక్స్ అరుదైన రికార్డ్

తొలుత బౌలింగ్ అనంతరం బ్యాటింగ్ లో అదరగొట్టిన విల్ జాక్స్‌కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది. ప్రస్తుత టోర్నీలోనే ఈ అవార్డును విల్ జాక్స్ మూడుసార్లు అందుకోవడం విశేషం. దీంతో సింగిల్ టీ20 వరల్డ్ కప్ ఎడిషన్ లో అత్యధికసార్లు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కించుకున్న రెండో క్రికెటర్ గా సికందర్ రజాతో సమానంగా నిలిచాడు. ఈ జాబితాలో ఆస్ట్రేలియా మాజీ ఆల్ రౌడండర్ షేన్ వాట్సన్ టాప్ లో ఉన్నాడు. అతడు 2012 టీ20 ప్రపంచకప్ ఎడిషన్ లో 4 సార్లు ఈ అవార్డు అందుకున్నాడు.

సింగిల్ ు20 వరల్డ్ కప్ ఎడిషన్‌లో అత్యధిక ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డులు అందుకున్న క్రికెటర్లు 4 - షేన్ వాట్సన్ (ఆస్ట్రేలియా)- 2012 4 - విల్ జాక్స్ ( విల్ జాక్స్)- 2026 3 - సికందర్ రజా (జింబాబ్వే)- 2022 స్పిన్నర్లదే బలం ఈసారి ఆయా జట్లు గతంలోకంటే భిన్నంగా ఆలోచిస్తున్నాయి. ఈ క్రమంలోనే స్పిన్నర్లతో అత్యధిక ఓవర్లు బౌలింగ్ చేయిస్తున్నాయి. ఈ మ్యాచ్ లోనూ ఇరుజట్లు ఎక్కువగా స్పిన్ బలాన్నే ప్రదర్శించాయి. ఓవరాల్ గా 40 ఓవర్ల మ్యాచ్ (రెండు జట్ల బ్యాటింగ్ కలిపి)లో స్పిన్నర్లే మొత్తం 31 ఓవర్లు బౌలింగ్ చేయడం విశేషం. దీంతో టీ20 వరల్డ్ కప్ లో ఎక్కువ ఓవర్లు స్పిన్నర్లే బౌలింగ్ చేసిన మ్యాచ్ గా భారత్- పాక్ మ్యాచ్ తో సమంగా నిలిచింది. ఇదే సీజన్ లో శ్రీలంక వేదికగా ఇటీవల జరిగిన భారత్- పాక్ మ్యాచ్ లోనూ స్పిన్నర్లు 31 ఓవర్లు బౌలింగ్ చేశారు. అలాగే ఈ టోర్నీలోనే శ్రీలంక- న్యూజిలాండ్ మ్యాచ్ లోనూ 30 ఓవర్లు స్పిన్నర్లు బౌలింగ్ చేశారు. అంటే ఈ ఎడిషన్ లోనే మూడు మ్యాచ్ ల్లో 30పై చిలుకు ఓవర్లను స్పిన్నర్లు బౌలింగ్ చేశారు. 20 ప్రపంచ కప్ మ్యాచ్‌లో అత్యధిక ఓవర్ల స్పిన్ బౌలింగ్ 31.0 ఓవర్లు - భారత్ ఌం పారిస్థాన్ - కొలంబో, 2026 31.0 ఓవర్లు - న్యూజిలాండ్ ఌం ఇంగ్లాండ్- కొలంబో, 2026 30.0 ఓవర్లు - శ్రీలంక ఌం న్యూజిలాండ్- కొలంబో, 2026 26.0 ఓవర్లు - ఆస్ట్రేలియా ఌం పాకిస్థాన్- కొలంబో, 2012 25.4 ఓవర్లు - భారత్ ఌం వెస్టిండీస్- మీర్పూర్, 2014

# డయల్-100 కాల్‌తో మహిళ ప్రాణాలు కాపాడిన బ్లూ కోల్ట్ సిబ్బంది....




గోదావరిఖని//ఫిబ్రవరి 28 (ఆకాంక్ష): కుటుంబ కలహాల కారణంగా తీవ్ర ఆత్మవేదనకు గురైన ఒక మహిళ ఆత్మహత్యకు యత్నించగా, డయల్-100 సమాచారంపై వెంటనే స్పందించిన పోలీసులు ఆమె ప్రాణాలను రక్షించారు. ఈ సంఘటన రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి జిల్లా ఎన్టీపీసీ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.అంబేద్కర్ కాలనీలో నివసిస్తున్న ఘర్ష నర్మద (భర్త: కిరణ్) కుటుంబ సమస్యలతో మానసిక ఆందోళనకు గురై గోదావరి నదిలో దూకి ప్రాణాలు తీసుకుంటానని చెప్పి మేడిపల్లి ఫిల్టర్ బెడ్ వైపు పరుగెత్తినట్లు డయల్-100కు సమాచారం అందింది. సమాచారం అందుకున్న వెంటనే ఎన్టీపీసీ ఎస్ఐ ఉదయ్ కిరణ్ అప్రమత్తమై బ్లూ కోల్ట్ సిబ్బంది పీసీ శ్రీరామ్, హెచ్‌జీ రాజేష్‌లకు సమాచారమిచ్చి సంఘటనా స్థలానికి పంపించారు.సంఘటనా స్థలానికి చేరుకున్న బ్లూ కోల్ట్ సిబ్బంది చాకచక్యంగా వ్యవహరించి ఆ మహిళను అదుపులోకి తీసుకుని గోదావరిలో దూకే ప్రయత్నాన్ని అడ్డుకున్నారు. అనంతరం ఆమెను సురక్షితంగా పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పోలీసులు చూపిన అప్రమత్తతతో ఒక మహిళ ప్రాణాలు రక్షించబడ్డాయి.తదుపరి ఆమె భర్తను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి ఎస్ఐ ఉదయ్ కిరణ్ వారి మధ్య కౌన్సెలింగ్ నిర్వహించి కుటుంబ సమస్యలను పరిష్కరించేలా సూచనలు ఇచ్చారు.ఈ సందర్భంగా సేవాభావంతో వేగంగా స్పందించి మహిళ ప్రాణాలను కాపాడిన బ్లూ కోల్ట్ సిబ్బందిని ఉన్నతాధికారులు అభినందించారు. ప్రజల రక్షణ కోసం డయల్-100 సేవలు ఎప్పుడూ అందుబాటులో ఉంటాయని, అత్యవసర పరిస్థితుల్లో వెంటనే సమాచారమివ్వాలని పోలీసులు సూచించారు.

### రామగుండం కమిషనరేట్‌లో

# అంతర్రాష్ట్ర నకిలీ కరెన్సీ ముఠా గుట్టురట్టు...

## రూ.5.98 లక్షల దొంగనోట్లు స్వాధీనం... 12 మంది అరెస్ట్, పరారీలో ఇద్దరు...





మంచిర్యాల//ఫిబ్రవరి 28(ఆకాంక్ష ) : రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో నకిలీ కరెన్సీ చలామణి చేస్తున్న అంతర్రాష్ట్ర ముఠాను పోలీసులు అదుపులోకి తీసుకుని భారీ స్థాయిలో దొంగనోట్లను స్వాధీనం చేసుకున్నారు. లక్షెట్టిపేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ ఘటనలో మొత్తం రూ.5,98,500 విలువైన నకిలీ కరెన్సీ నోట్లను స్వాధీనం చేసుకోగా, 12 మందిని అరెస్ట్ చేసి ముగ్గురు ఉపయోగించిన మూడు కార్లను సీజ్ చేశారు. ఈ కేసులో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.మంచిర్యాల ఏసీపీ ఆర్.ప్రకాష్ వివరాల ప్రకారం,ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ ఉద్యోగి సంబారి సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ కేసు వెలుగులోకి వచ్చింది. ఫిబ్రవరి 25న ఉదయం సుమారు 11 గంటల సమయంలో తెలుపు రంగు కారు ద్వారా వచ్చిన నిందితులు రూ.1500 విలువైన పెట్రోల్ నింపించుకుని రూ.500 చొప్పున మూడు నోట్లను ఇచ్చి వెళ్లిపోయారు. పెట్రోల్ బంక్‌లో పనిచేస్తున్న వెంకటేట్టి మమత ఆ నోట్లను పరిశీలించగా మూడు నోట్లకు ఒకే సీరియల్ నంబర్ ఉండటం గమనించి యాజమాన్యానికి సమాచారం ఇచ్చారు. సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా వాహన నంబర్ సేకరించి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.మంచిర్యాల డీసీపీ ఆదేశాల మేరకు ఏసీపీ పర్యవేక్షణలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి లక్షెట్టిపేట సీఐ డి.రమణమూర్తి, ఎస్ఐ జి.సురేష్, దండేపల్లి ఎస్ఐ తహసీనుద్దీన్ తదితర సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టారు.దర్యాప్తులో భాగంగా ూా-1 నుండి -6 వరకు నిందితులు




ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడ వెళ్లి అక్కడి నిందితులు ూా-13,ూా-14 వద్ద నుండి సుమారు రూ.6 లక్షల నకిలీ కరెన్సీ తీసుకుని లక్షెట్టిపేట ప్రాంతంలో చలామణి చేసేందుకు యత్నించినట్లు వెల్లడైంది.వెంటనే చర్యలు చేపట్టిన పోలీసులు నిందితులు ూా-1 నుండి ూా-12 వరకు అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుండి రూ.5,98,500 విలువైన నకిలీ కరెన్సీ నోట్లను స్వాధీనం చేసుకున్నారు. అదనంగా ఈ ముఠా ఉపయోగించిన మూడు కార్లను సీజ్ చేశారు. పరారీలో ఉన్న ూా-13 రాము, ూా-14 రవి (కాకినాడ) కోసం పోలీసులు గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారు. అంతర్రాష్ట్ర స్థాయిలో నకిలీ కరెన్సీ చలామణి చేస్తున్న ఈ ముఠాను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన లక్షెట్టిపేట సీఐ డి.రమణమూర్తి, ఎస్ఐ జి.సురేష్, ఎస్ఐ తహసీనుద్దీన్ మరియు పోలీస్ సిబ్బందిని ఏసీపీ, డీసీపీ అభినందించారు.

## ఆరెంద జడ్.పి.హెచ్.ఎస్ పాఠశాలలోం

# ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం...



మంథనిరూరల్//ఫిబ్రవరి 28 ఆకాంక్ష : మంథని మండలంలోని ఆరెంద జడ్.పి.హెచ్.ఎస్ పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో విద్యార్థులు రూపొందించిన వివిధ రకాల సైన్స్ నమూనాలు, పరికరాలతో ప్రత్యేక ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు పరమాణు నిర్మాణం, మానవ శరీర భాగాలు, విద్యుత్ వలయం, సహజ సూచికలు, సహజ ఆమ్లక్షార పరీక్షలు, రక్షిత మంచినీటి సరఫరా వంటి అంశాలపై నమూనాలను తయారు చేసి ప్రతి నమూనా ద్వారా శాస్త్రీయ అంశాలను సులభంగా అర్థమయ్యే విధంగా వివరణ ఇచ్చారు. పదవ తరగతి విద్యార్థిని ఆర్. అక్షిత మానవ శరీర భాగాలు, వాటి పేర్లు, పనితీరు, వాటికి సంక్రమించే వ్యాధులు, అవి సక్రమంగా పనిచేయకపోతే కలిగే నష్టాలపై స్పష్టంగా వివరించడం అందరినీ ఆకట్టుకుంది. ఆమె చేసిన వివరణ విద్యార్థుల్లో శాస్త్రంపై ఆసక్తిని మరింత పెంచింది. ప్రదర్శన ప్రారంభించిన అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఈదులపల్లి నరసింహారావు మాట్లాడుతూ... విద్యార్థులు ప్రతి విషయాన్ని క్షుణ్ణంగా గమనించడం, ప్రశ్నించడం నేర్చుకున్నప్పుడే వారిలో శాస్త్రీయ దృక్పథం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. శాస్త్ర విజ్ఞానం దినసరి జీవితంలో ఎంతో ఉపయోగకరమని చెప్పారు. ఈ సందర్భంగా సిఆర్పి మల్లన్న మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తార్కికంగా ఆలోచించే అలవాటు పెంపొందించుకోవాలని శాస్త్రం ద్వారా సమస్యలను విశ్లేషించే నైపుణ్యం పెరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు వి. సువార్త, ఏ. మమత, కే. శ్రీవాణి, పి. పద్మజ, జి. శ్రీలత, ఎండి. గియాసుద్దీన్ పాల్గొన్నారు.

## ఆపిల్ కిడ్స్ పాఠశాలలో ఘనంగా జాతీయ సైన్స్ డే వేడుకలు...



గోదావరిఖనిటౌన్//ఫిబ్రవరి 28 ఆకాంక్ష : గోదావరిఖని కళ్యాణ్ నగర్ లోని ఆపిల్ కిడ్స్ పాఠశాలలో శనివారం జాతీయ సైన్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల చిన్నారులు వివిధ రకాల పరిశోధాత్మక వైజ్ఞానిక ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు.విద్యార్థులు ప్రదర్శించిన సైన్స్ ప్రాజెక్టులు, మోడల్స్, ప్రయోగాల ద్వారా శాస్త్ర పట్ల చూపిన ఆసక్తి, అవగాహన కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి చిన్నారుల ప్రతిభను ప్రశంసించారు.మేయర్ స్వామి మాట్లాడుతూ, విద్యార్థులు శాస్త్ర సాంకేతిక పరిజ్ఞాన వైపే దృష్టి పెట్టి, సమాజంలో వస్తున్న ఆధునిక సాంకేతిక మార్పులకు అనుగుణంగా అవగాహన పెంపొందించుకోవాలని హితపరిష్కార సూచనలు ఇచ్చారు. అలాగే, మూఢ నమ్మకాల నుంచి దూరంగా ఉండి, భవిష్యత్తులో పాఠశాలలో నేర్చుకున్న విజ్ఞానాన్ని ఉపయోగించి సమాజంలో మంచి పేరు తెచ్చుకునేలా కృషి చేయాలని విద్యార్థులకు ఆహ్వానం పలికారు.పాఠశాల ప్రిన్సిపాల్ గాలి సునీత రవి అధ్యక్షతన జరిగిన ఈ వేడుకల్లో రామగుండం ట్రాఫిక్ సిఐ రాజేశ్వర్ రావు, ఎస్ఐ వీర శేఖర్, కార్పొరేటర్లు చిదురాల నాగరాజు, నాయకులు రాజేందర్, గాంధీ సార్, పాఠశాల ఇంచార్జ్‌లు అరుణ, ఫర్హాన, సుస్మిత, ఉపాధ్యాయులు, మరియు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొని ప్రోగ్రామ్ ని ఘనంగా పూర్తి చేశారు.విద్యార్థుల సృజనాత్మకత, ప్రయోగశీలత ఈ వేడుకల ద్వారా వెలుగులోకి వచ్చి, పాఠశాల పరిరక్షణలో విజ్ఞానానికి ఇచ్చే ప్రాముఖ్యతను సమాజానికి గుర్తు చేసింది.

## మార్చి 3న శ్రీ సోమేశ్వర ఆలయం ద్వారబంధనం....



జనగామ//ఫిబ్రవరి 28 ఆకాంక్ష : మండల కేంద్రంలోని ప్రముఖ శ్రీ సోమేశ్వర లక్ష్మి నరసింహ స్వామి దేవాలయంలో మార్చి 3వ తేదీని ప్రతి భక్తి గమనించాలి. చంద్రగ్రహణం సందర్భంగా ఆలయాన్ని ఆ రోజున ఉదయం 8 గంటలకు మూసివేయనున్నట్లు ఆలయ ఈవో భాగం లక్ష్మీ ప్రసన్న మరియు ప్రధాన అర్చకుడు దేవగిరి లక్ష్మన్న శనివారం ఒక ప్రకటనలో వెల్లడించారు.వారిని అనుసరించి, భక్తులు ఆ రోజు ఆలయానికి వెళ్లవద్దని, తిరిగి మార్చి 4వ తేదీ బుధవారం ఉదయం సంప్రోక్షణం అనంతరం మాత్రమే స్వామివారి దర్శనానికి అనుమతించబడతుందన్నారు.ఈ నేపథ్యంలో భక్తులు ఆలయ నియమాలను గౌరవిస్తూ, సమయానికి దర్శనం చేసుకోవాలని అధికారులు కోరారు.పాలకుర్తి ఆలయ అధికారులు ఈ సందర్భంగా భక్తుల సహకారానికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

## ఆర్టీసీ బస్సు,లారీ ఢీ, 15 మందికి తీవ్ర గాయాలు...



సంగారెడ్డి// ఫిబ్రవరి 28 ఆకాంక్ష : సంగారెడ్డి జిల్లాలోని సదాశివపేట బైపాస్ రోడ్డు వద్ద శనివారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. జహీరాబాద్ నుంచి సదాశివపేట బస్టాండ్ వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు, సదాశివపేట నుంచి జహీరాబాద్ వైపు వస్తున్న లారీతో ఢీ కొట్టింది. ఈ ఘటనలో బస్సులో ఉన్న మొత్తం 50 మంది ప్రయాణికుల్లో 15 మందికి తీవ్ర గాయాలు సంభవించాయి.ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం, ఢీ సమయంలో బస్సు ముందర భాగం పూర్తిగా క్షతగాత్రమైంది. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మరియు అంబులెన్స్ సిబ్బంది గాయపడ్డవారిని వెంటనే దగ్గరలోని ఆస్పత్రికి తరలించారు. గాయాల పరిస్థితిని పరిశీలించిన వైద్యులు, కొందరు పరిస్థితి గంభీరంగా ఉన్నందున అత్యవసర వైద్య చికిత్స అందిస్తున్నట్టు తెలిపారు. ప్రాంతంలో ట్రాఫిక్ కొంతసేపు నిలిచిపోవడంతో పోలీసులు మార్గదర్శనం చేసి రవాణా మళ్లీ ప్రారంభించారు. అధికారులు రోడ్డు ప్రమాదానికి కారణమై ఉంటుందనే అంశంపై పూర్తి పరిశీలనలు చేపట్టారు.ప్రయాణికులు రోడ్డు భద్రత నియమాలు పాటించాల్సిన అవసరాన్ని అథారిటీస్ అధికారులు ఈ సంఘటనతో మరింత హెచ్చరిస్తున్నారు.

## ఈపీ ఆపరేటర్ రామస్వామికి వీడ్కోలు...

### ఆయన సేవలను కొనియాడిన అధికారులు...




గోదావరిఖని//ఫిబ్రవరి 28 ఆకాంక్ష : సింగరేణి ఆర్జి-3 ఏరియా ఓసియం-1 గనిలో గత 37 సంవత్సరాలుగా విధులు నిర్వహించి, శనివారం ఉద్యోగ విరమణ చేసిన ఈపి ఆపరేటర్ బోగ రామస్వామిని గనిపై నిర్వహించిన కార్యక్రమంలో అధికారులు, కార్మికులు, యూనియన్ల ప్రతినిధులు, కుటుంబ సభ్యులు..పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించి జ్ఞాపికలు బహూకరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ రామస్వామి ఉన్నత విలువలు కలిగిన వ్యక్తి అని, తన వృత్తి నైపుణ్యం ద్వారా గనికే వన్నె తెచ్చిన అత్యుత్తమ కార్మికుడని అన్నారు. గని అధిక ఉత్పత్తి సాధించడంలో సింహభాగంలో కీలక భూమిక పోషించి, పలుమార్లు అత్యధిక ఇన్సెంటివ్ పొంది ఉత్తమ కార్మికుడిగా ఎన్నికై పలు అవార్డులు, రివార్డులు సాధించారని, ఉద్యోగులందరితో కలివిడిగా స్నేహపూర్వకంగా ఆత్మీయంగా ఉండేవారని కొనియాడారు. ఇంకా ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ అధికారి ప్రవీణ్ వి పాంటింగ్, మేనేజర్ పాపయ్య, యూనియన్ నాయకులు తిరుపతిరావు, తిరుపతి యాదవ్, అధికారుల సంఘం నాయకులు మధు, బొంకూరు మోహన్, సాయిస్వరూప్, అజయ్ కుమార్, సహచరులు పోతు శంకరయ్య, రఖీబ్, చంద్రపాల్, సాబిర్, ఆడెపు రాజయ్య, అబీద్, పినకాశి మొగిలి, ఖాజా మొహినుద్దీన్ తోపాటు, అధికారులు, కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని రామస్వామికి అభినందనలు తెలిపి వీడ్కోలు పలికారు.

# మంథని జిల్లాలో ఇన్నోవేషన్ ఎక్స్ పో 2026 ఘనంగా నిర్వహణ....



మంథని /ఫిబ్రవరి 28 ఆకాంక్ష : మంథని పట్టణంలో ఆదివారం రాష్ట్ర మంత్రి వర్యులు దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, ఇతర అధికారులు, ప్రజా ప్రతినిధులు సమక్షంలో టీ-వర్క్స్ ఆధ్వర్యంలో ఇన్నోవేషన్ ఎక్స్ పో 2026 ఘనంగా ప్రారంభించబడింది. మంథని బస్ డిపో ఎదురుగా ఏర్పాటు చేసిన ఈ ఎక్స్ పోలో యువత, విద్యార్థులు, శాస్త్రవేత్తలు, పరిశ్రమల ప్రతినిధులు పాలుపంచుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ, ప్రభుత్వ దృక్పథం ప్రకారం నూతన ఆవిష్కరణలకు ప్రతి విధమైన ప్రోత్సాహం అందించబడుతున్నందున, యువత సృజనాత్మకతను ప్రోత్సహించే కార్యక్రమాలు రాష్ట్రవ్యాప్తంగా మరింతగా పెంపొందించబడనున్నట్లు తెలిపారు. "డ్రీమ్, రైజ్, స్టార్ట్"నినాదంతో ఈ ఇన్నోవేషన్ ఎక్స్ పోను మంథని లో ప్రారంభించడం సంతోషకరమని మంత్రి చెప్పారు. మంథని లోని టీ-వర్క్స్ యూనిట్ బృందం కలెక్టర్ సహకారంతో ప్రభుత్వ పాఠశాలల్లో పర్యటన చేసి విద్యార్థులలో నూతన ఆవిష్కరణల పట్ల ఆసక్తిని పెంపొందిస్తున్నారని ఆయన వివరించారు. మంత్రి మాట్లాడుతూ, నూతన ఆవిష్కరణలు పెద్ద నగరాలకే పరిమితం కాకుండా గ్రామీణ ప్రాంతాల వరకు విస్తరించబడతాయని, టైర్ 2, టైర్ 3, రూరల్ ప్రాంతాల్లో ఐటీ, ఏఐ ఆధారిత రంగాల ప్రవేశం 2034 నాటికి తెలంగాణను ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దే దిశగా కీలకంగా ఉండనున్నట్లు చెప్పారు. పూర్వ రాష్ట్రపతి అబ్దుల్ కలాం సూచనను పరిశీలిస్తూ, పిల్లలు మంచి కలలు కనడానికి మరియు వాటిని సాధించడానికి చర్యలు ప్రారంభించాలని మంత్రి గుర్తుచేశారు.మంథని లోని యువతరు వ్యవసాయ పవర్ ఫీడర్, ఆధునిక హెల్మెట్, ఇతర వినూత్న ఆవిష్కరణల రూపకల్పనలో ముందుకు రావడం సంతోషంగా ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రతి ఆవిష్కరణ ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడానికి ఉపయోగ పడుతుందని మంత్రి తెలిపారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, 7 నెలల క్రితం మంథని లో ప్రారంభించిన టీ-వర్క్స్ యూనిట్ అనేక విద్యార్థులను నూతన ఆవిష్కరణలపై శ్రద్ధ చూపించేలా మారిందని పేర్కొన్నారు. జిల్లాలో 20 ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యేక తరగతులు నిర్వహించి ఏఐ ఆధారిత బోధనను ప్రవేశపెట్టినట్లు, తద్వారా విద్యార్థులలో కృత్రిమ మేధస్సు పై అవగాహన పెరిగిందని కలెక్టర్ తెలిపారు.ఇప్పటి నుంచి రాబోయే విద్యా సంవత్సరం నుండి జిల్లా వ్యాప్తంగా ప్రతి ప్రభుత్వ పాఠశాలలో ఏఐ బోధనను ప్రారంభించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నట్లు కలెక్టర్ వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇన్నోవేషన్ ప్రోత్సహించేందుకు ఎంఓయూ చేసుకునేందుకు ముందుకు వచ్చిన ప్రతిభావంతులకి కలెక్టర్ కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలకు ఉన్న రోజు వారి సమస్యలను పరిష్కరించడానికి నూతన ఆవిష్కరణలు ఉపయోగ పడాలని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో టీ-వర్క్స్ సీ.ఈ.ఓ. జోగేంద్ర, మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్, వైస్ చైర్మన్ సయేందర్ రెడ్డి, ఆర్.డి.ఓ. సురేష్, తహసిల్దార్ ఆరిపోద్దిన్, మున్సిపల్ కమిషనర్ మనోహర్, సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, అనేక మంది పాల్గొన్నారు. విద్యార్థులు, యువత, పరిశ్రమల ప్రతినిధులు నూతన ఆవిష్కరణల ప్రదర్శనలో పాల్గొని ప్రజలకు అవగాహన కల్పించారు.మంథని లోని ఇన్నోవేషన్ ఎక్స్ పో 2026 ద్వారా ప్రాంతీయ యువతలో సృజనాత్మకత, ఆవిష్కరణలకు ప్రేరణ ఏర్పడిందని స్థానికులు, అధికారులు అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమం మంథని పట్టణానికి మాత్రమే కాకుండా, దాని చుట్టుపక్కల గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు, యువత, వృత్తి నిపుణులకు కూడా ప్రేరణగా నిలిచింది. స్థానిక మీడియా, సామాజిక వర్గాల వారూ ఈ ఘనోత్సవాన్ని పెద్దగా ఆకర్షణగా పేర్కొన్నారు. మంథని లోని ఈ కార్యక్రమం, రాష్ట్ర స్థాయి ఐటీ, ఏఐ రంగ అభివృద్ధికి, యువతలో సృజనాత్మకత పెంపుదలకు, గ్రామీణ ప్రాంతాల్లో ఆవిష్కరణలను విస్తరించడానికి ఒక కీలక మలుపుగా గుర్తించబడింది. నూతన ఆవిష్కరణల ప్రదర్శన, విద్యార్థులు, యువకులు,పరిశ్రమల మధ్య నేరుగా అనుసంధానం ఏర్పడటంతో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల రంగం మరింత బలోపేతం కాబోతోంది.

## పరిశుభ్ర గ్రామం కోసం వినూత్న పోటీ...

### గూడెం లో నగదు బహుమతులు గెలుచుకున్న ఇంటి యజమానులకు సత్కారం...







ఓదెల//ఫిబ్రవరి 28 ఆకాంక్ష : గూడెం గ్రామాన్ని ఆదర్శవంతమైన, ఆరోగ్యకరమైన గ్రామంగా తీర్చిదిద్దేందుకు గ్రామ సర్పంచ్ చిట్ల రామ్ ఆధ్వర్యంలో పాలకవర్గం వినూత్న పోటీని ప్రారంభించింది. ఈ పోటీ ద్వారా గ్రామంలోని ప్రతి ఇంటిని పరిశీలించి, అత్యంత పరిశుభ్రంగా, పచ్చదనంతో మరియు క్రమశిక్షణతో నిర్వహించిన ఇంటి యజమానులను గుర్తించి ప్రోత్సాహక బహుమతులు అందజేయనున్నారు. పోటీ ప్రథమ బహుమతిగా ₹10,000, ద్వితీయ బహుమతిగా ₹5,000 నగదు విధించారు. ప్రతివేళా ఆగస్టు 15న, స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా, విజేతలకు ఈ బహుమతులు అందజేయబడతాయి. ఎంపికకు ప్రధాన ప్రమాణాలుగా ఇంటి ఆవరణ పరిశుభ్రంగా ఉంచడం, తడి చెత్తపొడి చెత్త వేరు చేయడం, ఇంటి ముందు మొక్కలు నాటడం, మురుగు నీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవడం వంటి అంశాలను నిర్ణయించారు.ఈ సందర్భంగా సర్పంచ్ చిట్ల రామ్, మాట్లాడుతూ.. "గ్రామ ప్రజలందరూ ఈ పోటీలో ఉత్సాహంగా పాల్గొని, గూడెం గ్రామాన్ని స్వచ్ఛ, సుందర గ్రామంగా తీర్చిదిద్దడంలో భాగస్వాములు కావాలని కోరుతున్నాం.ప్రతి ఇంటి పరిశుభ్రతలో గ్రామాభివృద్ధి దాగి ఉంది" అని అన్నారు.గ్రామ వాసులందరి ప్రతిభ, కృషి వల్ల గూడెం గ్రామం సుస్వచ్ఛ, పచ్చదనం నిండిన గ్రామంగా మారుతుందని సర్పంచ్ ఆశాభావం వ్యక్తం చేశారు.

## కేంద్ర బడ్జెట్ కార్మిక, రైతు వ్యతిరేకం...

### సవరణ అవసరం... వై.యాకయ్య



మంథని//ఫిబ్రవరి 28 ఆకాంక్ష : సిఐటియు రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మంథని ఫ్రెండ్స్ క్లబ్ హాల్లో శనివారం నిర్వహించిన "పట్టాలు తప్పిన బడ్జెట్ బండి" సదస్సులో కేంద్ర బడ్జెట్ పై తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. సదస్సుకు సిఐటియు జిల్లా అధ్యక్షులు వేల్పుల కుమారస్వామి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా రైతు సంఘం రాష్ట్ర నాయకులు వై.యాకయ్య, ప్రముఖ న్యాయవాది కే. రగోతంరెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మంద రాజేందర్, బూడిద గణేష్ హాజరై ప్రసంగించారు. సదస్సులో వై.యాకయ్య మాట్లాడుతూ, మధ్యకాలంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్మిక, కర్షకులకు వ్యతిరేకంగా ఉందని, కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా రూపొందించబడిందని అన్నారు. వ్యవసాయ రంగానికి తగినంత నిధులు కేటాయించలేదని, విద్య, వైద్య రంగానికి తక్కువ మద్దతు చూపిన బడ్జెట్ పేద రైతు, కార్మికులకు తీవ్రమైన అన్యాయం చేస్తున్నదని విమర్శించారు. వైద్య, విద్య, వ్యవసాయ రంగానికి రాయితీలు తక్కువగా కేటాయించగా, గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రద్దుచేసి కొత్తగా జిరాంజి పథకం ప్రవేశపెట్టారని చెప్పారు. ఈ పథకానికి 2 లక్షల 50 వేల కోట్లు కేటాయించాలని ప్రజాసంఘాల డిమాండ్ ఉన్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించడం లేదని, ఉపాధి హామీకి అనేక షరతులు విధించి పేదవర్గాలకు లబ్ధి చేరకపోవడం పేద రైతుల పరిస్థితిని మరింత కష్టతరం చేస్తున్నదని పేర్కొన్నారు.వై.యాకయ్య మార్చి నెలలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ప్రతి గ్రామంలో సమావేశాలు, ఆందోళన కార్యక్రమాలు నిర్వహించి జిరాంజి పథకం రద్దుకు గట్టిగా పాదయాత్రలు, పోరాటాలు చేపట్టనున్నట్టు హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు వేప చెట్టు రాజన్న, ఆర్ల సందీ, గొర్రెంకల సురేష్, బెజ్జంకి డిగంబర్, ననుబోతుల సత్యం మరియు అనేక కార్మిక, రైతు నాయకులు పాల్గొన్నారు.సదస్సు చివరా కేంద్ర బడ్జెట్‌ను పేదవర్గాల హక్కులకు అనుగుణంగా సవరించాలని, కార్మిక, రైతు హక్కులను పరిరక్షించేలా చర్యలు తీసుకోవాలని గట్టి డిమాండ్ ప్రకటించబడింది.

## వెలుగు మట్ల పేదల ఇళ్లు కూల్చివేయడం దుర్మార్గమైన చర్య...

### టిఆర్ఎస్(డి) పార్టీ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు నరాల సత్యనారాయణ...




హైదరాబాద్//ఫిబ్రవరి 28 ఆకాంక్ష : వెలుగు మట్ల ప్రాంతంలోని పేదల గృహాలను కూల్చివేయడాన్ని టిఆర్ఎస్(డి) పార్టీ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు నరాల సత్యనారాయణ దుర్మార్గమైన చర్యగా సత్యనారాయణ తెలిపారు, పేదలు ఆక్రమించిన 31 ఎకరాల భూమి విలువ 272 కోట్ల రూపాయలు. ఈ భూమిని ప్రభుత్వం అక్రమంగా స్వాధీనం చేసుకోవడాన్ని ఆయన ఖండించారు. మిగతా 275 ఎకరాల భూమి ఎవరి చేతిలో ఉందో, భవిష్యత్తులో పేదల భూమి విలువ పెరిగితే ప్రభుత్వం ఇలాగే తీసుకుంటుందా అని ప్రశ్నించారు. పేదలపై అక్రమ కేసులు పెట్టి వారిని భయపెడుతున్న చర్యలను కూడా తప్పుగా పేర్కొన్నారు. పేదల ఇళ్లపై చర్యలపై పూర్తి విచారణ జరపాలి, మిగిలిన భూదానోద్యమ భూమి వివరాలు ప్రజలకు అందించాలని సత్యనారాయణ తెలిపారు.అధికారులు ప్రజల హక్కులను రక్షించేందుకు తక్షణమే స్పందించాల్సిన అవసరం ఉందని అన్నారు.

## ఉపాధ్యాయులకు జీతాలు తగ్గించాలని నివేదిక ఏమిటి

### ప్రశ్నించిన కేంద్రమంత్రి బండి సంజయ్...



హైదరాబాద్//ఫిబ్రవరి 28 ఆకాంక్ష : రిటైర్ ఉద్యోగులకు బెనిఫిట్స్, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్ మెంట్ ఇవ్వలేని స్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని కేంద్రమంత్రి బండి సంజయ్ ఆరోపించారు. విద్యారంగంపై రిటైర్డ్ ఐఏఎస్ ఆఫీసర్ ఆకునూరి మురళి ఇచ్చిన నివేదిక అసంబద్ధంగా ఉందని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఎవరితోనూ చర్చించకుండా, క్షేత్రస్థాయిలో పరిశీలించకుండా నివేదిక ఇచ్చారని విమర్శించారు. ఉపాధ్యాయులకు జీతాలు తగ్గించాలని నివేదిక ఏమిటి? అని.. ఉపాధ్యాయులకు జీతాలు తగ్గిస్తే.. విద్యా వ్యవస్థ బాగుపడుతుందా అని బండి ప్రశ్నించారు. రాష్ట్రంలో విద్యాశాఖకు ప్రత్యేకంగా మంత్రి కూడా లేరని బండి సంజయ్ ఎద్దేవా చేశారు.

## భూభారతి కాదు.. అది భూదోపిడీ: హరీష్ రావు



జనగామ//ఫిబ్రవరి 28 ఆకాంక్ష : కాంగ్రెస్ నాయకులు, అధికారుల జేబులు నింపడానికే కొత్త భూభారతి పోర్టల్ స్కామ్ వెనుక ఉన్న పెద్ద తలకాయలను కాపాడేందుకే ఆపరేటర్ల అరెస్ట్ మరిన్ని కనుగొనండి క్రీడా ఈవెంట్ టిక్కెట్లు సినిమా సమీక్షలు ప్రకటన సేవలు ధరణిని రద్దు చేసి తెచ్చిన భూ భారతితో ప్రజల ఆస్తులకు రక్షణ కరువైంది ఈ కుంభకోణంపై తక్షణమే సిట్టింగ్ జడ్జితో లేదా సిట్ తో విచారణ జరిపించాలని మాజీ మంత్రి, బిఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు డిమాండ్ చేసారు కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో గొప్పగా చెప్పుకుంటూ తీసుకొచ్చిన భూ భారతి పోర్టల్ ఇప్పుడు అక్రమార్కులకు అడ్డాగా మారిందని మాజీ మంత్రి, బిఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు ధ్వజమెత్తారు. ధరణి మీద బురదజల్లి భూభారతి తెచ్చామని గొప్పలు చెప్పిన కాంగ్రెస్ నాయకులు.. ఇప్పుడు ఆ పోర్టల్‌లో జరుగుతున్న కుంభకోణంపై ఎందుకు నోరు మెదపడం లేదని నిలదీశారు. జనగామ బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో హరీష్ రావు మాట్లాడుతూ.. రెవెన్యూ వ్యవస్థను కాంగ్రెస్ ప్రభుత్వం ఏ రకంగా భ్రష్టు పట్టించిందో రైతులను ఎలా మోసం చేస్తోందో వివరించారు. ధరణి పోర్టల్‌లో లోపాలున్నాయంటూ పదే పదే విమర్శలు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఎన్ఐసి సాఫ్ట్‌వేర్ తో భూ భారతి తెచ్చామని గొప్పలు చెప్పిందని, కానీ ఆ పోర్టల్ ఇప్పుడు ఖజానాకు గండి కొడుతూ దళారులకు భూ హారతిగా మారిందని దుయ్యబట్టారు. వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్ల కోసం ప్రజలు పూర్తి డబ్బులు కడుతుంటే, భూ భారతి పోర్టల్ ఎడిటింగ్ ఆప్షన్ వాడుకుని కేవలం 10 శాతం మాత్రమే ప్రభుత్వానికి చెల్లించి, మిగతా 90 శాతం దళారులు జేబుల్లో వేసుకున్నారని విమర్శలు గుప్పించారు. 37 మండలాల్లో ఈ భూ భారతి కుంభకోణం దర్జాగా నడుస్తుంటే, కనీసం నిఘా వ్యవస్థలకు కూడా తెలియకపోవడం ఈ ప్రభుత్వ వైఫల్యమేనని చురకలంటించారు. విలేకరులు వార్తలు రాస్తే తప్ప ముఖ్యమంత్రికి, రెవెన్యూ మంత్రికి ఈ స్కామ్ గురించి సోయి లేదని, ఈ భారీ కుంభకోణం వెనుక అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులు, పెద్ద అధికారులు ఉన్నారని, వాళ్ల పేర్లు బయటకు రాకుండా కవర్ చేయడానికే నామమాత్రంగా ఆపరేటర్లను అరెస్ట్ చేసి కేసులు నీరుగారుస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రతిపక్ష నాయకులను ఇబ్బంది పెట్టడానికి కమీషన్ల మీద కమీషన్లు, సిట్ లు వేస్తున్న రేవంత్ రెడ్డి. ఈ భూ భారతి కుంభకోణంపై, ప్రభుత్వ ఖజానా లూటీపై సిట్ తో విచారణ ఎందుకు జరిపించడంలేదని ప్రశ్నించారు. దీనిపై వెంటనే సిట్ వేసి దోషులను కఠినంగా శిక్షించాలని, ఖజానాకు రావాల్సిన ప్రతి పైసా రాబట్టాలని డిమాండ్ చేశారు. పేలని బాంబులు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మొదలుకొని మండల స్థాయి అధికారుల వరకు అందరూ కలిసి నిషేధిత భూముల పేరుతో వసూళ్లకు పాల్పడుతున్నారని, లక్షల ఎకరాలను ఉద్దేశపూర్వకంగా నిషేధిత జాబితాలో పెట్టడం, వసూళ్లు కాగానే తీసేయడం ఈ ప్రభుత్వానికి నిత్యకృత్యంగా మారిందని, నేడు ఆ జాబితా కోటి ఎకరాలు దాటిందని, హైకోర్టు మొట్టికాయలు వేసినా ప్రభుత్వ తీరు మారడం లేదని ఎద్దేవా చేశారు. అసలు నిషేధిత జాబితాలో ఎన్ని భూములు పెట్టారో వెంటనే శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కెసిఆర్ హయాంలో 6 లక్షల 18 వేల మంది రైతులకు ఒక్క రూపాయి ఖర్చు లేకుండా ఉచితంగా సాదా బైనామాలు చేసి పాస్ బుక్ లు ఇచ్చారని, రెండో విడత కోసం 8 లక్షల 92 వేల మంది రైతులు దరఖాస్తు చేసుకున్నారని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక, గతంలో లేని విధంగా భూమి అమ్మిన వ్యక్తి బాండ్ పేపర్ పైన అఫిడవిట్ ఇవ్వాలని అనే కొత్త నిబంధన పెట్టి సాదా బైనామాకు ఉరితాడు బిగించారని హరీష్ రావు మండిపడ్డారు.

## ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్త దాడులు....

### దాడులను తిప్పికొడుతోన్న ఇరాన్..

### ఇరాన్‌లో నిలిచిపోయాయిమ మొబైల్, ఇంటర్నెట్ సేవలు...



న్యూఢిల్లీఫిబ్రవరి 28 ఆకాంక్ష : ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్త దాడులు చేస్తున్నాయి. ఈ దాడులను ఇరాన్ తిప్పికొడుతోంది. ఇరాన్ మిలటరీ స్థావరాలే లక్ష్యంగా ఇజ్రాయెల్, అమెరికా క్షిపణులు ప్రయోగించాయి. ఇరాన్ అధ్యక్షుడు ఖమేనీ భవనంపై రెండు దేశాలు దాడులకు పాల్పడ్డాయి. దాడులకు ముందే ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేని బంకర్ లోకి వెళ్లారు. ఖమేని ఇల్లు, హెడ్ క్వార్టర్స్, రక్షణశాఖ, ఇంటెలిజెన్స్ శాఖ ఆఫీసు సమీపంలో దాడులు జరిగాయి. లయన్స్ రోర్ పేరుతో ఇజ్రాయెల్ ఆపరేషన్ ప్రారంభించింది. ఇరాన్, ఇజ్రాయెల్ దేశాలలో గగనతలం మూసివేయడంతో విమానాలు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఇజ్రాయెల్ లో భారతీయులను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. భారత ప్రభుత్వం అడ్వైజరీ జారీ చేయడంతో పాటు హెల్ప్‌లైన్ నెంబర్లు ఏర్పాటు చేసింది. ఇరాన్‌లో మొబైల్, ఇంటర్నెట్ సేవలు నిలిచిపోయాయి. వేలాది మంది సైనికులు మరణించారని ఇరాన్ తెలిపింది. టెహ్రాన్, ఇస్ఫహాన్ సహా కీలక నగరాల్లో రెండు దేశాలు వైమానిక దాడులకు పాల్పడాయి. ఇరాన్ అటామిక్ ఎనర్జీ ఏజెన్సీ లక్ష్యంగా దాడులు చేస్తున్నారు. ఇస్ఫహాన్ లోనే న్యూక్లియర్ తయారీ కేంద్రాలపై దాడులు చేస్తుండడంతో ప్రతిదాడులకు ఇరాన్ సిద్ధమవుతుంది. ఇజ్రాయెల్ పై బాలిస్టిక్ మిస్సైళ్లతో ఇరాన్ దాడి చేసింది. ఇజ్రాయెల్ రాజధాని టెల్అవీవ్ పై ఇరాన్ విరుచుకుపడింది. 35కి పైగా మిస్సైళ్లను ఇరాన్ ప్రయోగించింది. అమెరికా, ఇజ్రాయెల్ దాడులపై ఇరాన్ స్పందించింది. యుద్ధం మీరు ప్రారంభించారు కానీ మేము ముగింపు పలుకుతామని హెచ్చరించింది. యుద్ధానికి ముగింపు ఊహించని రీతిలో ఉంటుందని ఘాటు విమర్శలు చేసింది.

## సమాజ రక్షణలో సుదీర్ఘ సేవలందించిన

# పోలీస్ అధికారులకు ఘన సత్కారం...



గోదావరిఖని,ఫిబ్రవరి 28 **ఆకాంక్ష :** సమాజ రక్షణలో సుదీర్ఘకాలం సేవలందించి పదవీ విరమణ పొందిన పోలీస్ అధికారులకు రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో ఘన సత్కారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అంబర్ కిషోర్ ఝా మాట్లాడుతూ, తమ కుటుంబ క్షేమం కన్నా సమాజ క్షేమం కోసం నిరంతరం విధులు నిర్వర్తించేది పోలీసులు మాత్రమేనని కొనియాడారు. ఉద్యోగ విరమణ అనంతరం ఇకనుంచి కుటుంబ సభ్యులతో ఎక్కువ సమయం గడపాలని సూచించారు.రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన ఈ సత్కార కార్యక్రమంలో, విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచి పదవీ విరమణ పొందిన ఎస్సై నక్క శామ్యూల్ పాల్ (సీసీఎస్ మంచిర్యాల), ఎస్సై నూనే శ్రీనివాస్ (మందమర్రి), ఏఎస్ఐ హెచ్ వెంకటేష్ బాబు (గోదావరిఖని వన్ టౌన్), ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ ఎండి అలీముద్దీన్ (సిఏఆర్ రామగుండం), హెడ్ కానిస్టేబుల్ ఎం విజేందర్ రెడ్డి (జూలపల్లి)లను పూలమాలలతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, పోలీస్ ఉద్యోగం అంటే కేవలం విధి నిర్వహణ మాత్రమే కాకుండా, సమాజ శాంతిభద్రతల పరిరక్షణకు నిరంతర కృషి అవసరమని అన్నారు. విధి నిర్వహణలో ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొంటూ, కొన్నిసార్లు ప్రాణాలకూ తెగించి సేవలందించిన పోలీస్ సిబ్బంది సేవలు సమాజం ఎప్పటికీ మర్చిపోదని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ (అడ్మిన్) శ్రీనివాస్, ఏఓ శ్రీనివాస్, ఇన్స్పెక్టర్ రాజేంద్ర ప్రసాద్, ఆర్ఐలు శేఖర్, మల్లేశం, రామగుండం పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడు బోర్లకుంట పోచలింగం, పదవీ విరమణ పొందిన పోలీస్ అధికారుల కుటుంబ సభ్యులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా నాగర్‌కర్నూల్ జిల్లాలో జాతీయ సైన్స్ దినోత్సవం...




నాగర్‌కర్నూల్ టౌన్//ఫిబ్రవరి 28 **ఆకాంక్ష :** నాగర్‌కర్నూల్ జిల్లాలోని బిజినేపల్లి మండల పరిధిలోని పాలెం గ్రామంలోని శ్రీ గాయత్రి పాఠశాలలో శనివారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి కార్యక్రమాన్ని ప్రారంభించగా పాఠశాల ప్రాంగణం శాస్త్రీయ నమూనాలు, చిత్రపటాలతో కళకళలాడింది.ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ మహమ్మద్ రఫీ మాట్లాడుతూ శాస్త్ర విజ్ఞానం దేశాభివృద్ధికి కీలకమని, విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించడమే ఈ దినోత్సవం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. సైన్స్ కేవలం



పాఠ్యపుస్తకాలకే పరిమితం కాదని, ప్రయోగాలు, పరిశోధనల ద్వారా కొత్త ఆవిష్కరణలు సాధ్యమవుతాయని వివరించారు.కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు సైన్స్ ఫెయిర్ నిర్వహించి తమ రూపొందించిన ఆకర్షణీయ నమూనాలు, చిత్రపటాలను ప్రదర్శించారు. గ్రామీణ జీవనానికి ఉపయోగపడే ఆవిష్కరణలు, పర్యావరణ పరిరక్షణ, పునర్వినియోగ శక్తి వనరులపై చేసిన ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు విద్యార్థుల ప్రతిభను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది, గ్రామస్థులు పాల్గొని విజయవంతం చేశారు.

## బిజినాపల్లిలో జాతీయ సైన్స్ దినోత్సవం ఎగ్జిబిషన్...



నాగర్ కర్నూల్ టౌన్//ఫిబ్రవరి 28 **ఆకాంక్ష :** నాగర్ కర్నూల్ జిల్లాలోని బిజినాపల్లి మండల కేంద్రంలో శనివారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల స్థాయిలో సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. సోషల్ రెస్పాన్సిబిలిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మండలంలోని నాలుగు కాంప్లెక్స్‌ల పరిధిలోని జిల్లా పరిషత్, ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలల విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించారు.విద్యార్థులు రూపొందించిన వివిధ శాస్త్రీయ ప్రయోగాలు, నమూనాలు ఆకట్టుకున్నాయి. ఈ ప్రదర్శనను జిల్లా విద్యాధికారి రమేష్ కుమార్, మండల విద్యాధికారి రఘునందన్ శర్మ పరిశీలించి విద్యార్థులను అభినందించారు. విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు అవసరమని వారు సూచించారు.ఈ సందర్భంగా సోషల్ రెస్పాన్సిబిలిటీ అసోసియేషన్ అధ్యక్షుడు లక్ష్మణ్, ఉపాధ్యక్షుడు రమేష్ మాట్లాడుతూ మండల స్థాయిలో ఈ ఎగ్జిబిషన్ విజయవంతం కావడానికి సహకరించిన జిల్లా, మండల విద్యాధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, స్థానికులు పాల్గొన్నారు.

## మూఢనమ్మకాల నిర్మూలనకు శాస్త్రీయ విజ్ఞానం కీలకం...

### ప్రిజం పాఠశాలలో సైన్స్ దినోత్సవం సందర్భంగా విజ్ఞాన ప్రదర్శనలు ఘనంగా నిర్వహణ....



నాగర్ కర్నూల్//ఫిబ్రవరి 28 **ఆకాంక్ష :** నేటి సమాజంలో పెరుగుతున్న మూఢనమ్మకాలను పారదోలడానికి శాస్త్రీయ పరిజ్ఞానం అత్యంత అవసరమని ప్రిజం పాఠశాల ప్రిన్సిపాల్ టి. నిరంజన్ పేర్కొన్నారు. సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని ప్రిజం పాఠశాలలో శనివారం విజ్ఞాన ప్రదర్శనలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించేందుకు, వారి సృజనాత్మకతను వెలికి తీయడానికి వ్యక్తిగతంగా మరియు బృందాలుగా మొత్తం 55 విజ్ఞాన నమూనాలను ప్రదర్శించినట్లు తెలిపారు. విద్యార్థులు రూపొందించిన ప్రయోగాలు, నమూనాలు, ఆవిష్కరణలు అందరినీ ఆకట్టుకున్నాయి. విజ్ఞాన ప్రదర్శనలో భాగంగా విద్యార్థులు శాస్త్రీయ సిద్ధాంతాలను స్పష్టంగా వివరించడం విశేషంగా నిలిచింది.ఈ ప్రదర్శనను పాఠశాల విద్యార్థులు ఆసక్తిగా పరిశీలించి వివిధ నమూనాలపై అవగాహన పెంచుకున్నారు. విజ్ఞాన ప్రదర్శనల ద్వారా సమాజంలో ఉన్న మూఢనమ్మకాలపై అవగాహన పెంపొందించుకోవడం, శాస్త్రీయ ఆలోచనలను ఆచరణలోకి తీసుకురావడం ముఖ్యమని ఉపాధ్యాయులు సూచించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ కృష్ణయ్య, వైస్ ప్రిన్సిపాల్ దేవేందర్, ఉపాధ్యాయులు భరత్, వసంత, రాజు, యాదగిరిరావు, సుస్మిత, రామకృష్ణ, సురేష్, పవన్, బలింద్ర నాయక్, సలీం, రామచందర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే పాఠశాల విద్యార్థులు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



## ఉద్యమకారుల కృతజ్ఞత సభకు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుకు ఆహ్వానం...



ఓదెల/ఫిబ్రవరి 28 **ఆకాంక్ష :** తెలంగాణ రాష్ట్ర మంత్రివర్యులు, మంథని శాసనసభ్యులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు ను తెలంగాణ ఉద్యమకారుల ఫోరం పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు గుండేటి ఐలయ్య యాదవ్ శనివారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా మార్చి 1న కరీంనగర్‌లో నిర్వహించనున్న తెలంగాణ ఉద్యమకారుల కృతజ్ఞత సభకు హాజరుకావాలని ఆయనను ఆహ్వానించారు.ఈ సందర్భంగా గుండేటి ఐలయ్య యాదవ్ మీడియాతో మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిన ఉద్యమకారుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, ఉద్యమకారులకు సముచిత గౌరవం, గుర్తింపు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి, వారి కుటుంబాల భద్రత, భవిష్యత్తు కోసం పటిష్ట చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరినట్లు తెలిపారు.దీనికి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సానుకూలంగా స్పందిస్తూ, ఉద్యమకారుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, రాబోయే అసెంబ్లీ సమావేశాలలో ఈ అంశంపై చర్చించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో కందుల సదాశివ, చంద్రకళ, బత్తుల శంకర్, నూనె రాజేశం, సుధాకర్, సురేష్ తదితర తెలంగాణ ఉద్యమకారులు పాల్గొన్నారు.౦

# డిఫెన్సివ్ డ్రైవింగ్‌తో ప్రమాదాలకు అడ్డుకట్ట...

### సురక్షిత ప్రయాణానికి మార్గం ప్రాణం విలువైనది

### రోడ్డు భద్రత నియమాలు తప్పనిసరి....

### రామగుండం కమిషనర్ అంబర్ కిషోర్ ఝా...

గోదావరిఖని//ఫిబ్రవరి 28 **ఆకాంక్ష :** రాష్ట్ర ప్రభుత్వం, డీజీపీ ఆదేశాల మేరకు రోడ్డు ప్రమాదాలను నిర్మూలించాలనే లక్ష్యంతో నిర్వహిస్తున్న "అరైవ్ అలైవ్" రెండో విడత కార్యక్రమంలో భాగంగా గోదావరిఖనిలో రహదారి భద్రతపై విస్తృత అవగాహన సదస్సు నిర్వహించారు. గోదావరిఖని వన్‌టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి ఆధ్వర్యంలో, ట్రాఫిక్ పోలీసుల సహకారంతో సింగరేణి విటిసి కేంద్రంలో ఈ కార్యక్రమం జరిగింది.ఈ అవగాహన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝాకు ట్రాఫిక్ ఏసీపీ సి.హెచ్. శ్రీనివాస్, గోదావరిఖని వన్‌టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి, రామగుండం ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ రాజేశ్వరరావు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రోడ్డు భద్రతపై ప్రజల్లో, ముఖ్యంగా యువత మరియు డ్రైవర్లలో అవగాహన పెంపొందించేందుకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ట్రాఫిక్ నియమాలను ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడం పోలీసుల బాధ్యత అయినప్పటికీ, శాశ్వత మార్పు రావాలంటే ప్రతి వాహన దారుడు తన మనసులోనే నియమాలను పాటించాలనే



సంకల్పం చేసుకోవాలని సూచించారు.డిఫెన్సివ్ డ్రైవింగ్ అలవాటు చేసుకుని జాగ్రత్తగా వాహనం నడిపితే సుమారు 80 శాతం వరకు ప్రమాదాలను నివారించవచ్చని ఆయన స్పష్టం చేశారు. తాగి వాహనం నడపడం చిన్న తప్పు కాదని, అది తమ కుటుంబానికే కాక ఇతర కుటుంబాలకు కూడా అపార నష్టం కలిగించవచ్చని హెచ్చరించారు.ప్రాణం కంటే విలువైనది ఏదీ లేదని, ప్రాణం ఉంటేనే అన్నీ సాధ్యమని కమిషనర్ పేర్కొన్నారు. రహదారి భద్రతా నియమాలను కచ్చితంగా పాటించడం ద్వారా ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు. ప్రమాదంలో తప్పు ఎవరిదన్నది కంటే, దాని వల్ల రెండు కుటుంబాలు ఇబ్బందులు పడతాయని గుర్తుంచుకోవాలని సూచించారు.సమాజంలో ప్రతి ఒక్కరూ చైతన్యంతో ముందుకు వచ్చి రోడ్డు ప్రమాదాల నివారణలో



భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు తమ కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు మరియు సహోద్యోగులకు రహదారి భద్రతపై చైతన్యం కల్పించాలని, సోషల్ మీడియా లేదా వ్యక్తిగత సంభాషణల ద్వారా ఈ సందేశాన్ని విస్తరించాలని కోరారు.హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగం తప్పనిసరిగా పాటించాలని, ట్రాఫిక్ నియమాలను గౌరవించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో రామగుండం ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్, గోదావరిఖని వన్‌టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి, రామగుండం ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ రాజేశ్వరరావు, రోడ్ సేఫ్టీ పెద్దపల్లి జోన్ ఇన్‌చార్జ్ ఇన్స్పెక్టర్ రమేష్‌బాబు,గోదావరిఖని వన్‌టౌన్ ఎస్ఐ మనోహర్, ట్రాఫిక్ ఎస్ఐ హరీష్ శేఖర్, విటిసి ప్రిన్సిపల్, సిబ్బంది, ఆటో డ్రైవర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

## నాగర్‌కర్నూల్ జిల్లాలో బీసీ కమిషన్ జోక్యం...

### బాధిత కుటుంబానికి భద్రత, వైద్య సదుపాయాలు కల్పించాలని డీజీపీకి లేఖ...

నాగర్‌కర్నూల్/ఫిబ్రవరి 28 **ఆకాంక్ష :** నాగర్‌కర్నూల్ జిల్లా కొమ్మెర గ్రామంలో ఈ నెల 18న చోటుచేసుకున్న విషాద ఘటనపై తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ స్పందించింది. బాధిత కుటుంబానికి భద్రతతో పాటు అవసరమైన వైద్య సదుపాయాలు కల్పించాలని కమిషన్ చైర్మన్ జి. నిరంజన్ రాష్ట్ర డీజీపీ బి. శివధర్ రెడ్డి కు లేఖ రాశారు.ఘటనలో మరణించిన రెండు నెలల పాప తల్లి మౌనిక ప్రస్తుతం బాలింతగా ఉండటంతో ఆమెకు విశ్రాంతి అవసరమని, తగిన వైద్య పరీక్షలు నిర్వహించేందుకు అవసరమైన సదుపాయాలు కల్పించాలని లేఖలో పేర్కొన్నారు. అలాగే పాపను పూడ్చిన సమాధికి ఎటువంటి భంగం కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని కూడా కోరారు.ఈ ఘటనపై న్యాయం కోరుతూ అనేక బీసీ సంఘాల నుండి కమిషన్‌కు విజ్ఞప్తులు అందినట్లు చైర్మన్ తెలిపారు. ఆ విజ్ఞప్తుల మేరకు ఈ నెల 24న కమిషన్ బృందం కొమ్మెర గ్రామానికి చేరుకొని జాతర జరిగిన ప్రాంతాన్ని పరిశీలించింది. జిల్లా కలెక్టర్, సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ సమక్షంలో ఘటనకు సంబంధించిన వివరాలను సేకరించారు.కమిషన్ సభ్యులు రాపోలు జయప్రకాశ్, తిరుమలగిరి సురేందర్, శ్రీమతి బాలలక్ష్మి రంగుతో కలిసి చైర్మన్ నిరంజన్ పాప సమాధి వద్దకు వెళ్లి శ్రద్ధాంజలి ఘటించారు. రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని వారి నివాసంలో కలుసుకొని శిథిలావస్థలో ఉన్న ఇంటిని పరిశీలించారు.పలు ప్రజా సంఘాల ప్రతినిధులు సంఘటన వివరాలను కమిషన్ దృష్టికి తీసుకువచ్చినట్లు పేర్కొన్నారు. మరణించిన పాప తండ్రి గణేష్, తల్లి మౌనిక, నాయనమ్మ చంద్రకళలతో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సుమారు 45 నిమిషాల పాటు మాట్లాడి వారి వేదనను తెలుసుకున్నామని డీజీపీకి రాసిన లేఖలో చైర్మన్ వివరించారు.ఈ ఘటనకు సంబంధించిన తదుపరి పరిణామాలను బీసీ కమిషన్ నిశితంగా పరిశీలిస్తున్నట్లు, బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చర్యలు కొనసాగుతాయని కమిషన్ స్పష్టం చేసింది.

## మిర్యాలగూడలో రంజాన్ కిట్ల పంపిణీ...

### డాక్టర్ ముస్తాక్ అహ్మద్ సేవలు అద్వితీయం...



మిర్యాలగూడ//ఫిబ్రవరి 28 **ఆకాంక్ష :** మిర్యాలగూడ పట్టణానికి చెందిన ప్రముఖ చర్మ వ్యాధుల నిపుణుడు డాక్టర్ ముస్తాక్ అహ్మద్ అందిస్తున్న సేవలు అద్వితీయమని నల్లగొండ జిల్లా ప్రఖ్యాత సోషల్ సర్వీస్ ఆర్గనైజర్, హ్యూమన్ రైట్స్ డిఫెండర్ హమీద్ షేక్ కొనియాడారు. పవిత్ర రంజాన్ పండుగ సందర్భంగా పలు ముస్లిం కుటుంబాలకు రంజాన్ కిట్లను పంపిణీ చేయడానికి డాక్టర్ ముస్తాక్ అహ్మద్ ముందుకు రావడం ప్రశంసనీయమని తెలిపారు.శనివారం మిర్యాలగూడ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన రంజాన్ కిట్ల పంపిణీ కార్యక్రమంలో హమీద్ షేక్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పవిత్ర రంజాన్ మాసంలో మానవతా దృక్పథంతో పేద ముస్లిం కుటుంబాలకు ప్రతి సంవత్సరం రంజాన్ కిట్లను అందజేస్తున్న డాక్టర్ ముస్తాక్ అహ్మద్ సేవలు స్ఫూర్తిదాయకమని అభినందించారు. సమాజ సేవలో ఆయన చూపిస్తున్న చొరవ ఇతరులకు ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు.ముస్లిం సోదర సోదరీమణులు రంజాన్ ఉపవాస దీక్షలను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని, ప్రతి ఒక్కరిపై అల్లా అనుగ్రహం ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మసూద్, ముజీబ్ రెహ్మాన్, నజీర్, బాబా, జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.



## నాగర్ కర్నూల్ జిల్లాలో నిశ్చితార్థ వేడుకకు ఎమ్మెల్యే హాజరు...



నాగర్ కర్నూల్ టౌన్//ఫిబ్రవరి 28 **ఆకాంక్ష :** నాగర్ కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలంలోని వసురం తండా గ్రామంలో సర్పంచ్ విజయ దీప్లా కుమార్తె నిశ్చితార్థ వేడుక శనివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుల్ల రాజేష్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై వధూవరులను ఆశీర్వదించారు.గ్రామ పెద్దలు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. అనంతరం వధూవరులకు పూలమాలలు అందజేసి ఆశీర్వచనాలు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కుటుంబ బంధాలు సమాజానికి బలమైన పునాదిగా నిలుస్తాయని, పెళ్లిళ్లు రెండు కుటుంబాల మధ్య ప్రేమ, విశ్వాసాలకు సంకేతమని పేర్కొన్నారు. సర్పంచ్ విజయ దీప్లా గ్రామ అభివృద్ధికి కృషి చేస్తున్న నాయకురాలని ప్రశంసించారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు మిద్దె రాములు, డీసీసీబీ ఉపాధ్యక్షులు ముక్తార్, మాజీ సర్పంచ్ తిరుపతయ్య, హరీశ్వర్ రెడ్డి, రాజేందర్ రెడ్డి, కత్తె ఈశ్వర్, సర్పంచ్ రామ్ చందర్ నాయక్, రాము నాయక్, జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రమణ తదితరులు పాల్గొన్నారు. గ్రామ ప్రజలు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో హాజరై శుభకార్యాన్ని సందడిగా జరిపారు.

## పెద్దపల్లి జిల్లాలో అక్రమ ఇటుక బట్టీలపై చర్యలు....

### రాఘవాపూర్‌లో రెండు బ్రిక్స్ యూనిట్లు సీజ్...



పెద్దపల్లిటౌన్/ఫిబ్రవరి 28 **ఆకాంక్ష :** పెద్దపల్లి మండలం రాఘవాపూర్ గ్రామ శివారులో నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న రెండు ఇటుక బట్టీలపై రెవెన్యూ అధికారులు కఠిన చర్యలు చేపట్టారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం నిర్వహించిన తనిఖీల్లో వీ/గా మీదీ బ్రిక్స్ మరియు ఎదీజ బ్రిక్స్ పేరుతో నడుస్తున్న ఇటుక బట్టీలను సీజ్ చేశారు.మండల పరిధిలోని ఈ ఇటుక బట్టీలపై ఇటీవల స్థానికుల నుంచి ఫిర్యాదులు రావడంతో అధికారులు విచారణ చేపట్టారు. తనిఖీల్లో కనీస మౌలిక వసతులు కల్పించకపోవడం, ప్రభుత్వ నిబంధనలను బేఖాతరు చేస్తూ వ్యాపారాలు కొనసాగించడం, అవసరమైన అనుమతులు మరియు ధ్రువపత్రాలు లేకుండానే కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు బయటపడింది. దీంతో జిల్లా పరిపాలన వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించడంతో రెవెన్యూ శాఖ అధికారులు రంగంలోకి దిగారు.ఈ సందర్భంగా పెద్దపల్లి ఆర్ఐ శ్రీనివాస్, జీపీఓ మరియు ఇతర సంబంధిత రెవెన్యూ అధికారులు బట్టీల వద్దకు చేరుకుని పూర్తిస్థాయిలో పరిశీలించారు. అనంతరం నిబంధనల ఉల్లంఘనలకు పాల్పడినట్టు నిర్ధారణ కావడంతో అక్కడికక్కడే రెండు ఇటుక బట్టీలను సీజ్ చేసి, అవసరమైన చట్టపరమైన చర్యలు ప్రారంభించారు.అక్రమంగా, అనుమతులు లేకుండా ఇటుక బట్టీలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని తహశీల్దార్ ఈ సందర్భంగా హెచ్చరించారు. భవిష్యత్తులో ఇలాంటి అక్రమ కార్యకలాపాలు కొనసాగితే మరింత కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ తనిఖీల్లో రెవెన్యూ సిబ్బంది, స్థానిక అధికారులు పాల్గొన్నారు.

## బొగ్గు గని కార్మికులకు మెరుగైన సేవలు...

### సీఎంపీఎఫ్ ట్రస్టీ బోర్డు సభ్యుడు కొత్త కాపు లక్ష్మారెడ్డి....




గోదావరిఖని//ఫిబ్రవరి 28 **ఆకాంక్ష :** బొగ్గు గని కార్మికుల సంక్షేమం కోసం కోల్ మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ ద్వారా మెరుగైన సేవలను అమలు చేస్తున్నామని సీఎంపీఎఫ్ ట్రస్టీ బోర్డు సభ్యుడు, బొగ్గు పరిశ్రమల ఇంచార్జ్ కొత్త కాపు లక్ష్మారెడ్డి పేర్కొన్నారు.విశ్వహిందూ పరిషత్ పవన్ మార్కండేయ కాలనీలో కోల్ మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ రీజనల్ కమిషనర్‌గా పనిచేసిన హరి పచౌరి పదవీ విరమణ సందర్భంగా నిర్వహించిన సన్మాన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేశవ్యాప్తంగా ఉన్న బొగ్గు



గని కార్మికులకు మెరుగైన సేవలు అందించేందుకు సీఎంపీఎఫ్ ట్రస్టీ బోర్డు కీలక నిర్ణయాలు తీసుకుంటోందని, ఆన్‌లైన్ విధానంలో కార్మికులు తమ భవిష్యనిధిని స్వయంగా చూసుకునే విధంగా సదుపాయం కల్పించినట్లు తెలిపారు. ఈ విధానం పారదర్శకతకు దోహదపడటమే కాకుండా ప్రతి రూపాయి లెక్కలను కుటుంబ సభ్యులు కూడా తెలుసుకునేలా రూపొందించామని పేర్కొన్నారు. భారతీయ మజ్దూర్ సంఘ్ కార్మికుల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తోందని, పదవీ విరమణ పొందిన కార్మికులకు ప్రతినెలా సరైన సమయంలో పెన్షన్ అందేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం త్వరలోనే ప్రత్యేక ఆన్‌లైన్ పోర్టల్ ఏర్పాటు చేయాలని యోచిస్తున్నట్లు వెల్లడించారు.కార్యక్రమంలో హరి పచౌరి సేవలను కొనియాడుతూ సింగరేణి పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్ బిఎంఎస్, సింగరేణి కోల్ మైన్స్ కాంట్రాక్ట్ మజ్దూర్ సంఘ్ బిఎంఎస్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.ఈ సమావేశంలో సింగరేణి పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు పులి రాజారెడ్డి, మంద రమాకాంత్, వీరమనేని రవీందర్ రావు, విజయగిరి వెంకటేశ్వర్లు, సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్ బిఎంఎస్ అధ్యక్షులు యాదగిరి సత్తయ్య, ప్రధాన కార్యదర్శి యతిపతి సారంగపాణి, కేంద్ర ఉపాధ్యక్షులు కారంపూడి శ్రీనివాసరాజు, కేంద్ర కార్యదర్శి మాదాసి రవీందర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే కాంట్రాక్ట్ మజ్దూర్ సంఘ్ బిఎంఎస్ ప్రధాన కార్యదర్శి పొన్నమనేని వేణుగోపాలరావు, దాసరి శ్రీనివాస్, చెన్నూరి రమేష్, బండారి శ్యాంసుందర్, సాయి కుమార్, వంశీకృష్ణ, మహిళా ప్రతినిధులు రాణి, రజిత, లక్ష్మి, సురేఖ, మమత, ఈర్ల కనక లక్ష్మి తదితరులు హాజరయ్యారు.

## రాజన్న సిరిసిల్ల జిల్లాలో యువకుడిపై దారుణ దాడి...

### హత్యాయత్నం, ఎస్సీ/ఎస్టీ కేసులు నమోదు...

రాజన్న సిరిసిల్ల//ఫిబ్రవరి 28 **ఆకాంక్ష :** రాజన్న సిరిసిల్ల జిల్లాలోని సిరిసిల్ల పట్టణ పరిధిలో యువకుడిపై విచక్షణ రహితంగా దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడిన ఘటన కలకలం రేపింది. ఈ ఘటనపై పోలీసులు అటెంప్ట్ మర్డర్ మరియు ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. సిరిసిల్ల టౌన్ ఇన్స్పెక్టర్ కే. కృష్ణ వివరాల ప్రకారండ ఫిబ్రవరి 27 అర్ధరాత్రి సమయంలో సిరిసిల్ల పట్టణంలోని బి.వై. నగర్‌లో గల జెండా గద్దె వద్ద ఆకునూరి కళ్యాణ్ (26), తండ్రి మోహన్, ఎస్సీ మాదిగ, అంబేద్కర్ నగర్ నివాసి తన స్నేహితులతో జరిగిన గొడవలో లక్ష్యంగా మారాడు. గొడవ తీవ్రరూపం దాల్చడంతో దుండగులు కళ్యాణ్‌ను కులం పేరుతో దూషిస్తూ చేతులతో కొట్టడం, కాళ్లతో తన్నడం మాత్రమే కాకుండా బండరాళ్లతో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డారు.తన కుమారుడిపై జరిగిన దాడి విషయమై బాధితుడి తల్లి ఆకునూరి పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు వెంటనే స్పందించి కేసు నమోదు చేశారు. బాధితుడిని చికిత్స కోసం ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం.ఈ ఘటనలో పాల్పడిన ప్రతి ఒక్కరిపై కఠిన చర్యలు తీసుకుంటామని సిరిసిల్ల టౌన్ ఇన్స్పెక్టర్ కే. కృష్ణ స్పష్టం చేశారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్ష ఉండదని హెచ్చరించారు. జిల్లాలో శాంతి భద్రతలను భంగం కలిగించే చర్యలను సహించబోమని పోలీసులు తెలిపారు.ఈ ఘటనతో స్థానికంగా ఉద్రిక్తత నెలకొనగా, పోలీసులు ప్రాంతంలో భద్రతా చర్యలను కట్టుదిట్టం చేశారు.

## ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం నిర్వహణ...



నాగర్ కర్నూల్ టౌన్//ఫిబ్రవరి 28 **ఆకాంక్ష :** నాగర్ కర్నూల్ జిల్లా బిజినాపల్లి మండలంలోని గంగారం పరిధిలోని ఉన్నత పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు రాజప్ప, మహమ్మద్, అశోక్ కుమార్, కోములయ్య, రాములు ఆధ్వర్యంలో విద్యార్థులకు సి.వి.రామన్ జీవిత వైజ్ఞానిక స్ఫూర్తిని తెలియజేశారు. భారత శాస్త్రవేత్త సి.వి. రామన్ (చంద్రశేఖర్ వెంకటరామన్) 1930లో రామన్ ఎఫెక్ట్ కనుగొని 1954లో భారతరత్న, తర్వాత లెనిన్ శాంతి బహుమతి, బ్రిటీష్ ప్రభుత్వం నైట్ హుడ్ బిరుదుతో సత్కరించబడిన మహోన్నతుడు. సముద్రం, ఆకాశం, నక్షత్రాల రంగు, రాత్రి జ్యోతి పరిశీలన వంటి శాస్త్రీయ ప్రయోగాలతో ప్రపంచంలో భారత కీర్తిని ప్రతిష్టింపజేశారు.విద్యార్థులు సృజనాత్మకంగా ఆలోచిస్తూ, శాస్త్ర సాంకేతిక రంగాల్లో దేశ ప్రతిష్టను వృద్ధి చేయాలని ఉపాధ్యాయులు సూచించారు.

# మంత్రి మీటింగ్‌కు రాబోనని సందేశం పంపిన ఐఏఎస్ అధికారి...

## మంత్రి సమావేశాలకు గైర్హాజరైన ఐఏఎస్ అధికారి సస్పెండ్





ముంబై//ఫిబ్రవరి 28 (ఆకాంక్ష) : మహారాష్ట్ర రాజకీయ వర్గాలు, అధికార యంత్రాంగంలో కలకలం రేపిన సంఘటన చోటుచేసుకుంది. మంత్రి ఏర్పాటు చేసిన కీలక సమావేశాలకు హాజరుకాకపోవడమే కాకుండా తాను మీటింగ్‌కు రాబోనని సందేశం పంపిన ఐఏఎస్ అధికారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంది. ఈ ఘటనపై రాష్ట్ర శాసనసభలో తీవ్ర చర్చ సాగగా, సంబంధిత అధికారులను సస్పెండ్ చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.ఫిబ్రవరి 26న మహారాష్ట్ర అసెంబ్లీలో చంద్రపూర్ జిల్లా కాలుష్య పరిస్థితులపై చర్చ జరిగింది. ఈ అంశంపై సమగ్ర వివరణ ఇవ్వాలని సభ రాష్ట్ర పర్యావరణ శాఖ మంత్రిగా ఉన్న పంకజ ముండేను కోరింది. కాలుష్య నియంత్రణకు తీసుకుంటున్న చర్యలు, పరిశ్రమల ప్రభావం, ప్రజల ఆరోగ్యంపై పడుతున్న ప్రభావం వంటి అంశాలపై వివరించాలని సభ్యులు ప్రశ్నించారు.ఈ సందర్భంగా మంత్రి పంకజ ముండే కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ విషయంపై పూర్తి వివరాలు తెలుసుకోవడానికి తాను ప్రత్యేకంగా సమావేశాలు ఏర్పాటు చేసినప్పటికీ, మహారాష్ట్ర కాలుష్య నియంత్రణ బోర్డు సభ్య కార్యదర్శి ఐఏఎస్ అధికారి ఎం దేవేందర్ సింగ్, జాయింట్ డైరెక్టర్ సతీష్ పద్వాల్ తదితరులు హాజరుకాలేదని ఆరోపించారు. పలుమార్లు రిమైండర్లు ఇచ్చినప్పటికీ స్పందన రాలేదని, అంతేకాకుండా తాను మీటింగ్‌కు రానని మెసేజ్ పంపారని తెలిపారు.అధికారుల నుంచి సమగ్ర సమాచారం అందకపోవడంతో సభకు పూర్తి స్థాయి సమాధానం ఇవ్వలేక పోతున్నానని మంత్రి స్పష్టం చేశారు. అధికారుల అవిధేయత వల్ల ప్రజలకు సమాధానం చెప్పే మంత్రుల సామర్థ్యం దెబ్బతింటుందని, ఇది పరిపాలన వ్యవస్థకు మంచిది కాదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదిలావుండగా సభను నడిపిస్తున్న ప్రొటెం స్పీకర్ దిలీప్ లాండే ఈ ఘటనను తీవ్రంగా పరిగణించారు. మంత్రి సమావేశాలకు అధికారుల గైర్హాజరు కావడం శాసనసభకు అవమానకరమని వ్యాఖ్యానించారు. ఇది తీవ్ర నిర్లక్ష్యంగా భావించి, ప్రభుత్వం వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రొటెం స్పీకర్ సూచనల మేరకు రాష్ట్ర ప్రభుత్వం వేగంగా స్పందించింది. ఐఏఎస్ అధికారి ఎం దేవేందర్ సింగ్, జాయింట్ డైరెక్టర్ సతీష్ పద్వాల్‌పై సస్పెన్షన్ వేటు వేసింది. అధికారుల నిర్లక్ష్యానికి ఇది గట్టి హెచ్చరికగా భావిస్తున్నారు.ఈ ఘటన మహారాష్ట్ర రాజకీయాలు, పరిపాలన వ్యవస్థలో చర్చనీయాంశమైంది. మంత్రులతో సమన్వయం పాటించకుండా వ్యవహరించిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవడం పరిపాలనలో క్రమశిక్షణకు దోహదం చేస్తుందని కొందరు అభిప్రాయపడుతుండగా, మరికొందరు ఇది అధికార యంత్రాంగంలో ఉద్రిక్తతలకు దారి తీసే అవకాశం ఉందని వ్యాఖ్యానిస్తున్నారు.ఇకపై ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం మరిన్ని మార్గదర్శకాలు తీసుకురావాలని శాసనసభ సభ్యులు సూచిస్తున్నారు. ప్రజల సమస్యలపై సమగ్రంగా స్పందించేందుకు అధికారులు, మంత్రులు పరస్పర సహకారం అవసరమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.ఈ ఘటనతో మహారాష్ట్రలో పరిపాలనా వ్యవస్థలో క్రమశిక్షణ, బాధ్యతలపై మళ్లీ చర్చ మొదలైంది. ప్రభుత్వ నిర్ణయం భవిష్యత్తులో అధికారులకు ఒక పాఠంగా మారుతుందా అనే అంశంపై అందరి దృష్టి నిలిచింది.

# కాకినాడ జిల్లా సామర్లకోట మండలంలో ఘోర పేలుడు...

## 18 మందికిపైగా మృతి చెందినట్లు అనుమానం....



కాకినాడ//ఫిబ్రవరి 28 (ఆకాంక్ష) : కాకినాడ జిల్లాలోని సామర్లకోట మండలం వేట్లపాలెం జి.మేడుపాడు మధ్య శనివారం మధ్యాహ్నం జరిగిన భారీ పేలుడు స్థానికంగా తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. పెదపూడి రోడ్డుకు సమీపంలోని పొలాల్లో నడుస్తున్న ఒక బాణాసంచా తయారీ కేంద్రంలో ఒక్కసారిగా భారీ శబ్దంతో పేలుడు సంభవించింది. ఈ ఘటనలో 18 మందికిపైగా మృతి చెందినట్లు స్థానికుల నుంచి ప్రాథమిక సమాచారం అందింది. మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారని తెలిసింది.పేలుడు ధాటికి అక్కడ పనిచేస్తున్న కార్మికులు, పరిసర ప్రాంతాల్లో ఉన్న వ్యక్తులు తీవ్రంగా ప్రభావితమయ్యారు. పేలుడు తీవ్రత అంతగా ఉండటంతో కొంత మంది మృతదేహాలు దూరంగా ఉన్న పొలాల్లోకి ఎగిసిపడినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఘటన స్థలమంతా శిథిలాలతో నిండిపోయి ప్రమాదకర వాతావరణం నెలకొంది.ఈ బాణాసంచా తయారీ కేంద్రాన్ని స్థానిక అడపా నాని కుటుంబ సభ్యులు నిర్వహిస్తున్నట్లు సమాచారం. శనివారం మధ్యాహ్నం సాధారణంగా జరుగుతున్న తయారీ పనుల మధ్య ఒక్కసారిగా పేలుడు సంభవించడంతో కార్మికులు తప్పించుకునే అవకాశం కూడా లేకుండా పోయిందని స్థానికులు పేర్కొన్నారు.పేలుడు అనంతరం అక్కడ నిల్వ ఉంచిన పేలుడు పదార్థాలు, రసాయనాలు మంటలకు ఆహుతి కావడంతో మంటలు మరింతగా ఎగసిపడుతున్నాయి. భారీ మంటలతో పాటు అప్పుడప్పుడూ చిన్న చిన్న పేలుళ్లు కూడా చోటు చేసుకుంటుండటంతో సహాయక చర్యలకు ఆటంకం కలుగుతోంది. మంటలు ఇంకా అదుపులోకి రాకపోవడంతో అగ్నిమాపక సిబ్బంది తీవ్రంగా శ్రమిస్తున్నారు.సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన వారిని సమీప ఆసుపత్రులకు తరలించారు. ఇంకా కొంతమంది కార్మికులు శిథిలాల మధ్య చిక్కుకున్నట్లు సమాచారం అందడంతో వారిని రక్షించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. అయితే, మంటలు తీవ్రంగా ఉండటంతో లోపలికి వెళ్లడం కష్టసాధ్యంగా మారింది.భారీ పేలుడు శబ్దం దూరప్రాంతాల వరకు వినిపించడంతో పరిసర గ్రామాల ప్రజలు భయాందోళనకు గురయ్యారు. పలువురు ప్రజలు భయంతో ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. ప్రాంతమంతా ఉద్రిక్తతతో నిండిపోయింది. ఘటనపై ఉన్నతాధికారులు స్పందించి పూర్తి వివరాలను సేకరిస్తున్నారు. మృతుల సంఖ్య, గాయపడిన వారి వివరాలపై అధికారికంగా స్పష్టత రావాల్సి ఉంది. ప్రమాదానికి కారణాలపై విచారణ ప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు.ఈ ఘోర ప్రమాదం నేపథ్యంలో స్థానిక ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం తక్షణ సాయం అందించాలని, ఇలాంటి ప్రమాదాలు మళ్లీ జరగకుండా బాణాసంచా తయారీ కేంద్రాలపై కట్టుదిట్టమైన నియంత్రణలు అమలు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# స్మార్ట్ సిటీ దిశగా సమిష్టి కృషికి మేయర్ పిలుపు...

## నల్లగొండ జిల్లా కేంద్రంలో కార్పొరేషన్ తొలి సమావేశం...



నల్లగొండ//ఫిబ్రవరి 28 (ఆకాంక్ష) : నగర అభివృద్ధిని రాజకీయాలకు అతీతంగా ముందుకు తీసుకెళ్లి నల్లగొండను స్మార్ట్ సిటీగా రూపుదిద్దాలని మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. శనివారం నల్లగొండ మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో జరిగిన కార్పొరేషన్ తొలి సమావేశంలో ఆమె మాట్లాడారు. పట్టణాన్ని రాబోయే కాలంలో అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిపేందుకు అందరూ కలిసికట్టుగా పనిచేయాలని కార్పొరేటర్లకు సూచించారు. చిన్న సమస్యైనా రాజకీయాలు పక్కనపెట్టి తన దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని కోరారు.మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సహకారంతో మరిన్ని నిధులు మంజూరు చేయించుకుని నగరాభివృద్ధికి బాటలు వేయాలని మేయర్ తెలిపారు. పారిశుధ్యం, తాగునీరు, వీధిలైట్ల సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కరించేందుకు కార్పొరేటర్లు ముందుండాలని పిలుపునిచ్చారు. నల్లగొండ పట్టణ ప్రజలకు 24 గంటల పాటు తాగునీరు అందించే విధంగా ప్రణాళికలు సిద్ధం చేశామని, వచ్చే ఏడాదికల్లా కృష్ణా జలాలను నిరంతరం సరఫరా చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని వివరించారు.విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ఐదు సబ్‌స్టేషన్ల నిర్మాణం చేపట్టినట్లు, అందులో ఒకటి ఇప్పటికే పూర్తయిందని, మిగతావి త్వరలో పూర్తిచేసి వేసవిలో కరెంట్ కొరత లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రకాశం బజార్‌లో ఎదురవుతున్న సమస్యలను దృష్టిలో ఉంచుకుని అక్కడి వీధి వ్యాపారులను ప్రత్యామ్నాయ ప్రదేశాలకు తరలించి కనీస సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు చేపట్టినట్లు చెప్పారు.ఈ సందర్భంగా పలువురు కార్పొరేటర్లు మాట్లాడుతూ పట్టణంలోని వీధుల్లో పారిశుధ్య సమస్య తీవ్రంగా ఉందని, వీధి లైట్లు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, దోమల ఉధృతి అధికంగా ఉందని మేయర్ దృష్టికి తీసుకువచ్చారు. పదో డివిజన్‌లో అండర్‌గ్రౌండ్ డ్రైనేజ్ పనులను వేగవంతంగా, నాణ్యతతో పూర్తి చేయాలని కోరారు. దీనిపై స్పందించిన మేయర్ అన్ని సమస్యలను పరిశీలించి త్వరితగతిన పరిష్కరించేందుకు కట్టుబడి ఉన్నామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో కమిషనర్ బచ్చలకూరి శరత్‌చంద్ర, డిప్యూటీ మేయర్ అమేర్, కార్పొరేటర్లు మారగోని భవాని గణేష్, మందడి లిఖిత సైదిరెడ్డి,రేగట్టే అండాలు లింగస్వామి, దాసరి సాయి, రామగిరి అఖిల్, బాగవతు డిప్లా నాయక్, పేర్ల మల్లేశ్వరి, దొడ్డి రమేష్, రత్నపురం తారకమ్మ, గోపగాని స్వాతి, పెరిక యాదయ్య, ఇటుకల మంగమ్మ, ఇబ్రహీం, కేసాని వేణుగోపాల్ రెడ్డి, అబ్బగోని కవిత, బోయినపల్లి వేదశ్రీ, యామ కవితరాణి పాల్గొన్నారు.

# విద్యార్థుల్లో విజ్ఞాన స్ఫూర్తి పెంపొందించాలి...

## పాఠశాల యాజమాన్యం పిలుపు...



తిమ్మాపూర్//ఫిబ్రవరి 28 (ఆకాంక్ష) : నేషనల్ సైన్స్ డే సందర్భంగా తిమ్మాపూర్ మండల కేంద్రంలోని ఎస్ఎస్ఆర్ హై స్కూల్‌లో శనివారం సైన్స్ ఫెయిర్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, సృజనాత్మకత, ఆవిష్కరణా శక్తిని పెంపొందించే లక్ష్యంతో నిర్వహించబడింది. పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రదర్శనలో విద్యార్థులు తయారు చేసిన వివిధ రకాల సైన్స్ ప్రాజెక్టులు ఆకట్టుకున్నాయి.ప్రాథమిక స్థాయి నుంచి ఉన్నత తరగతుల విద్యార్థుల వరకు అందరూ ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. పర్యావరణ పరిరక్షణ, శుద్ధ ఇంధనం, జల సంరక్షణ, విద్యుత్ ఉత్పత్తి, ఆరోగ్య సంరక్షణ వంటి విభిన్న అంశాలపై విద్యార్థులు రూపొందించిన మోడళ్లు సందర్శకులను ఆకర్షించాయి. పర్యావరణ హిత పరికరాలు, సోలార్ ఎనర్జీ ఆధారిత నమూనాలు, రీసైక్లింగ్ విధానాలు వంటి ప్రాజెక్టులు ప్రత్యేకంగా ప్రశంసలు అందుకున్నాయి.ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులు తమ ప్రాజెక్టుల రూపకల్పన, ఉపయోగం, సామాజిక ప్రయోజనం గురించి తోటి విద్యార్థులకు, ఉపాధ్యాయులకు వివరించారు. ప్రతి స్టాల్ వద్ద విద్యార్థులు నిలబడి తమ ప్రాజెక్టులపై సందేహాలను నివృత్తి చేయడం, వివరణలు ఇవ్వడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. చిన్నారులలోని సృజనాత్మకతను చూసి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ బర్మయ్య మాట్లాడుతూ సైన్స్ ఫెయిర్ వంటి కార్యక్రమాలు విద్యార్థులలో ఆలోచనా శక్తిని పెంపొందిస్తాయని తెలిపారు. పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా ప్రాక్టికల్ జ్ఞానం పొందేందుకు ఇటువంటి ప్రదర్శనలు ఎంతో ఉపయోగకరమని అన్నారు. విద్యార్థులు ప్రశ్నించే స్వభావం పెంపొందించుకోవాలని, శాస్త్రవేత్తలుగా ఎదగాలంటే చిన్నప్పటి నుంచే ఆసక్తి పెంచుకోవాలని సూచించారు.పాఠశాల డైరెక్టర్ జితేందర్ మాట్లాడుతూ ఆధునిక యుగంలో విజ్ఞానం అత్యంత ముఖ్యమైందని, శాస్త్ర సాంకేతిక రంగాల్లో భారత్ ప్రపంచానికి దారి తీస్తోందని పేర్కొన్నారు.విద్యార్థులు కొత్త ఆలోచనలు చేయాలని సమస్యలకు సృజనాత్మక పరిష్కారాలు కనుగొనాలని పిలుపునిచ్చారు. ప్రతి విద్యార్థి కనీసం ఒక శాస్త్రీయ ప్రాజెక్ట్ చేయడం అలవాటు చేసుకోవాలని ఆయన సూచించారు.ఉపాధ్యాయులు మాట్లాడుతూ సైన్స్ డే సందర్భంగా నిర్వహించిన ఈ ఫెయిర్ విద్యార్థుల్లో పరిశోధనా దృక్పథాన్ని పెంపొందించిందని తెలిపారు. పాఠశాల స్థాయిలోనే శాస్త్రంపై ఆసక్తి పెంచితే భవిష్యత్తులో మంచి శాస్త్రవేత్తలు, ఇంజనీర్లు, ఆవిష్కర్తలు పుట్టుకొస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. విద్యార్థుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించేందుకు ఇలాంటి కార్యక్రమాలు తరచుగా నిర్వహిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, స్థానిక ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. చివరగా ఉత్తమ ప్రాజెక్టులను ఎంపిక చేసి విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. మొత్తం మీద తిమ్మాపూర్‌లో నిర్వహించిన ఈ సైన్స్ ఫెయిర్ విజ్ఞానోత్సవంలా మారి అందరినీ ఆకట్టుకుంది.

# ఎఫ్‌పీఎస్‌టీ నూతన కమిటీ ఎన్నిక...



కొత్తగూడెం//ఫిబ్రవరి 28 (ఆకాంక్ష) : ఫోరం ఆఫ్ ఫిజికల్ సైన్స్ టీచర్స్ (ఎఫ్‌పీఎస్‌టీ) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నూతన కమిటీని శనివారం కొత్తగూడెంలోని ఆనందఖని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో జరిగిన జిల్లా సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా వ్యాప్తంగా వివిధ మండలాలకు చెందిన ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయులు పాల్గొన్న ఈ సమావేశం ఉత్సాహభరితంగా జరిగింది.ఈ సందర్భంగా ఫోరం జిల్లా అధ్యక్షుడిగా ఎం. మోహన్ రావు (టేకులపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల) ను ఎన్నుకోగా, ప్రధాన కార్యదర్శిగా ఏ. శంకర్‌రావు (జడ్పీహెచ్ఎస్ నెల్లిపాక బంజర), గౌరవ అధ్యక్షుడిగా ఎన్. రాజశేఖర్ (ఏఎంఓ), గౌరవ కార్యదర్శిగా ఎస్‌కే. సైదులు (సీఎంఓ), కోశాధికారిగా ఎస్. యశోద (పాల్వంచ), మహిళా ప్రతినిధిగా జి. అనురాధ (కొత్తగూడెం) ఎన్నికయ్యారు.అలాగే ఉపాధ్యక్షులుగా ప్రభు సింగ్ (ఇల్లెందు), జె. లక్ష్మి (రుద్రంపూర్), బి. బాసు (భద్రాచలం)లను ఎంపిక చేశారు. సహాయ కార్యదర్శులుగా బి. బిచ్చ (ములకలపల్లి), ఉమాదేవి (బూర్గంపాడు), డి. రామిరెడ్డి (పినపాక)లను ఎన్నుకోగా, టెక్నికల్ కార్యదర్శులుగా టి. పాపారావు (పాల్వంచ), సీహెచ్. శ్రీనివాస్ (భద్రాచలం) నియమితులయ్యారు. ఇక డివిజనల్ ఇన్‌చార్జులుగా కె. నాగేశ్వరరావు (మణుగూరు), డి.ఏ. రామకృష్ణ (భద్రాచలం), పి. దుర్గా శైలజ (పాల్వంచ), ఎం.ఎం. భాస్కరాచారి (దమ్మపేట), బి. దేవిలాల్ (కొత్తగూడెం), ఎస్. శాంతకుమారి (జూలూరుపాడు), ఎం. రఘు (ఇల్లెందు)లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ సమావేశానికి డీఎస్ఓ సంపత్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలిపారు. ఉపాధ్యాయుల వృత్తి అభివృద్ధి, విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించడంలో ఫోరం కీలక పాత్ర పోషించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## మహాత్మాగాంధీ యూనివర్సిటీ రిజిస్ట్రార్‌కు

# విద్యార్థి సంఘాల ఘన సన్మానం...



నల్గొండ//ఫిబ్రవరి 28 (ఆకాంక్ష) : నల్గొండలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీలో రిజిస్ట్రార్‌గా బాధ్యతలు చేపట్టిన ప్రొఫెసర్ కొప్పుల అంజిరెడ్డిను శనివారం యూనివర్సిటీ వివిధ విద్యార్థి సంఘాల ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన రిజిస్ట్రార్‌కు పూలబొకెలు అందజేసి, శాలువాలతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ విశ్వవిద్యాలయ అభివృద్ధి, విద్యార్థుల సమస్యల పరిష్కారంలో రిజిస్ట్రార్ కీలక పాత్ర పోషించాలని కోరారు. విద్యా ప్రమాణాల పెంపు, పారదర్శక పరిపాలన, విద్యార్థి సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. యూనివర్సిటీ అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్వేరో స్టూడెంట్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అనుముల సురేశ్ స్వేరో, ఎంఎస్ఎఫ్ యూనివర్సిటీ అధ్యక్షుడు మాచర్ల సుధీర్ మాదిగ, పీడీఎస్‌యూ యూనివర్సిటీ అధ్యక్షుడు హర్ష, వర్సిటీ బీఆర్ఎస్‌వీ అధ్యక్షుడు వాడపల్లి నవీన్, టీఆర్‌వీఎస్ అధ్యక్షుడు పాక రవి, డీఎస్‌యూ అధ్యక్షుడు నిర్సనమెట్ల సుధీర్ మహారాజ్, నాయకులు సతీశ్, శివ, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా వేములవాడలో ప్రపంచ టైలర్స్ దినోత్సవ వేడుకలు...



వేములవాడ//ఫిబ్రవరి 28 (ఆకాంక్ష) : వేములవాడ పట్టణంలో ప్రపంచ టైలర్స్ దినోత్సవాన్ని టైలర్ షాప్ యజమానులు శనివారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఉన్న టైలర్ షాపుల యజమానులు ఒకేచోట చేరి ఈ సందర్భంగా వృత్తి గౌరవాన్ని చాటుతూ ఉత్సాహంగా కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో లేడీస్ టైలర్ సంఘం అధ్యక్షుడు సింగర్ శ్రీను మాట్లాడుతూ టైలర్స్ దినోత్సవం సందర్భంగా దేశ వ్యాప్తంగా ఉన్న టైలర్‌లందరికీ శుభాకాంక్షలు తెలిపారు. టైలరింగ్ వృత్తి అనేది చిన్నచిన్న కుటుంబాలకు ఆదారంగా నిలుస్తోందని, ఎంతోమంది తమ జీవనోపాధిని ఈ వృత్తి ద్వారా సాగిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. అమెరికాలో 1819లో జన్మించిన విలియమ్స్ అనే వ్యక్తి అతి చిన్న వయసులోనే 1845లో కుట్టు మిషన్‌ను రూపొందించి ప్రపంచానికి అందించాడని ఆయన గుర్తు చేశారు. ఆ యంత్రం రూపుదిద్దుకోవడంతో టైలరింగ్ రంగంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయని, అప్పటి నుంచి ఈ వృత్తి మరింత విస్తరించిందని తెలిపారు.ఈ సందర్భంగా టైలర్ షాపుల యజమానులు తమ దుకాణాల వద్ద ప్రత్యేకంగా పూజలు నిర్వహించి, వృత్తి పట్ల గౌరవాన్ని చాటుకున్నారు. కొందరు టైలర్లు పరస్పరం మిఠాయిలు పంచుకుని ఆనందం వ్యక్తం చేశారు. టైలరింగ్ వృత్తి పట్ల యువతలో ఆసక్తి పెంచేందుకు ప్రభుత్వం ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు చేపట్టాలని, చిన్నతరహా వృత్తుల అభివృద్ధికి సహకారం అందించాలని టైలర్ సంఘం నాయకులు కోరారు.ఈ కార్యక్రమంలో పట్టణంలోని పలువురు టైలర్లు, మహిళా టైలర్లు, శిక్షణార్థులు పాల్గొన్నారు.

## మాజీ మున్సిపల్ చైర్మన్ మల్లికార్జున గౌడ్ అరెస్టు..



మెదక్/ఫిబ్రవరి 28 (ఆకాంక్ష) : మెదక్ పట్టణంలో రాజకీయ ఉద్రిక్తత నెలకొంది. మాజీ మున్సిపల్ చైర్మన్, బీఆర్ఎస్ నాయకుడు మల్లికార్జున గౌడ్‌ను పోలీసులు శనివారం తెల్లవారు జామున అరెస్టు చేశారు. మున్సిపల్ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నాయకులు, ఎమ్మెల్యేపై దాడి చేసి హత్యకు యత్నించిన కేసులో ఆయనను అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు.ఈ కేసులో ఇప్పటికే 13 మంది బీఆర్ఎస్ నాయకులను అరెస్టు చేసి సంగారెడ్డి జైలుకు తరలించిన సంగతి తెలిసిందే. తాజాగా మల్లికార్జున గౌడ్‌ను అరెస్టు చేయడంతో మెదక్ పట్టణంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. తెల్లవారు జామున భారీగా పోలీసు బలగాలు మోహరించి, పట్టణంలోని మల్లికార్జున గౌడ్ నివాసానికి చేరుకుని ఇంట్లోకి ప్రవేశించి ఆయనను అదుపులోకి తీసుకున్నారు.ఈ విషయం తెలిసిన వెంటనే బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున మల్లికార్జున గౌడ్ నివాసానికి చేరుకున్నారు. తమ పార్టీ నాయకులపై అక్రమ కేసులు నమోదు చేసి ఉద్దేశపూర్వకంగా అరెస్టులు చేస్తున్నారని వారు ఆరోపించారు. పోలీసులు చర్యలు రాజకీయ ప్రేరేపితమని ఆగ్రహం వ్యక్తం చేశారు. నాయకులు, కార్యకర్తలు నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేయడంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి.అనంతరం పోలీసులు మల్లికార్జున గౌడ్‌ను మెదక్ రూరల్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పరిస్థితి అదుపులో ఉండేందుకు పట్టణంలో అదనపు బలగాలను మోహరించారు. ఈ ఘటనపై మరింత విచారణ కొనసాగుతోందని పోలీసులు వెల్లడించారు.

## నిజామాబాద్ జిల్లా కోటగిరిలో హృదయ విదారక ఘటన...

### మద్యానికి బానిసై కన్నతల్లిని సజీవదహనం చేసిన కొడుకు...




నిజామాబాద్/ఫిబ్రవరి 28 (ఆకాంక్ష) : నిజామాబాద్ జిల్లాలోని కోటగిరి మండల కేంద్రంలో అమానుష ఘటన వెలుగులోకి వచ్చింది. మద్యానికి బానిసైన ఓ వ్యక్తి తనను పెంచిన కన్నతల్లినే సజీవ దహనం చేసిన సంఘటన స్థానికంగా కలకలం రేపింది. కుటుంబ బంధాలను మరిచి, మానవత్వం మరిచిపోయిన ఈ ఘటనపై గ్రామస్థులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళ్తేడ నిజామాబాద్ జిల్లా కోటగిరి మండలానికి చెందిన భూమవ్వ అనే వృద్ధురాలు తన కుమారుడితో కలిసి నివసిస్తూ జీవనం సాగిస్తోంది. భూమవ్వకు ఒకే కొడుకు ఉండగా, అతడు మద్యానికి బానిసై చాలా కాలంగా కుటుంబాన్ని వేధిస్తున్నాడని పొరుగువారు తెలిపారు. రోజూ మద్యం కోసం డబ్బులు ఇవ్వాలని తల్లిపై ఒత్తిడి తెచ్చి, డబ్బులు ఇవ్వలేదని తిట్టి పోసేవాడని తెలిసింది. ఈ క్రమంలో శనివారం ఉదయం కూడా మద్యం కోసం డబ్బులు కావాలని కొడుకు భూమవ్వను అడిగాడు. అయితే తన వద్ద డబ్బులు లేవని వృద్ధురాలు చెప్పడంతో అతడు తీవ్ర ఆగ్రహానికి లోనయ్యాడు. మాట మాటకు గొడవ పెరిగి తల్లిపై దాడికి దిగాడు. అనంతరం తన తల్లిని కొట్టి హత్య చేసినట్టు స్థానికులు చెబుతున్నారు. అక్కడితో ఆగకుండా, తన దారుణాన్ని దాచిపెట్టేందుకు ఇంట్లో ఉన్న పాత బట్టలను భూమవ్వపై వేసి నిప్పంటించాడు. దీంతో వృద్ధురాలు సజీవ దహనమై మృతి చెందింది. ఇంటి నుంచి పొగలు ఎగిసిపడటం గమనించిన స్థానికులు వెంటనే అక్కడికి చేరుకుని పరిస్థితిని చూసి షాక్‌కు గురయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. మద్యానికి బానిసై కుటుంబాన్ని నాశనం చేస్తున్న ఈ ఘటన గ్రామంలో భయాందోళనకు గురిచేసింది. "తల్లిని చంపిన కొడుకు" అనే మాటే గ్రామస్తులను కలచివేస్తోంది. ఇలాంటి ఘటనలు సమాజానికి హెచ్చరికగా మారాలని స్థానికులు పేర్కొంటున్నారు. వృద్ధురాలు భూమవ్వ తన కొడుకును ఎంతో ప్రేమతో పెంచి పెద్దచేసిందని, చివరికి అదే కొడుకు తన ప్రాణాలను తీసుకోవడం గ్రామస్థుల హృదయాలను ముక్కలుగా చేసిందని వారు విచారం వ్యక్తం చేశారు. మద్యపాన వ్యసనం ఎలా కుటుంబాలను చీల్చేస్తుందో ఈ ఘటన మరోసారి రుజువు చేసిందని పెద్దలు పేర్కొన్నారు. ఈ ఘటనపై పోలీసులు పూర్తి స్థాయిలో దర్యాప్తు చేపట్టగా, నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. కుటుంబ వ్యవస్థను కాపాడేందుకు మద్యపానంపై కట్టుదిట్టమైన నియంత్రణలు అవసరమని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

## కోరుట్లలో అగ్ని ప్రమాదం.. రూ.6 లక్షల ఆస్తి నష్టం....



కోరుట్ల//ఫిబ్రవరి 28 ఆకాంక్ష : జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలో శనివారం ఉదయం అగ్ని ప్రమాదం సంభవించి ఓ కుటుంబం తీవ్రంగా నష్టపోయింది. పట్టణంలోని హాజీపురా కాలనీకి చెందిన రజియోద్దీన్ ఇంటిలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగి సుమారు రూ. ఆరు లక్షల మేర ఆస్తి నష్టం సంభవించిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. బాధిత కుటుంబ సభ్యులు, మెట్పల్లి అగ్నిమాపక కేంద్రం ఫైర్ స్టేషన్ ఆఫీసర్ కృష్ణకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం ఉదయం సమయంలో రజియోద్దీన్ నివాసంలో ఒక్కసారిగా విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగి మంటలు వ్యాపించాయి. క్షణాల్లోనే మంటలు తీవ్రరూపం దాల్చడంతో కుటుంబ సభ్యులు అప్రమత్తమై ఇంటి బయటకు పరుగులు తీశారు. ఆ సమయంలో మంటలు వేగంగా వ్యాప్తి చెంది ఇంటిలోని కిచెన్, బెడ్‌రూమ్ భాగాలను పూర్తిగా చుట్టుముట్టాయి. ఈ అగ్ని ప్రమాదంలో ఇంటిలో ఉన్న బట్టలు,మంచాలు, కిటికీలు, తలుపులు, ఫ్రిజ్, ఏసీతో పాటు ఇతర విలువైన గృహోపకరణాలు పూర్తిగా దగ్ధమయ్యాయి. స్థానికులు వెంటనే స్పందించి మంటలను ఆర్పేందుకు ప్రయత్నించినప్పటికీ అప్పటికే భారీ నష్టం వాటిల్లిందని బాధితుడు రజియోద్దీన్ వాపోయాడు. ఈ ప్రమాదంలో సుమారు రూ.6 లక్షల మేర ఆస్తి నష్టం జరిగినట్లు అంచనా వేశారు. సమాచారం అందుకున్న వెంటనే మెట్పల్లి అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తెచ్చారు. ప్రమాదానికి గల కారణాలు, నష్టం అంచనాలకు సంబంధించి వివరాలను నమోదు చేసినట్లు ఫైర్ స్టేషన్ ఆఫీసర్ కృష్ణహరి తెలిపారు. ఈ ఘటనపై స్థానికుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

## నల్గొండ జిల్లాలో ఈదులూరు పాఠశాలకు కీర్తి తెచ్చిన విద్యార్థినులు...

### ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌లో విజయం...



నల్గొండ//ఫిబ్రవరి 28 ఆకాంక్ష : నల్గొండ జిల్లా కట్టంగూర్ మండలంలోని ఈదులూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థినులు ఎం. రక్షర, ఏ. చైత్రిక, ఏ. హారికలు నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్)కు ఎంపికై పాఠశాలకు గర్వకారణమయ్యారు. విద్యా రంగంలో తమ ప్రతిభను చాటుకుంటూ ఈ విజయాన్ని సాధించిన ఈ ముగ్గురు విద్యార్థినులకు సంవత్సరానికి రూ.12 వేల చొప్పున నాలుగు సంవత్సరాల పాటు ఉపకార వేతనం అందనుంది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి. నర్సిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థినుల కృషి, పట్టుదల,గురువుల మార్గదర్శకత కలిసి ఈ విజయానికి కారణమయ్యాయని తెలిపారు. సాధారణ కుటుంబాల నుంచి వచ్చిన ఈ విద్యార్థినులు తమ చదువుపై చూపిన అంకితభావంతోనే ఈ ఘనత సాధించారని కొనియాడారు. పాఠశాల విద్యా కమిటీ చైర్మన్‌తో పాటు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు విద్యార్థినులను అభినందిస్తూ భవిష్యత్‌లో మరింత ఉన్నత స్థాయికి ఎదిగి సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. గ్రామస్థులు కూడా ఈ విజయాన్ని ఆనందంగా స్వాగతిస్తూ పాఠశాల ప్రతిష్ఠను రాష్ట్ర స్థాయిలో చాటినందుకు ప్రశంసలు కురిపించారు. ఈ విజయం ద్వారా ఈదులూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యా ప్రమాణాలు మరింత మెరుగై, గ్రామీణ విద్యార్థులు కూడా పట్టుదలతో ప్రయత్నిస్తే ఉన్నత స్థాయికి చేరగలరని మరోసారి నిరూపితమైంది.

## కాల్వశ్రీరాంపూర్ మండలం గంగారం గ్రామంలో ఘనంగా పౌరహక్కుల దినోత్సవం...



కాల్వశ్రీరాంపూర్//ఫిబ్రవరి 28 ఆకాంక్ష : కాల్వశ్రీరాంపూర్ మండలంలోని గంగారం గ్రామంలో శనివారం పౌరహక్కుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ రేకుల జ్యోతి రఘు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో గ్రామ పెద్దలు, అధికారులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు ప్రసంగిస్తూ సమాజంలో కులమత భేదాలు లేకుండా అందరూ సోదరభావంతో కలిసిమెలిసి జీవించాలని పిలుపునిచ్చారు. మనుషుల మధ్య అంటరానితనం, అసమానతలకు స్థానం ఉండకూడదని, ప్రతి వ్యక్తి సమాన హక్కులతో జీవించే సమాజ నిర్మాణం కోసం గ్రామం ముందుండాలని సూచించారు. గ్రామంలో ఎక్కడా కులవివక్షకు తావులేకుండా, మానవత్వం ప్రధానంగా ఉండే వాతావరణాన్ని నెలకొల్పుతామని నాయకులు హామీ ఇచ్చారు. ప్రతి కుటుంబం, ప్రతి వ్యక్తి పౌరహక్కుల విలువలను అర్థం చేసుకుని వాటిని కాపాడే బాధ్యత తీసుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో ఉపసర్పంచ్ మేడి అశోక్ గౌడ్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు అంబాల రాజేందర్, సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి షాబుద్దీన్, వీపీఓ ఎండీ అన్వర్, హెల్త్ సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి, వార్డు సభ్యులు మిర్యాల మల్లేష్, చిక్కుల వంశీ, ఆశా వర్కర్లు సుమ, శైలజతో పాటు గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## శ్రీలక్ష్మీనరసింహ స్వామి సన్నిధిలో గవర్నర్ కుటుంబ సమేతంగా పూజలు..

### వేద మంత్రోచ్చారణల నడుమ ఆలయ అర్చకుల ఘన స్వాగతం...



యాదగిరిగుట్ట//ఫిబ్రవరి 28 ఆకాంక్ష : యాదాద్రి భువనగిరి జిల్లా ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలో శనివారం భక్తి పరవశం నెలకొంది. నల్లు ఇంద్రాసేనా రెడ్డి కుటుంబ సమేతంగా ఆలయానికి విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. తెల్లవారుజామునే యాదగిరిగుట్టకు చేరుకున్న ఆయనను దేవస్థాన అధికారులు, అర్చకులు మర్యాద పూర్వకంగా ఆహ్వానించారు. శనివారం ఉదయం వీవీఐపీ అతిథి గృహంలో స్వల్ప విశ్రాంతి అనంతరం గవర్నర్ ప్రధాన ఆలయానికి చేరుకున్నారు. ఆలయ ముఖ మండపం వద్ద ప్రధాన అర్చకులు వేదమంత్రోచ్చారణల నడుమ పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. సంప్రదాయ పద్ధతిలో పాదప్రక్షాళన చేసి దేవాలయానికి ఆహ్వానించడం ద్వారా ఆయనను ఆలయ ఆచార వ్యవహారాల ప్రకారం లోపలికి తీసుకెళ్లారు. అనంతరం గర్భగుడిలో స్వయంభూ శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారిని దర్శించుకున్న గవర్నర్ ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అర్చకులు స్వామివారికి అర్చనలు, నైవేద్యాలు సమర్పించగా, గవర్నర్ కుటుంబ సభ్యులతో కలిసి మంగళహారతి వీక్షించారు. దేవాలయ వైభవం, శిల్పకళా సౌందర్యం, ఆలయ నిర్మాణంలో జరిగిన ఆధునిక పునర్నిర్మాణం గవర్నర్‌ను ఆకట్టుకుంది. దర్శనం అనంతరం ఆలయ ప్రధాన అర్చక బృందం వేద ఆశీర్వచనం అందజేసి గవర్నర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో భవానీ స్వామి ప్రసాదాన్ని గౌరవ సూచకంగా అందజేశారు. స్వామివారి తలపాగా, పట్టు వస్త్రాలతో గవర్నర్‌ను సత్కరించారు. ఆలయ అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులు గవర్నర్‌కు వివరాలు తెలియజేశారు. భక్తుల రద్దీ మధ్య గవర్నర్ దర్శనం ప్రశాంతంగా కొనసాగేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పోలీసు బందోబస్తు మధ్య గవర్నర్ సందర్శన ఎలాంటి అవాంతరాలు లేకుండా పూర్తయ్యింది. ఆలయ పరిసరాల్లో శుభ్రత, భద్రత చర్యలను అధికారులు మరింత కట్టుదిట్టం చేశారు. గవర్నర్ యాదగిరిగుట్ట సందర్శనతో ఆలయానికి మరింత ప్రాధాన్యం చేకూరిందని అధికారులు పేర్కొన్నారు. రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన భక్తులు గవర్నర్ దర్శనాన్ని ఆసక్తిగా వీక్షించారు. యాదాద్రి క్షేత్రం దేశవ్యాప్తంగా ఆధ్యాత్మిక కేంద్రంగా మరింత ఖ్యాతి పొందుతున్న నేపథ్యంలో ప్రముఖుల సందర్శనలు క్షేత్రానికి మరింత కీర్తి తెస్తున్నాయని భక్తులు తెలిపారు. దర్శనం అనంతరం గవర్నర్ దేవాలయ పరిసరాల్లో కొద్దిసేపు గడిపి తిరుగు ప్రయాణం అయ్యారు. భక్తుల మధ్య స్వామివారి దర్శనం పొందడం పట్ల సంతోషం వ్యక్తం చేసిన గవర్నర్, దేశ ప్రజల శాంతి, సౌభాగ్యాల కోసం ప్రార్థించినట్లు తెలిపారు.

## పెళ్లి పేరుతో మోసం చేసిన ప్రియుడు

### సహాయం పేరుతో తీసుకెళ్లిన వ్యక్తి చేతిలో మృత్యువు...

### బస్టాండ్ నుంచి బిల్డింగ్ పైకప్పు వరకు క్రూరకాండడ

### నాలుగో అంతస్తు నుంచి తోసి హత్య...

భువనేశ్వర్/ఫిబ్రవరి 28 ఆకాంక్ష : ఒడిశా రాష్ట్రంలో మహిళల భద్రతపై ఆందోళన కలిగించే విధంగా ఒక హృదయ విదారక ఘటన వెలుగులోకి వచ్చింది. జగత్‌సింగ్‌పూర్ జిల్లాలో ఒకే రోజు ఇద్దరు వ్యక్తుల చేతిలో ఒక యువతి అత్యాచారానికి గురై, అనంతరం దారుణంగా హత్యకు గురైన సంఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపుతోంది. పోలీసుల వివరాల ప్రకారం, తిర్టోల్ ప్రాంతానికి చెందిన 23 ఏళ్ల యువతి ఫిబ్రవరి 22న తన ప్రియుడితో కలిసి ఇంటి నుంచి బయటకు వెళ్లింది. పెళ్లి చేసుకుంటానని నమ్మబలికిన ఆ ప్రియుడు ఆమెను ఒక గుడి వద్దకు రప్పించి, అక్కడి నుంచి ఏకాంత ప్రదేశానికి తీసుకెళ్లి అత్యాచారం చేశాడు. అనంతరం ఆమెను రహమా బస్టాండ్ వద్ద వదిలేసి అక్కడి నుంచి వెళ్లిపోయాడు. బస్టాండ్ వద్ద ఒంటరిగా, నిరాశతో ఉన్న యువతిని గమనించిన జార్ఖండ్‌కు చెందిన మరో వ్యక్తి సహాయం చేస్తానని నమ్మబలికి తన బైక్‌పై పారాదీప్‌కు తీసుకెళ్లాడు. అక్కడ అద్దె ఇంటి బిల్డింగ్‌పైకి తీసుకెళ్లి ఆమెపై అత్యాచారం చేసి,అనంతరం నాలుగో అంతస్తు నుంచి కిందకు తోసి హత్య చేసినట్లు పోలీసులు తెలిపారు. మరుసటి రోజు ఉదయం స్థానికులు గుర్తించిన యువతి మృతదేహాన్ని చూసి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్ట్‌మార్టం కోసం తరలించారు. ఇదే సమయంలో యువతి కనిపించడం లేదని ఆమె సోదరుడు ఇచ్చిన ఫిర్యాదును పరిశీలించిన పోలీసులు, కేసును నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. దర్యాప్తులో భాగంగా పోలీసులు ఇద్దరు నిందితులను గుర్తించి అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు. ప్రియుడు మరియు జార్ఖండ్‌కు చెందిన వ్యక్తి ఇద్దరూ యువతిపై అత్యాచారం చేసి, హత్యకు పాల్పడ్డట్లు తేలడంతో వారిపై పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. ఈ ఘటనపై పోలీసులు మరింత లోతైన దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ఇదిలా ఉండగా, మాజీ ముఖ్యమంత్రి, అసెంబ్లీలో ప్రతిపక్ష నేత, బీజేడీ అధినేత నవీన్ పట్నాయక్ ఈ ఘటనను తీవ్రంగా ఖండించారు. రాష్ట్రంలో మహిళలపై నేరాలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేసిన ఆయన, "ఇంకా ఎంతమంది అమాయకులు ప్రాణాలు కోల్పోవాలి?" అని రాష్ట్రంలోని భారతీయ జనతా పార్టీ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈ ఘటనతో ఒడిశా రాష్ట్రంలో మహిళల భద్రతపై మళ్లీ చర్చలు మొదలయ్యాయి. ప్రజలు మహిళల భద్రత కోసం కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. పోలీసులు నిందితులకు కఠిన శిక్షలు పడేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## జూలూరుపాడు మండలంలో మెగా సైన్స్ ఫెయిర్ సందడి....

### సాయి ఎక్సలెంట్ స్కూల్ ఆధ్వర్యంలో విద్యార్థుల ప్రతిభ ప్రదర్శన....



కొత్తగూడెం//ఫిబ్రవరి 28 ఆకాంక్ష : ప్రఖ్యాత భారతీయ శాస్త్రవేత్త, నోబెల్ బహుమతి గ్రహీత సి. వి. రామన్ కనుగొన్న రామన్ ఎఫెక్ట్ దినోత్సవాన్ని పురస్కరించుకుని జూలూరుపాడు మండల కేంద్రంలోని సాయి ఎక్సలెంట్ పాఠశాలలో శనివారం మెగా సైన్స్ ఫెయిర్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులలో శాస్త్రీయ దృక్పథం పెంపొందించేందుకు, పరిశోధనాత్మకతను వెలికి తీయాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమం సందడిగా జరిగింది. ఈ సైన్స్ ఫెయిర్‌కు ముఖ్య అతిథులుగా కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు, జిల్లా కబడ్డీ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ లేళ్ళ వెంకటరెడ్డి, జూలూరుపాడు ఎస్సై రవి, జేఎన్‌టియుహెచ్ జేఏసీ చైర్మన్ డా. మంద రంజిత్ హాజరై రిబ్బన్ కట్ చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శనకు ఉంచిన వివిధ శాస్త్రీయ ప్రాజెక్టులను తిలకించి, వారి ప్రతిభను అభినందించారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులని, విద్యార్థులు చిన్ననాటి నుంచే ప్రయోగాలు చేస్తూ దేశ అభివృద్ధికి బాటలు వేయాలని సూచించారు. సైన్స్ ఫెయిర్ వంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో ఆలోచనాశక్తి, సృజనాత్మకత పెంపొందుతుందని పేర్కొన్నారు. మండల కేంద్రంలో పట్టణ స్థాయి విద్యను అందిస్తూ, డిజిటల్ తరగతులను అమలు చేస్తున్న సాయి ఎక్సలెంట్ పాఠశాల యాజమాన్యాన్ని ప్రశంసించారు. జేఎన్‌టియుహెచ్ జేఏసీ చైర్మన్ డా. మంద రంజిత్ మాట్లాడుతూ విద్య అనేది కేవలం ఉద్యోగానికి సాధనం కాదని, అది వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దే శక్తి అని పేర్కొన్నారు. శాస్త్ర విజ్ఞానం ప్రశ్నించే ధైర్యాన్ని పెంపొందిస్తుందని, సందేహించే మనసే ఆవిష్కరణలకు పునాది అవుతుందని వివరించారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో నిలవాలంటే గుణాత్మక విద్య, క్రమ శిక్షణ, నిరంతర సాధన అవసరమని విద్యార్థులకు సూచించారు. స్కూల్ ఛైర్మన్ హుస్సేన్, కరస్పాండెంట్ కృష్ణప్రసాద్‌ల సేవలను అతిథులు అభినందించారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం ఎప్పటికప్పుడు అండగా ఉంటామని హామీ ఇచ్చిన డా. రంజిత్, హరిత ఫౌండేషన్ ద్వారా స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు ఆర్.ఓ ప్లాంట్‌ను స్పాన్సర్ చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వెంకటేశ్వర్లు, వెంకన్నపాలెం మాజీ ఎంపీటీసీ దుద్దుకూరి మధుసూదన్ రావు, బేతాళపాడు సర్పంచ్ మహేష్, నాయకులు వళ్ళోజి రమేష్, కిషన్, భవిష్య కళాశాల కరస్పాండెంట్ రాంరెడ్డి, ప్రైవేటు విద్యాసంస్థల జిల్లా సెక్రటరీ, సెయింట్ పీటర్స్ మోడల్ స్కూల్ కరస్పాండెంట్ జోహార్ జో, సాయి ఎక్సలెంట్ పాఠశాల డైరెక్టర్లు ఆరెబోయిన నాగలక్ష్మి, జక్కుల శివకుమారి, ఉపాధ్యాయులు నాగరాజు, అనిత, అశోక్, నవీన, దుర్గభవాని, సత్యవతి, రమేష్, ఉదయభాను, పావని, కళ్యాణి, ప్రశాంతి, భార్గవి, నందిని, అరుణ, స్వాతి, త్రివేణి, శిరీష, రిచిత, రమాదేవి, సౌజన్య, హైమావతి, శాంతమ్మ, భాస్కర్‌తో పాటు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సైన్స్ ఫెయిర్ సందర్భంగా విద్యార్థులు రూపొందించిన మోడల్స్, శాస్త్రీయ ప్రయోగాలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమం మొత్తం శాస్త్ర విజ్ఞానంతో నిండిన ఉత్సాహభరిత వాతావరణంలో సాగింది.

## రోడ్డు ప్రమాదంలో యువతి మృతి....

నిజామాబాద్//ఫిబ్రవరి 28 ఆకాంక్ష : నిజామాబాద్ జిల్లా రుద్రూర్ గ్రామానికి చెందిన యువతి రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. రుద్రూర్‌కు చెందిన జయదేవ్‌ప్రసన్న దంపతులు తమ పిల్లల ఉన్నత చదువుల కోసం గత కొన్ని నెలలుగా హైదరాబాద్‌లో స్థిరపడి జీవనం సాగిస్తున్నారు. వీరికి ఒక కుమార్తె గౌతమి, ఒక కుమారుడు ఉన్నారు. గౌతమి రుద్రూర్ ఆహార పరిశోధన కేంద్రంలో డిప్లమో పూర్తి చేసి, హైదరాబాద్‌లో ఉన్నత చదువులు కొనసాగిస్తూ ఉండేది. ఈ క్రమంలో శనివారం నగరంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గౌతమి తీవ్రంగా గాయపడింది. వెంటనే సమీప ఆసుపత్రికి తరలించగా, వైద్యులు చికిత్స అందించినప్పటికీ ఆమె ప్రాణాలు నిలుపుకోలేకపోయింది. ఈ దుర్ఘటన సమాచారం తెలిసిన వెంటనే కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. గౌతమి మృతదేహాన్ని పోస్ట్‌మార్టం అనంతరం స్వగ్రామమైన రుద్రూర్‌కు తరలించారు. గ్రామంలో శోకసంద్రం నెలకొంది. చిన్న వయస్సులోనే చదువులో ప్రతిభ చూపుతూ ఉన్న గౌతమి ఆకస్మిక మృతి అందరినీ కలచివేసింది. స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. రోడ్డు ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. గౌతమి మరణం రుద్రూర్ గ్రామానికి తీరని లోటుగా మారిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## పెద్దపల్లి పట్టణంలోని స్ఫూర్తి పాఠశాలలో దివ్యాంగులకు అన్నదానం...




పెద్దపల్లిటౌన్//ఫిబ్రవరి 28 ఆకాంక్ష : నిరుపేదలు, ఆపన్నులకు సేవ చేయడంలోనే నిజమైన తృప్తి దాగి ఉందని బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షురాలు సుద్దాల లత, 9వ వార్డు సభ్యులు సుద్దాల సతీష్ గౌడ్ పేర్కొన్నారు. శనివారం తమ 22వ వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని పెద్దపల్లి పట్టణంలోని స్ఫూర్తి మానసిక దివ్యాంగుల పాఠశాలలో విద్యార్థులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. సాధారణంగా వేడుకలను ఆడంబరంగా జరుపుకునే కాలంలో, సుద్దాల దంపతులు మాత్రం దివ్యాంగుల మధ్య తమ పెళ్లి రోజు జరుపుకోవడం ఆదర్శవంతమైన చర్యగా నిలిచింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న స్థానికులు, పాఠశాల సిబ్బంది వారి సేవాభావాన్ని ప్రశంసిస్తూ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా బీజేపీ నాయకులు వెల్లంపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ, ప్రజాసేవా బాధ్యతలు నిర్వహిస్తున్న నాయకులు ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపట్టడం సమాజానికి ఆదర్శమని కొనియాడారు. సమాజంలో అట్టడుగు వర్గాల అభ్యున్నతికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సుద్దాల సతీష్ గౌడ్, సుద్దాల లతలతో పాటు పలువురు బీజేపీ నాయకులు, పాఠశాల బాధ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అన్నదానం నిర్వహించి, వారికి అవసరమైన సాయం అందజేశారు. సమాజానికి సేవ చేయాలనే తపనతో నిర్వహించిన ఈ కార్యక్రమం స్థానికంగా ప్రశంసలు అందుకుంది. దివ్యాంగుల మధ్య ఆనందాన్ని పంచుకోవడం ద్వారా సుద్దాల దంపతులు తమ పెళ్లి వార్షికోత్సవాన్ని ప్రత్యేకంగా నిలిపారు.

## ఎంఈఓగా డి. కురుమయ్య బాధ్యతల స్వీకారం...




నాగర్ కర్నూల్ టౌన్//ఫిబ్రవరి 28 ఆకాంక్ష : నాగర్ కర్నూల్ మండల విద్యాధికారిగా (ఎంఈఓ) జడ్‌పిహెచ్‌ఎస్ గుడిపల్లి జీహెచ్‌ఎం డి. కురుమయ్య శనివారం అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. మండలంలోని సీనియర్ గెజిటెడ్ హెడ్‌మాస్టర్లకు ఎంఈఓ బాధ్యతలు అప్పగించాలనే నిబంధనల మేరకు ఆయనకు నియామక పత్రాలను జిల్లా విద్యాశాఖాధికారి రమేష్ కుమార్ అందజేశారు. ఇప్పటివరకు ఎంఈఓగా బాధ్యతలు నిర్వహించిన భాస్కర్ రెడ్డి, కురుమయ్య కంటే జూనియర్ కావడంతో ఆయనను ఆ బాధ్యతల నుంచి తప్పిస్తూ ఈ నియామకం చేపట్టినట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు. బాధ్యతల స్వీకరణ అనంతరం పలువురు ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు కురుమయ్యను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నూతన ఎంఈఓ డి. కురుమయ్య మాట్లాడుతూ మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను మరింత మెరుగు పరచేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తానన్నారు. పాఠశాలల పర్యవేక్షణను క్రమం తప్పకుండా నిర్వహిస్తూ విద్యార్థులకు నాణ్యమైన బోధన అందేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా టెస్ట్ బుక్ మేనేజర్ నరసింహులు, వివిధ ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## నాగ్సాన్పల్లిలో ఉపాధి హామీ పనులపై డిఆర్పి బృందం తనిఖీలు...



మెదక్//ఫిబ్రవరి 28 ఆకాంక్ష : మెదక్ జిల్లాలోని పాపన్నపేట మండలం నాగ్సాన్పల్లి గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులపై డిఆర్పి బృందం విస్తృతంగా తనిఖీలు నిర్వహించింది. గత మూడు రోజులుగా గ్రామంలో ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారుల పరిస్థితులను, పనుల అమలును పరిశీలిస్తూ సర్వే చేపట్టింది. డిఆర్పి సభ్యులు స్వామి, సాయమ్మ, గంగామణి గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ప్రత్యక్షంగా పరిశీలించి కార్మికులతో మాట్లాడారు. ఉపాధి హామీ పనుల అమలులో ఎలాంటి అవకతవకలు జరిగినా వాటిని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామని డిఆర్పి సభ్యులు స్పష్టం చేశారు. పనుల పారదర్శకతపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తూ కార్మికుల హాజరు నమోదు, వేతనాల చెల్లింపులు, పనుల నాణ్యత తదితర అంశాలను సమీక్షించారు. నేడు మల్లయ్య కుంటలో కొనసాగుతున్న ఉపాధి హామీ పనులను డిఆర్పి స్వామి ప్రత్యక్షంగా తనిఖీ చేశారు. గ్రామంలో ప్రస్తుతం ఈజీఎస్ వర్క్‌ల కింద మొత్తం 11 చెరువులు, రెండు నర్సరీలు, రెండు హరితహారాలు అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. ఈ పనుల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో నీటి వనరుల అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణకు తోడ్పాటు లభిస్తోందని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా డిఆర్పి స్వామి మాట్లాడుతూ, నిరుపేద కుటుంబాలకు ఉపాధి హామీ పథకం గొప్ప ఆదారంగా నిలుస్తుందని పేర్కొన్నారు.



గ్రామంలోని ప్రతి అర్హ కుటుంబం ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపు నిచ్చారు. జాబ్ కార్డు లేని కుటుంబాలకు కొత్తగా జాబ్ కార్డు మంజూరు చేయించేందుకు దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు. పథకం అమలులో గ్రామస్థుల సహకారం అత్యంత అవసరమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీనివాస్, ఉపాధి హామీ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు. ఉపాధి హామీ పనులపై డిఆర్పి బృందం నిర్వహించిన ఈ తనిఖీలు గ్రామంలో పారదర్శకత, బాధ్యతాయుత నిర్వహణకు దోహదపడతాయని స్థానికులు అభిప్రాయపడ్డారు.